లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాస పత్రిక

# జనబలం

ప్రజలే ప్రభువులు

జనవరి 2020 రూ.10/-



## కొత్త సంవత్సరం - పెను సవాళ్లు

# 3.5 % రూల్

(3.5శాతం ప్రజల భాగస్వామ్యం +
అహింసాయుత పద్ధతులు +
సంఘటిత పనితీరు = ఉద్యమ విజయం)



# హైదరాబాద్ కన్సల్టేషన్

హైదరాబాద్ కన్సల్టేషన్‌లో భాగంగా ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), 'ప్రజ' భాగస్వామ్యంతో ఎఫ్‌డీఆర్ కార్యాలయంలో ఏర్పాటైన సమావేశంలో నగరపాలనలోని సమస్యలు, పరిష్కారాలపై చర్చించారు.



ప్రజలే ప్రభువులు

# జనబలం

లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాసపత్రిక


| సంపుటి 23 సంచిక 1<br>జనవరి 2020 | సంపాదకవర్గం<br>బండారు రామ్మోహనరావు<br>శిరమని నరేష్ | వర్కింగ్ ఎడిటర్<br>దూసనపూడి<br>సోమసుందర్ |
|---|---|---|


## జనబలం చందా రుసుము వివరాలు

| | |
|---|---|
| సంవత్సర చందా | రూ. 100.00 |
| మూడు సంవత్సరాలకు చందా | రూ. 290.00 |
| ఐదు సంవత్సరాలకు చందా | రూ. 475.00 |
| జీవితకాలపు చందా | రూ. 1200.00 |

*జనబలంలో ప్రచురితమవుతున్న వ్యాసాలలో రచయిత(త్రు)లు వెలిబుచ్చే అభిప్రాయాలు కేవలం వారి సొంతం. జనబలం సంపాదకవర్గం ఆ అభిప్రాయాలతో ఏకీభవిస్తున్నట్టు కాదు.*

## చందాదారులకు విజ్ఞప్తి

చాలా మంది చందా గడువు ముగిసినా జనబలం పత్రికను మీకు ప్రతీనెలా పంపుతున్నాము.అట్టివారు తప్పక తమ చందాను వెంటనే పునరుద్ధరించుకోగోరుతున్నాము. చందా డబ్బును Foundation for democratic reforms పేరున జనబలం కార్యాలయంనకు పంపగలరు.

## లోపలి పేజీల్లో...


06 కొత్త సంవత్సరం - పెనుసవాళ్ళు

09 3.5% రూల్!


16 భయమేస్తోంది సమాజమా!

18 'దిశ' లేని పాలన .. 'దిశ' లేని న్యాయం!




కార్యాలయ చిరునామా : తులిప్స్ అపార్ట్‌మెంట్స్ 6-3-655, ప్లాట్ నెం 407, సివిల్ సప్లయిస్ ఆఫీస్ వెనుక,
సోమాజిగూడ, హైదరాబాద్-500 082 ఫోన్: 040-23310288
Email: janabalam.loksatta@gmail.com, loksattaudyamasamstha@gmail.com

## కార్టూన్ కార్నర్




## జనబలంలో ప్రకటన రేట్లు



| | |
|---|---|
| **కలర్‌పేజీ:** | **10,000** |
| **ఇన్‌సైడ్‌పేజీ బ్లాక్ అండ్ వైట్ :** | **5,000** |
| **ఫుల్‌పేజీ బ్లాక్ అండ్ వైట్ :** | **2,000** |
| **సగం పేజీ బ్లాక్ అండ్ వైట్:** | **1,000** |

ప్రకటన రుసుము, ప్రకటనకు సంబంధించిన ఫొటోలు, సమాచారం ప్రతినెలా 20వ తేదీ లోపుగా మాకు అందేలా పంపించగలరు. చందా మొత్తాలను, ప్రకటనల ధర మొత్తాలను చెక్కుగాని, డి.డి. ద్వారా గాని FOUNDATION FOR DEMOCRATIC REFORMS పేర పంపవచ్చును. NEFT సౌకర్యము ద్వారా పంపదలచినవారు SBI PUNJAGUTTA BRANCHలోని SB A/C. No. 52086568057కి IFSC CODE No. SBIN0020072కు పంపి, Transaction I.D. No. మరియు తారీఖు తప్పనిసరిగా తెలియజేయవలెను. నగదు రూపంలో చెల్లించదలచిన వారు లోక్‌సత్తా సంస్థ కేంద్ర కార్యాలయంలో ఇచ్చి రశీదు పొందవలెను

**చిరునామా: సంపాదకుడు, జనబలం, లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాసపత్రిక,**
*తులిప్స్ అపార్ట్‌మెంట్స్, 6-3-655, ఫ్లాట్ నెం 407, సివిల్ సప్లయిస్ ఆఫీస్ వెనుక,*
*సోమాజిగూడ, హైదరాబాద్-500 082*

# పెచ్చుమీరుతున్న విభజన రాజకీయం

05
జనబలం
జనవరి 2020
లోక్‌సత్తా ఉద్యమ సంస్థ
మాసపత్రిక

సంపాదకీయం

పాలనా వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మళ్ళించడానికి పాలకులు నిరంతరం ప్రయత్నిస్తూనే ఉంటారు. ప్రజలు పాలకుడిని ప్రశ్నించే పరిస్థితి తలెత్తినపుడు యుద్ధం తీసుకురావాలని కౌటిల్యుని అర్థశాస్త్రం బోధిస్తుంది. నాటి నుండి నేటి వరకూ పాలకులు ఇదే దుర్నీతిని పాటిస్తూ వస్తున్నారు. ఈ విషయంలో మోదీ - షా నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం రెండాకులు ఎక్కువే చదివింది. అచ్చేదిన్, సబ్‌కా సాత్ - సబ్‌కా వికాస్, స్వచ్ఛ భారత్, శ్రేష్ఠ భారత్, అవినీతి అంతం, నిరుద్యోగ నిర్మూలన వంటి నినాదాలతో 2014లో ఎన్నికల్లో గెలిచిన బీజేపీ తన వాగ్దానాలన్నింటినీ పూర్తిగా విస్మరించింది. నోట్లరద్దువ ంటి ప్రయోగం వికటించినా దాన్నో విజయంగా ఇప్పటికీ కీర్తిస్తూనే ఉంది. జాతీయ అంతర్జాతీయ ఆర్థిక వేత్తలు, నిపుణులు, నోట్ల రద్దు చర్యను తప్పుపడుతున్నా బీజేపీ ప్రచారకులు అంగీకరించడం లేదు. ఎదురుదాడితో దబాయింపులకు పూనుకుంటున్నారు. అసోం ఎన్ఆర్సీ ప్రక్రియ అస్సామీయ సమాజంలో తీరని అమానుష విషాదాన్ని నింపింది. అయినప్పటికీ అదే ప్రక్రియని దేశ వ్యాప్తంగా చేపట్టేందుకు బీజేపీ ప్రభుత్వం సన్నాహాలు సాగిస్తోంది. ఆర్టికల్ 370 రద్దు, ట్రిపుల్ తలాక్ నిషేధ చట్టం, పౌరసత్వ సవరణ బిల్లు వంటి చర్యల ద్వారా సమాజంలో అశాంతిని, కల్లోలాలను ప్రేరేపిస్తోంది. భావోద్వేగాలను రెచ్చగొడుతోంది. మతప్రాతిపదికపై విభజన తెచ్చి హిందూ మెజారిటేరియన్ ధృవీకరణకు ఉద్దేశ్యపూర్వకంగా పూనుకుంటోంది.

నిజానికి దేశ ఆర్థిక వ్యవస్థ మున్నెన్నడూ లేని పతనావస్థలో ఉంది. గత ఏడు త్రైమాసికాల కాలంలో స్థూల జాతీయోత్పత్తి పడిపోతూ వచ్చింది. ప్రస్తుతం 4.5శాతం దగ్గర తచ్చాడుతోంది. వాస్తవానికి ఇది మరింత తక్కువగా ఉంటుందని ప్రధానమంత్రి పూర్వ ఆర్థిక సలహాదారు అరవింద్ సుబ్రహ్మణ్యం అంటున్నారు. అంతర్జాతీయ ఆర్థిక సంస్థలన్నీ భారతీయ ఆర్థిక వ్యవస్థ తీరు తెన్నులపై పెదవి విరుస్తున్నాయి. ఎగుమతులు క్షీణించాయి. తయారీరంగం అస్తవ్యవస్థంగా వుంది. వ్యవసాయ సంక్షోభం తీవ్రస్థాయిలో ఉంది. బ్యాంకింగు రంగం పరిస్థితి అగమ్యగోచరంగా ఉంది. నిరుద్యోగిత ఆరు, ఏడుశాతానికి చేరుకున్నది. పరిశ్రమల మూసివేత కొనసాగుతున్నది. ఇది తాత్కాలికమేనని ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ చెపుతున్నారు. అయితే ఇదో దీర్ఘకాలిక మందగమనమని, దీని పర్యవసానాలు మన ఆర్థిక వ్యవస్థని మరింతగా పతనం చేస్తాయని ఆర్థిక వేత్తలు హెచ్చరిస్తున్నారు. దేశ ఆర్థిక రంగం కుదేలై ప్రజలు పడరాని ఇబ్బందులు భరించాల్సి వస్తోంది. అయితే మోదీ, షా ద్వయం దీనిపై దృష్టి సారించడం లేదు. ఆర్థిక రంగం దిగజారినా, సామాజిక సామరస్యం దెబ్బతిన్నా వారికి పట్టడం లేదు. దేశరాజకీయ రంగంలో తమ పట్టు బిగించడమే లక్ష్యంగా వారు పని చేస్తున్నారు. హిందూ మెజారిటీ ని సంఘటితం చేయడానికి ఒక వూహాజనిత శత్రువును సృష్టించే ప్రయత్నం సాగిస్తున్నారు. మత ప్రాతిపదికపై భారతీయ సమాజంలో విభజన తీసుకొచ్చేందుకు పని గట్టుకుని విద్వేష పూరిత ప్రచారాన్ని సాగిస్తున్నారు. అవాస్తవాలను కట్టుకథలను వ్యాప్తిలోకి తెచ్చేందుకు ఒక పెద్ద సామాజిక మాధ్యమ దళాన్ని ప్రచార యుద్ధంలోకి దించారు. తమ రాజకీయ విజయమే ఈ సైన్యం లక్ష్యం. ప్రభుత్వ వైఫల్యాలను సైతం సాఫల్యాలుగా కీర్తించడం, విమర్శకుల నోళ్ళను నొక్కడం, భిన్నాభిప్రాయాలను అవహేళన చేయడం, బహిరంగ చర్చలో నాగరిక ప్రమాణాలను పక్కన బెట్టి బూతు పంచాంగాలను తెరవడం వంటి వికృత పోకడలకు తెరతీసారు. పత్రికలను, ప్రసార మాధ్యమాలను నయాన, భయాన తమ అదుపులోకి తెచ్చుకున్నారు. రాజకీయ విజయాల సాధనకు రాజ్యాంగాన్ని, రాజ్యాంగ విలువలను , వ్యవస్థలను నిస్సంకోచంగా దుర్వినియోగం చేస్తున్నారు. నిజమైన ప్రజా సమస్యలపై చర్చరానీయకుండా నిరంతరం భావోద్వేగాలతో ప్రజలను పక్కదారి పట్టిస్తున్నారు.

తాజాగా పార్లమెంటు ఆమోదించిన పౌరసత్వ చట్ట సవరణ బిల్లు మరోసారి దేశంలో ప్రజల మధ్య విభజనకు దారితీసేదిగా ఉంది. ఆర్థిక సామాజిక, సాంస్కృతిక అణచివేతలకూ, పీడనకు గురయ్యే మైనారిటీ ప్రజలు ఎవరైనా సరే ఆశ్రయం కోరితే జాతి, మత, వర్ణ, లింగ వివక్షల్లేకుండా అక్కున చేర్చుకోవడం ఒక అత్యున్నత మానవతా విలువ, వలసదారుల, శరణార్థుల సమస్యల ఇమిడి ఉన్న మానవతా కోణాన్ని పక్కనపెట్టి, దానిస్థానంలో మత పరమైన ప్రాతిపదికను తెచ్చిపెట్టడం కేవలం అనాగరిక చర్య. పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్, బంగ్లాదేశ్‌ల నుండి వచ్చే మైనారిటీలకు శరణు ఇచ్చి రక్షణ కల్పిస్తున్నట్లు అమిత్ షా చెప్పారు. మరి అటువంటి ఔదార్యం శ్రీలంక, యమన్మార్, భూటాన్ దేశాల నుండి వచ్చే మైనారిటీల పట్ల ఎందుకు చూపలేదన్న ప్రశ్నకు ఆయన సమాధానం చెప్పలేకపోయారు. దీన్ని శరణార్థుల సమస్యగా కాకుండా ఇస్లాంను భూతంగా చూపడానికి, ముస్లింల పట్ల వివక్ష సృష్టించడానికి మాత్రమే ఉద్దేశించారని తేటతెల్లం అవుతోంది. పౌరసత్వ చట్ట సవరణ ద్వారా భయాందోళనలతో ముస్లింలు సంఘటితం అవుతారు కాబట్టి, దానినొక భూతంగా చూపించి హిందువులను సంఘటితం చేయవచ్చన్న రాజకీయ లక్ష్యమే బిల్లులో కనిపిస్తోంది. ఎన్నికలు సమీపించిన ప్రతీసారి భావాల ప్రాతిపదికపై ప్రజల్ని విభజించాలని వ్యూహకర్తలు రాజకీయ పార్టీల నేతలకు బోధిస్తూ ఉంటారు. కేవలం నకారాత్మక భావనల ఆధారంగా, ముస్లిములను, క్రైస్తవులను ప్రమాదకారులుగా భావించే సిద్ధాంతం పునాదిగా బీజేపీ ఆవిర్భవించింది. తమ నకారాత్మక భావనలను సమర్థించుకునేందుకు సత్యాలు వాస్తవాలు తోడ్పడక పోవడంతో బీజేపీ అవాస్తవాలను , భ్రమలను, అపోహలను ఆధారం చేసుకుని ప్రచార యుద్ధం సాగిస్తోంది. ఎన్నికల విజయాల సాధనకు తాత్కాలికంగా ఈ వ్యూహం పనికి వస్తుందేమోగాని, భారతీయ సమాజాన్ని మాత్రం ముక్క చెక్కలు చేస్తుంది. అసలే ఆర్థిక పతనం దిశగా దిగజారుతున్న మన దేశం సామాజికంగా మరింత దిగజారే ప్రమాదం కనిపిస్తోంది. తమ రాజకీయ విజయాలు భారతీయ సామాజిక విభజనకు దారితీస్తున్నాయని, దేశంలో విద్వేష వాతావరణం, భయాందోళనలు సృష్టిస్తున్నాయని బీజేపీ పాలకులకు గట్టిగా చెప్పాల్సిన తరుణం ఆసన్నమయ్యింది. దేశ వ్యాప్తంగా విద్యార్థి - యువజనులు ఉద్యమిస్తున్న తీరు భారతీయ ప్రజాస్వామ్యానికి ఆశాకిరణం వంటిదని భావించవచ్చు.

డి. సోమ సుందర్

# కొత్త సంవత్సరం - పెనుసవాళ్ళు

## – డాక్టర్ జయప్రకాష్ నారాయణ్

2019 మే 23న రెండోసారి వరసగా నరేంద్రమోది నాయకత్వంలోని ప్రభుత్వా నికి ప్రజలు అఖండ మెజారిటీని ఇచ్చి బాధ్యతలని అప్పగించారు. 1971 తరువాత రెండు పర్యాయాలు వరసగా ఒకే పార్టీకి, నాయకుడికి లోక్‌సభలో మెజారిటీ మద్దతు లభించటం ఇదే మొదలు.

1984లో లోక్‌సభ ఎన్నికలు ఒక అసాధారణ నేపథ్యంలో, ఆనాటి ప్రధానమంత్రి శ్రీమతి ఇందిరాగాంధి దారుణహత్య తరువాత దేశమంతా ఉద్వేగభరిత వాతావరణంలో ఉన్నప్పుడు జరిగాయి. పదవిలో ఉన్న ప్రధానమంత్రిని ఆమె రక్షకులే బలితీసుకున్న నేపథ్యంలో, పంజాబ్‌లో ఉగ్రవాదం రెక్కలు విప్పి దేశ సమగ్రతకి పెనుసవాలుగా పరిణమించిన పరిస్థితులలో ప్రజలు రాజీవ్‌గాంధి నాయకత్వంలోని కాంగ్రెస్‌కి అసాధారణ మెజారిటీని కట్టబెట్టారు. అప్పటికి 6 సంవత్సరాల క్రితమే చైనా తన ఆర్థిక వ్యవస్థని ఆధునీకరించే ప్రయత్నాన్ని ప్రారంభించింది. 1984-89 కాలంలో ప్రజాస్వామ్యాన్ని పరిపుష్ఠం చేయటానికి, ఆర్థిక సంస్కరణలని చేపట్టి పోటీవ్యవస్థని రూపొందించటానికి, పాలనని సమూలంగా సంస్కరించి ప్రజల జీవితాలని సమూలంగా మార్చటానికి అద్భుతమయిన అవకాశం వచ్చింది. అయినా ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవటంలో మన రాజకీయవ్యవస్థ విఫలమయింది.




అదేరీతిన 2014లో నరేంద్రమోది పట్ల అచంచల విశ్వాసంతో ప్రజలు మార్పుని కోరుతూ ఎన్నికలలో తీర్పునిచ్చారు. 2019లో మరో అవకాశాన్నిచ్చారు. ఈ తీర్పులు యథాస్థితిని కొనసాగించటం కోసం కాదు; మన రాజకీయాన్ని, పాలనని, ఆర్థిక వ్యవస్థని సమూలంగా మార్చి స్వచ్ఛరాజకీయాన్ని, మంచిపాలనని, ప్రజల ఆకాంక్షలు, అవసరాలు తీర్చే బలమయిన ఆర్థికవ్యవస్థని నిర్మాణం చేస్తారన్న ఆశతో మోదికి ప్రజలు మద్దతిచ్చారు.

రెండోసారి మోదికి బాధ్యతలప్పగించిన తరువాత కేవలం కొద్దిమాసాలే గడిచాయి. కాని ఇప్పటికే దేశంలో చాలా ప్రాంతాలలో అసంతృప్తి, నిరసన వ్యక్తమవుతున్నాయి. గత నెలరోజుల కాలాన్నే తీసుకుంటే రెండు అంశాలపైన అన్నివర్గాల ప్రజల నుంచి తీవ్రమయిన భావోద్వేగాలు వ్యక్తమయినాయి. వాటిలో ఒకటి హైదరాబాదు నగర శివార్లలో దిశపై జరిగిన అత్యాచారం, దేశవ్యాప్తంగా ప్రజలలో వ్యక్తమయిన భయాందోళనలు, నలుగురు నేరస్తులు పోలీసుల కాల్పులలో మరణించటం, అప్పుడు వ్యక్తమయిన ఆనందోత్సాహాలు. ఇందులో మోది ప్రమేయం లేదు అలాగే ఇది ఒక ప్రభుత్వం ఒక్కరోజున సృష్టించిన సమస్య కాదు; అయినా దీర్ఘకాలంగా చట్టబద్ధపాలన ద్వారా ప్రజలకి భద్రత కల్పించటంలో మన వ్యవస్థ వైఫల్యానికి దిశ ఉదంతం ఒక నిదర్శనం. ప్రభుత్వం మొట్టమొదటి బాధ్యత శాంతిభద్రతలని కాపాడటం, ప్రజలకి రక్షణ ఉందనే భరోసా కల్పించటం, నేరాలని అదుపు చేయటం, చట్టబద్ధపాలన ద్వారా సత్వరన్యాయాన్ని అందించటం, కఠిన శిక్షలు న్యాయస్థానాల ద్వారా పడే చర్యలు చేపట్టటం. కాని ఎన్ని ప్రభుత్వాలు వచ్చినా, వారికి ఎంత ప్రజాదరణ లభించినా, ఈ మౌలికమయిన బాధ్యతని నెరవేర్చటంలో దేశమంతా మన వ్యవస్థ విఫలమయింది. చట్టబద్ధపాలనని సంస్కరించటం క్షణాల్లో జరిగే పని కాదు; ఇది ఒక సంతకంతోనో, ప్రకటనతోనో సినిమాల్లోలాగా నాటకీయంగా వచ్చే మార్పు కాదు. పకడ్బందీగా, దీర్ఘకాలికమయిన దృక్పథంతో, ఓవంక ప్రజల భద్రత, నేరస్తులకి శిక్ష, మరోవంక ప్రాథమిక హక్కుల పరిరక్షణ, అమాయకుల రక్షణ, ఈ రెండింటి మధ్య సమతూకాన్ని పాటిస్తూ బలమయిన పోలీసు, ఫోరెన్సిక్స్, స్వతంత్ర నేరపరిశోధన, సమర్థమయిన ప్రాసిక్యూషన్, కోర్టులలో వేగంగా నేరవిచారణ. వీటన్నింటినీ ఏర్పాటు చేస్తేనే చట్టబద్ధపాలన గట్టి పునాదుల మీద నిలబడి ప్రజలకి రక్షణనిస్తుంది. కాని అన్ని పార్టీలు, అన్ని ప్రభుత్వాలు ప్రథమ కర్తవ్యమయిన చట్టబద్ధపాలనని నిర్లక్ష్యం చేసి యథాస్థితిని కొనసాగించాయి. ప్రజలు ప్రతిరోజు ఆందోళనలు చెయ్యలేరు కాబట్టి అడపాదడపా దారుణ నేరాలు మహానగరాలలో జరిగినప్పుడు – ఆరేళ్ళ క్రితం ఢిల్లీలో నిర్భయ కేసు గాని, ఇప్పుడు హైదరాబాదులో దిశ కేసు గాని– తీవ్రంగా స్పందిస్తున్నారు. కాని ప్రభుత్వాలు తాత్కాలిక ఉపశమనాన్ని చేపట్టి ప్రజలని శాంతిపరచటం తప్ప, తమకున్న అధికారాన్ని, పలుకుబడిని వ్యవస్థలో కావలసిన మార్పులు తేవటానికి ఉపయోగించలేదు. మోదిని ప్రజలెన్నుకున్నది కేవలం అధికారం చెలాయించటానికి కాదు; దశాబ్దాల పర్యంతం కుళ్లిపోయిన వ్యవస్థని సంస్కరించి బలమయిన పునాదుల మీద

నిలబెట్టటానికి. చాలాకాలంగా జాతీయస్థాయిలోను, రాష్ట్రాలలోను, వివిధ పార్టీల ప్రభుత్వాలు చట్టబద్ధపాలనని నిర్లక్ష్యం చేసి యధాస్థితిని కొనసాగించటం వల్లనే కాలక్రమేణా మహిళలకి రక్షణ కరువయిందనే భయాందోళనలు సమాజాన్ని అతలాకుతలం చేస్తున్నాయి. అలాగే నేరం చేస్తే శిక్ష పడుతుందన్న భయం నశించిపోయింది. అందుకు కారణం మన దేశంలో నేరస్తుడు తన నేరాన్ని అంగీకరిస్తే తప్ప, మిగిలిన కేసుల్లో శిక్షలు పడేది 10 శాతం కంటే తక్కువే.

పోలీసు స్టేషన్లో కేసు నమోదు చేస్తే సరయిన పరిశోధన జరిగి సాక్ష్యాలతో కోర్టు ముందుకు వెళ్ళే కేసులు, కోర్టులు నేరారోపణ చేసి విచారణ చేపట్టే కేసులు బహుశా సగమే ఉంటాయి. వాటిల్లో నేరవిచారణ సంవత్సరాల తరబడి జరిగి, ఆ తరువాత కేవలం నూటికి పది లోపల కేసుల్లో మాత్రమే శిక్ష పడితే, ఇక సమాజంలో నేరస్తులకి భయం ఉండదు; ప్రజలకి రక్షణ ఉండదు. ఈ చట్టబద్ధపాలనలోని వైఫల్యం దశాబ్దాలుగా కొట్టొచ్చినట్లు కన్పిస్తున్నా మౌలికమయిన మార్పుని తెస్తానని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన మోదీ గత ఐదున్నరేళ్ళుగా మార్పు కోసం కనీస ప్రయత్నం చేసిన, చేస్తున్న దాఖలాలు లేవు. ఇలా చేయవలసిన పనులు చేపట్టకుండా ప్రభుత్వాలు కాలయాపన చేస్తూ, తాత్కాలిక అంశాల మీద దృష్టిని పెట్టి ప్రజలిచ్చిన మద్దతుని వృథా చేస్తే సంక్షోభాలు ముదురుతూనే ఉంటాయి; ఏదో ఒక రూపంలో ఆందోళనలు పెరుగుతూనే ఉంటాయి; సమాజం అతలాకుతలం అవుతూనే ఉంటుంది.



ఇక ఇటీవల భావోద్వేగాలని, ఆందోళనలని పెంచిన మరో అంశం ప్రభుత్వం కావాలని తెచ్చిన పౌరసత్వ చట్టసవరణ. చట్టబద్ధపాలనని సంస్కరించలేకపోవటం కేవలం ప్రభుత్వ వైఫల్యం. కాని సమాజంలో అందరినీ కలిపేరీతిన, జాతి ఔన్నత్యం, రాజ్యాంగ విలువలు ఇనుమడించే తీరున కాకుండా పెద్దగా ప్రజాప్రయోజనం లేకున్నా వివిధ వర్గాల మధ్య అపనమ్మకాన్ని పెంచేరీతిన చట్టసవరణ చేపట్టటం నిర్లక్ష్యం వల్ల యధాలాపంగా జరిగిన పొరపాటు కాదు; ప్రభుత్వం కావాలని చేపట్టిన చర్య.

భారతదేశం వేల సంవత్సరాల చరిత్రలో నిరంతరం అన్ని మతాలకి, భావాలకి స్వాగతం పలికింది, ఆశ్రయమిచ్చింది. 2600 ఏళ్ళ క్రితమే యూదులు మన గడ్డ మీద అడుగుపెట్టి, నాటికీ, నేటికీ ఏ రకమయిన వివక్ష లేకుండా జీవిస్తున్నారు. క్రీస్తు శిలువనెక్కిన కొద్ది సంవత్సరాలకే క్రైస్తవం మన మలబారు తీరానికి వచ్చి, ఆనాటి నుంచి ఎలాంటి వేధింపులు లేకుండా మనదేశంలో మన గలుగుతోంది. పార్శీలు పర్షియాలో దాడుల నుంచి తప్పించుకుని మన గడ్డ మీద అడుగుపెట్టి ఈ దేశ నిర్మాణంలో నాటికి, నేటికి కీలకపాత్ర వహిస్తున్నారు. మహమ్మదు ప్రవక్త నిర్యాణం తరువాత కొద్ది దశాబ్దాలకే ఇస్లాం భారత్‌లోకి ప్రవేశించి ఏ ఆటంకం లేకుండా మన దేశంలో పూర్తి స్వేచ్ఛతో మనగలుగుతోంది. అలాంటి నేపథ్యంలో మన పొరుగుదేశాల్లో మతవివక్ష కారణంగా వేధింపులకి, హింసకి గురయినవారికి ఆశ్రయాన్నివ్వటం మన సమాజానికి సహజ లక్షణం. అదే లక్ష్యమయితే, మతవివక్షకి, మతం కారణంగా హింసకి గురయ్యేవారందరికి ఆశ్రయాన్నిచ్చి పౌరసత్వాన్ని కల్పించే సవరణని అన్ని వర్గాల మద్దతుతో, ఎవరికీ ఆందోళన, అశాంతి కలగకుండా సునాయాసంగా చేపట్టవచ్చు. కాని ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా ఇదేదో ఇస్లాంకి వ్యతిరేకంగా చేస్తున్నారేమోననే అనుమానాన్ని పెంచేరీతిలో చట్టం చేసింది. ఆపైన ఈశాన్య భారతంలో కొన్ని ప్రత్యేక పరిస్థితులలో బంగ్లాదేశ్ నుంచి వలస వచ్చినవారిని గుర్తించటం కోసం చేపట్టిన పౌరుల పట్టికని దేశమంతా ఖచ్చితంగా అమలు చేసి, విదేశాల నుంచి వచ్చిన 'చెదలుని' పారద్రోలుతామని మళ్ళీమళ్ళీ ప్రకటనలు చేసి కావాలని ఆందోళనలని, ఉద్యమాలని ప్రభుత్వ నాయకులే రెచ్చగొట్టారు. అంటే ఈ మొత్తం ఉదంతంలో మతవివక్షకి గురయిన పొరుగు దేశస్తుల మీద సానుభూతి, ప్రేమలకి బదులు, మన దేశంలోని ఇస్లాం మతస్తులకి అభద్రతని పెంచటమే నిజమయిన సంకల్పం అనే అనుమానం సహజంగా తలెత్తుతుంది. ఈ అనుమానాన్ని వెంటనే తొలగించే ప్రయత్నం చేయకుండా, రెచ్చగొట్టే ప్రకటనలతో, ప్రసంగాలతో మరింతగా ఆందోళనని బాధ్యతగల మంత్రులే పెంచటం దురదృష్టం. ఇది మన ఇంట్లో మనం చిచ్చుపెట్టుకోవటం. ఇందులో దాగి ఉన్నది ప్రభుత్వం ఉదాసీనతో, వైఫల్యమో కాదు; ఇది కావాలని చేపట్టిన చర్య.

ఈ రెండు ఉదంతాలు పరిశీలిస్తే ఇప్పుడు దేశంలో పెరుగుతున్న అసంతృప్తికి, ప్రజలలో వ్యాపిస్తున్న అభద్రతా భావానికి, జాతినిర్మాణంలోను, ఆర్థికవ్యవస్థని పరిపుష్టం చేయటంలోను మన వైఫల్యానికి కారణాలు బోధపడతాయి. నరేంద్రమోదీ ప్రభుత్వాన్ని ప్రజలెన్నుకున్నది సమస్యలని పరిష్కరించి బలమయిన రాజకీయ, ఆర్థికవ్యవస్థల నిర్మాణాన్ని చేపడతారని, ప్రజల జీవితాలని మెరుగుపరుస్తారని, సమాజంలో సయోధ్యని, సమన్యాయాన్ని పెంచుతారని. అయితే మోదీ, ఆయన ప్రభుత్వం ప్రజల మద్దతుని పొందగలిగారుగాని, ఆ మద్దతు వెనక ఉన్న ప్రజల ఆర్తిని, ఆకాంక్షలని గుర్తించలేక పోయారు. చరిత్రని సమూలంగా మార్చి దేశాన్ని ఆధునీకరించ

టానికి, చైనాకి దీటుగా ఆర్థికవ్యవస్థని అభివృద్ధి చేయటానికి, సమాజంలో సామరస్యభావనని పెంపొందించటానికి, ప్రపంచంలో ఒక ఉన్నతమైన నాగరికతకి ప్రతీకగా భారత్‌ని నిలబెట్టటానికి ఒక అద్భుత అవకాశాన్ని ప్రజలు మోదికి ఇచ్చారు. ఇంకా నాలుగున్నరేళ్ళ సమయం మోది ప్రభుత్వానికి ఉంది. కొంతకాలం వృథా అయినా ఇంకా సమయం మించి పోలేదు.

ఇప్పటికయినా దేశప్రజలందరినీ కలిపి అద్భుతమయిన మార్పులు తెచ్చి చరిత్రలో చిరకాలం నిలిచిపోయే అవకాశం మోదికి ఉంది. ప్రభుత్వానికి వనరుల కొరత ఉంది. చాలా రాష్ట్రాలు ఆర్థిక సంక్షోభం అంచున ఉన్నాయి. తాత్కాలిక తాయిలాలు అదుపు తప్పిపోవటంతో ప్రభుత్వాలకి రేపటి కోసం పెట్టుబడులు కరువయ్యాయి. చమురు ధరలు తగ్గిన కారణంగా ఆదా అయిన వనరులన్నీ వృథా అయిపోయాయి. ఆర్థిక ప్రగతి మందగించింది. ప్రభుత్వాల ఆదాయాలు ఆశించినంతగా పెరగకపోగా, అనుత్పాదక ఖర్చులు మాత్రం భారీగా పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆర్థిక క్రమశిక్షణను పాటించటం, రాష్ట్రాలలో తాయిలాల కోసం పెట్టే ఖర్చుపైన చట్టబద్ధంగా అదుపుచేయటం అవసరం. పార్టీలు తమంతట తామే తాయిలాలని ఆపటం సాధ్యమయ్యే పనికాదు; ఏ పార్టీ అయినా తాయిలాలనివ్వకుండా ప్రజల ఆదాయాలని పెంచే కార్యక్రమాలనే చేపడతామంటే, నేటి పరిస్థితులలో ప్రజలు ఆ పార్టీని తిరస్కరించటం ఖాయంగా కనిపిస్తోంది. కాబట్టి గతంలో ద్రవ్యలోటుని అదుపుచేయటానికి ఎఫ్.ఆర్.బి.యం చట్టాన్ని తెచ్చినట్లుగా, జి.ఎస్.టి కోసం రాజ్యాంగ సవరణని తెచ్చినట్లుగా, అన్ని పార్టీలని కలిపి, కేంద్ర, రాష్ట్రాలకు మధ్య ఏకాభిప్రాయాన్ని సాధించి, తాత్కాలిక జనాకర్షక పథకాలు రాష్ట్రాల బడ్జెట్‌లో పరిమిత శాతాన్ని దాటకుండా ఉండేలా చట్టాన్ని తేవటం అవసరం. ప్రధానమంత్రి మోదికి ఆ స్థాయి, నైపుణ్యం ఉన్నాయి. ప్రభుత్వ బడ్జెటులని ఒక గాడిన పెట్టకపోతే, మరో తీవ్ర ఆర్థికసంక్షోభం వచ్చే కొద్ది సంవత్సరాలలోనే పొంచి ఉంది.

1991 నాటి ఆర్థిక సంస్కరణల వల్ల మంచి ఫలితాలు వచ్చాయి. కాని ఇటీవల ఆర్థికాభివృద్ధి మందగించింది. మౌలిక సదుపాయాలు, కాంట్రాక్టుల అమలుకు వేగిరమయిన ఏర్పాటు, చైనా నుంచి తరలిపోతున్న పరిశ్రమలు మన దేశంలో స్థాపించటానికి, పెట్టుబడులు పెద్దఎత్తున వేగంగా రావటానికి కావలసిన చర్యలు, కార్మిక చట్టాల సవరణ, పరిశ్రమల కోసం భూమి సేకరణ, పోటీ ఆర్థికవ్యవస్థ పెరగటానికున్న అవరోధాలని తొలగించటం, సేవలలో అవినీతిని అంతం చేయటం, సంపదసృష్టి కేవలం పోటీ మీద, ఉత్పత్తి సామర్థ్యం, నాణ్యతల మీదే ఆధారపడి ఉంటుందని, రాజకీయ జోక్యం గాని, వివక్ష గాని, ఆశ్రిత పక్షపాతం గాని ఉండవన్న నమ్మకం కలిగించటం– వీటి మీద యుద్ధప్రాతిపదికన దృష్టిని సారించటం అత్యవసరం.

2020లోకి ప్రవేశించే సందర్భంలో దేశంలో అలుముకున్న నైరాశ్యాన్ని తొలగించాలి. అటు ఆర్థికవ్యవస్థని పెంచటానికి పైన పేర్కొన్న చర్యలని చేపట్టటం అవసరం. కాని అవి చాలవు. చట్టబద్ధపాలనని సంస్కరించటం, అధికారాన్ని బాధ్యతతో కలిపి వికేంద్రీకరించటం, ప్రజలకి సేవలని విధిగా, కాలపరిమితిలోగా అందించే చట్టాన్ని చేసి అమలు చేయటం, అవినీతిని అదుపుచేసేందుకు కావలసిన వ్యవస్థాగత ఏర్పాట్లని చేయటం, ప్రస్తుతం చేస్తున్న ఖర్చులోపలే ఉత్తమ ప్రమాణాల విద్యని ప్రతి బిడ్డకి అందించటం కోసం సమగ్ర సంస్కరణలని తేవటం, పరిమిత వ్యయంలో మంచి ఆరోగ్యాన్ని అందరికీ అందించే ఏర్పాట్లని పకడ్బందీగా చేపట్టటం ఇవన్నీ దశాబ్దాలుగా నిర్లక్ష్యానికి గురయినాయి. వీటికి డబ్బు ఖర్చు లేదు; కేవలం రాజకీయ సంకల్పం, పాలనా సామర్థ్యం కావాలి. కొత్త సంవత్సరంలో ఈ చర్యలని ప్రారంభించి వచ్చే నాలుగేళ్లలో కావలసిన మార్పులని చేయటం పూర్తిగా సాధ్యం, అత్యవసరం.

ఇక ఎన్నికలలో ఓట్ల కొనుగోలు, కోట్ల ఖర్చు, అంతులేని అవినీతి, దుష్పరి పాలన అంతకంతకు పెరిగిపోతు న్నాయి. మౌలికమయిన రాజకీయ సంస్కరణలని వెనువెంటనే చేపడితేనే ప్రజాస్వామ్యాన్ని సంక్షోభం నుంచి గట్టెక్కించగలం.

ప్రభుత్వాన్ని కనీసం రాష్ట్రాలలో, స్థానిక ప్రభుత్వాలలో ప్రత్యక్షంగా ఎన్నుకునే ఏర్పాట్లు చేయటం, దామాషా పద్ధతి ఎన్నికల వ్యవస్థని ఏర్పరచి రాజకీయాలని సమూలంగా ప్రక్షాళన చేయటం, మూడో అంచె ప్రభుత్వాలకి పూర్తి బాధ్యతలని అప్పగించి, ప్రజలకి జవాబుదారిగా, పారదర్శకంగా స్థానిక ప్రభుత్వాలు పనిచేసేలా ఏర్పాట్లు చేయటం – ఈ మూడు సమూల సంస్కరణలని తెచ్చినప్పుడే ప్రజాస్వామ్యం కేవలం ఒక అధికార క్రీడగా కాకుండా, మనందరికి ఉమ్మడి సేవలందించే సమగ్ర వ్యవస్థగా రూపొందుతుంది. మన దేశం చైనాకి దీటుగా ఎదగటానికి, నిరుద్యోగంతో, అభద్రతతో అలమటించే యువతకి ఉపాధి కల్పించటానికి, విద్య, ఆరోగ్యాలనందించి అణగారిన వర్గాలకి ఆత్మవిశ్వాసాన్ని, అవకాశాలని అందించటానికి సర్వ శక్తుల్ని కేంద్రీకరించటం అవసరం. వీటిని సాధిస్తే, అది నిజమయిన రాజకీయ విజయం. వీటిని సాధించలేని ప్రభుత్వాలు, నాయకులు ఎన్నికలలో నెగ్గవచ్చుగాని, దేశ నిర్మాణంలో, జాతి భవిష్యత్తుని భద్రపరచటంలో విజయం సాధించినట్లు కాదు.

వచ్చే నాలుగేళ్ళు మన దేశ భవిష్యత్తుకు పరీక్షా సమయం. ఈ అవకాశాన్ని అందుకుని చరిత్రని సృష్టించటం ఒక జాతిగా మనకు సాధ్యం. అందుకు ముందుచూపు, రాజకీయ సంకల్పం, సమర్థ నాయకత్వం, ఆరోగ్యకరమయిన బహిరంగ చర్చ, సమాజంలో పరస్పర విశ్వాసం, క్రమశిక్షణ అవసరం. ఈ మార్పులు కేవలం ఒక ప్రధానమంత్రి వల్లనో, ప్రభుత్వం వల్లనో మాత్రమే సాధ్యం కావు; అన్ని వర్గాల ప్రజలు, ఆలోచనాలపరులు ఐకమత్యంతో అవిశ్రాంత కృషి చేస్తేనే సాధ్యం. అందుకు నాయకత్వాన్నిచ్చి నడిపించే అరుదయిన అవకాశం మోది ముందుంది. కొత్త సంవత్సరంలో దాన్ని సద్వినియోగం చేస్తారని ఆశిద్దాం.

# 3.5% రూల్!

(3.5 శాతం ప్రజల భాగస్వామ్యం + అహింసాయుత పద్ధతులు + సంఘటిత పనితీరు = గ్యారంటీ ఉద్యమ విజయం)

## హింసా పోరాటాల కంటే అహింసాయుత ఉద్యమాలదే ఎక్కువసార్లు విజయం

**హింస కంటే 'అహింసాయుత ప్రయత్నం, దాని చుట్టూ 3.5 శాతం మంది జనసమీకరణే విజయానికి మార్గమనే నిర్ధారణకు చెనోవెత్ రావటంపై బీబీసీ ఫ్యూచర్‌కు చెందిన సీనియర్ జర్నలిస్టు డేవిడ్ రాబసన్ ఒక కథనాన్ని ప్రచురించారు. 'సమాజానికి ఏదో ఒకటి చేయాలి, తామూ ఎదగాలి' అని తపించే పౌరులకు, ముఖ్యంగా యువతకు ఎంతో ఉపయోగపడతాయి కాబట్టి.. జనవరి 12న జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా ఆ వివరాల్ని ఈ వ్యాసం ద్వారా అందించే ప్రయత్నం చేస్తున్నాం.**



సాధ్వీ ప్రజ్ఞా సింగ్ ఠాకూర్‌కు ఇష్టం లేకపోయినా 2019 ఎన్నికల్లో ఆమెను భోపాల్ లోక్‌సభా స్థానానికి తమ అభ్యర్థిగా బీజేపీ నిలబెట్టింది. ఎంతో తర్జనభర్జనతో వ్యూహాత్మకంగా ఆమెను నరేంద్రమోదీ, అమిత్‌షా ద్వయం ఎంపికచేసింది. తాను శపించటం వల్లే హేమంత్ కర్కరే మరణించారని, తాను స్వయంగా మసీదు పైకి ఎక్కి బాబ్రీ మసీదును కూల్చివేశానని ఆమె రకరకాలుగా అనుచిత వ్యాఖ్యలు చేసినా, ఆమెను బీజేపీ అగ్రనాయకత్వం వెనకేసుకుని వచ్చింది. కానీ 'గాంధీజీని హత్య చేసిన నాథూరాం గాడ్సే గొప్ప దేశభక్తుడు' అని సాధ్వీ ప్రజ్ఞా సింగ్ చేసిన వ్యాఖ్యను సమర్థించలేని స్థితిలో బీజేపీ అగ్రనేతలు ఇరుక్కుపోయారు. 'ప్రజ్ఞా సింగ్ క్షమాపణలు చెప్పినా ఆమెను ఎన్నటికీ మనస్ఫూర్తిగా క్షమించలేనని' ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించాల్సి వచ్చింది.

ఆ తర్వాత.. మన మనసులోని ఆకాంక్షలకు–మనం చెల్లించే పన్నులకు–మనం వేసే ఓటుకు సంబంధం లేని ఎన్నికల వ్యవస్థ వల్ల ఆమె గాంధీజీ 150వ జన్మదినోత్సవ సంవత్సరంలోనే లోక్‌సభకు ఎన్నికయ్యారు. అక్కడ కూడా షాకింగ్‌గా ప్రజ్ఞాసింగ్‌ను రక్షణ సంబంధిత పార్లమెంటరీ సంప్రదింపుల కమిటీలో బీజేపీ నియమించింది. దీన్ని ఉపయోగించుకుని ఆమె ఏకంగా లోక్‌సభలోనే గాడ్సే దేశభక్తుడు అని ప్రకటించారు. దీనిపై దుమారం చెలరేగటంతో మళ్లీ బీజేపీ ఆమెను మందలించింది. ఆ వ్యాఖ్యలతో తమకు సంబంధం లేదని కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ప్రకటించారు. గాడ్సేను దేశభక్తుడిగా చెప్పడాన్నే కాదు, అలాంటి ఆలోచననే తాము ఖండిస్తున్నామని, గాంధీతత్వం ఎప్పటికీ సజీవంగా ఉంటుందని ఆయన చెప్పుకొచ్చారు. చివరికి ప్రజ్ఞాసింగ్ రెండుసార్లు క్షమాపణ చెప్పటంతో ఆ ఉదంతం తాత్కాలికంగా సద్దుమణిగింది.

గాంధీని పారిశుద్ధ్యానికి సంకేతం స్థాయికి పరిమితం చేసి స్వచ్ఛ భారత్ లోగోగా మాత్రమే ఉపయోగించుకుంటున్నా, గుజరాత్ సాంస్కృతిక శాఖ క్యాలెండర్‌లో ఏటా ప్రచురించే గాంధీ రాట్నం వడుకుతుండే ఫోటోను తీయించి తన ఫోటోను ముద్రింప చేసుకున్నా, సాధ్వీ ప్రజ్ఞా సింగ్ గెలిచే స్థితిలో ఉన్నా కూడా.. గాంధీజీ హంతకుడిని దేశభక్తుడిగా కీర్తించే స్థాయికి తాము స్వయంగా ఎంపిక చేసిన తమ అభ్యర్థి దిగజారటం పార్టీ పరంగానే కాకుండా వ్యక్తిగతంగా తన నాయకత్వ ఇమేజ్‌కి కూడా భవిష్యత్తులోనైనా చెరుపుకోలేని నష్టమని మోదీ గుర్తించారు. అందుకే అంత వంగి క్షమాపణ చెప్పారు. సాధ్వీ

గెలిచాక కూడా బాహాటంగా ప్రమోట్ చేసే సాహసాన్ని బీజేపీ చేయలేకపోతోంది. అందుకే లోక్‌సభలో ఆమె ప్రకటనను ఖండించటమే కాకుండా, ఆమె చేత రెండుసార్లు క్షమాపణ చెప్పించింది. ఇటీవల పౌరసత్వ సవరణ చట్టం, జాతీయ పౌర పట్టికపై ప్రజల్లో ఆగ్రహం పెల్లుబికినప్పుడు కూడా గాంధీ బొమ్మను ఉపయోగించుకునేందుకు మోదీ వీలైనంత మేర ప్రయత్నించారు.

ఇదంతా గాంధీ భావజాలనికున్న స్వతస్సిద్ధ శక్తి!.. లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అనేక సందర్భాల్లో చెప్పినట్లు, గాంధీజీ లేకపోయినా భారత్‌కు స్వాతంత్ర్యం వచ్చేది. కానీ గాంధీజీ లేకుంటే ఈవేళున్న భారతదేశం ఉండేది కాదు. అనేక భాషలు, మతాలు, కులాలు, తెగలు, సంస్కృతులు, ఎంతో అవిద్య, పేదరికంతో సంక్లిష్ట సమాజంగా ఉన్న భారతదేశాన్ని ఒకటిగా చేసి దేశభక్తిని, జాతీయతాభావాన్ని పెంపొందించిన ఘనత బాపూది. ఆయన విమర్శలకు అతీతుడు కాకపోవచ్చు, గాంధీ భావాలన్నిటితో మనం ఏకీభవించకపోవచ్చు. కానీ ఐడియా ఆఫ్ ఇండియాకు మూలం మహాత్మాగాంధీయే. అలాంటి నేతను హత్య చేసిన వ్యక్తిని దేశభక్తుడు అనటం ఏ కోణంలో చూసినా జాతి భవిష్యత్తుకు ప్రమాదకరం. అది మెడకు చుట్టుకోకుండా ఉండేందుకే, గాంధీజీని చెరిపేయాలన్న ఊహను చెరిపేయాలని మోదీ సైతం భావించాల్సి వచ్చింది.

పెద్దఎత్తున గుర్తింపు పొందాలంటే, ప్రభావాన్ని చూపాలంటే.. హింసతో ఆధిపత్యాన్ని చెలాయించటం, మోసపూరితంగా సంపదను పోగేసుకోవటం వంటి పద్ధతులే మార్గమని నేటితరంలో అనేకమందికున్న నమ్మకానికి భిన్నంగా గాంధీ తన కృషిని నెరిపారు. దక్షిణాఫ్రికాలో కావచ్చు, ఇండియాలో కావచ్చు.. తన కంటే ఎంతో బలమైన ప్రత్యర్థితోనే గాంధీజీ తలపడ్డారు. అయినా హింసను ఎంచుకోలేదు. అహింసను, త్యాగాన్ని ప్రదర్శిస్తూ సత్యాగ్రహాన్ని వ్యక్తం చేశారు, సత్యాన్వేషణ రాజకీయ పంథాలో దేశాన్ని ఏకం చేసి నడిపించారు.

ఆ రోజులు వేరు, ఈ రోజులు వేరు, పోల్చుకోవటం సరికాదు.. అనుకోవటం కూడా గాంధీజీ విషయంలో సరికాదు. ఉన్నకొద్దీ గాంధీ పంథాకి విలువ పెరుగుతోంది. ప్రముఖ చరిత్రకారుడు సుధీర్ చంద్ర అన్నట్లు "భారత జాతీయ పోరాటం అహింసతో కూడినదని నాటి నాయకులు విశ్వసించినప్పటికీ దాని వెనుక ఒక హింసాత్మక ప్రతిఘటన దాగి ఉంది. ఆ భావన ప్రజల్లోకి విస్తరిస్తే ప్రమాదమని గాంధీజీ ఒక్కరే గుర్తించారు. 'హింసకు హింస మార్గం కాకూడదని' ఆయన చెప్పారు. ఆయనకపెంపొందించిన ఈ ఆలోచనే గాంధీ శక్తిగా, కాలక్రమంలో భారతదేశ శక్తిగా మారింది. గాంధీజీ విఫలం కాలేదు. 'గాంధీ మార్గం తప్ప వేరే మార్గం లేదు' అనే నిజాన్ని ప్రపంచమే గుర్తిస్తోంది".

మావోయిస్టు భావజాలంతో మమేకమైన ఓ జర్నలిస్టు మిత్రుడు ఇటీవల హైదరాబాద్‌లో ఇంకో మిత్రుడి దగ్గర మాట్లాడుతూ, 'గాంధీని ఇంతకాలం నేను తిరస్కరిస్తూ వచ్చాను. కానీ ఇటీవల గాంధీ సాహిత్యాన్ని సీరియస్‌గా చదువుతుంటే, అంత తేలిగ్గా తీసేయగలిగే నాయకుడు కాదనిపిస్తోంది' అని వ్యాఖ్యానించారు. స్వదేశంలో గాంధీ మీద దాడులు చేస్తున్న ఛాందస హిందుత్వవాదులు కూడా కాలక్రమంలోనైనా వెనక్కు తగ్గేలా చేసే శక్తి గాంధీ తత్వంలో ఇమిడి ఉందనటం అతిశయోక్తి కాదు.

గాంధీ పోరాట పంథాకున్న అపార శక్తిని హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో రాజకీయ అధ్యయనవేత్త ఎరికా చెనోవెత్ కూడా ధృవీకరిస్తున్నారు. పౌరుల సహాయ నిరాకరణ అనేది కేవలం నైతికమైన పోరాటం మాత్రమే కాదని, ప్రపంచ రాజకీయాల్లో పెనుమార్పులు తేగల శక్తిమంతమైన మార్గం కూడా అని ఆమె అంటున్నారు.

"1986లో ఫిలిప్పిన్స్‌లో లక్షలాది మంది ప్రజానీకం మనీలా రోడ్ల మీదకొచ్చి పీపుల్ పవర్ మూవ్‌మెంట్ పేరుతో శాంతియుతంగా నిరసన ప్రదర్శనలు, ప్రార్థనలు చేశారు. మార్కోస్ సుదీర్ఘ జమానాకు నాలుగు రోజుల్లోనే తెరపడింది.

2003లో రక్తపాతరహిత గులాబీ విప్లవం ద్వారా ఎడ్వర్డ్ షెవర్డ్‌నెడ్జెకు జార్జియా ప్రజలు ఉద్వాసన పలికారు. చేతుల్లో పువ్వులు పట్టుకుని ప్రదర్శనకారులు పార్లమెంటును చుట్టుముట్టి ఈ విప్లవాన్ని సాధించారు.

2019 సంవత్సరం తొలినాళ్లలో సూడాన్, అల్జీరియా అధ్యక్షులిద్దరూ పదవుల నుంచి వైదొలుగుతున్నట్లు ప్రకటించారు. వాళ్లంతట వాళ్లు దిగిపోలేదండోయ్.. దశాబ్దాల పాటు పదవుల్లో కొనసాగుతున్న వారి నిర్వాకాన్ని నిరసిస్తూ ప్రజలు శాంతియుతంగా ప్రచార కార్యక్రమాల్ని నిర్వహించటంతో విధిలేక అధికార పీఠాల్ని వదిలారు".

.. ఈ ఘటనలన్నిటిలోనూ పాల్గొన్నది సామాన్య ప్రజలే, చేసింది గాంధీలాగా శాంతియుత పోరాటాలే! ఈ శాంతియుత నిరసనలే ఓ గణనీయ రాజకీయ మార్పునకు దారితీశాయి. బలమైన, సంపన్నమైన రాజకీయ నియంతృత్వ శక్తులను గద్దె దించాయి.

చెనోవెత్ ఇలా గత శతాబ్దకాలంలో జరిగిన ఎన్నో పోరాటాల్ని, ప్రదర్శనల్ని, ప్రచారాల్ని పరిశీలించారు. "హింసాత్మక పోరాటాల కంటే అహింసాయుత నిరసనలకే తమ లక్ష్యాల్ని సాధించే అవకాశాలు రెండు రెట్లు ఎక్కువగా ఉన్నాయి" అని ఆమె నిర్ధారించారు. దీనికి సంబంధించి కచ్చితమైన సమీకరణాలు అనేక అంశాల మీద ఆధారపడినప్పటికీ, జనాభాలో 3.5 శాతం మంది నిరసనల్లో చురుగ్గా, నిలకడగా పాల్గొంటే ఓ పెద్ద రాజకీయ మార్పు తథ్యమని ఆమె తేల్చారు.

హింసా మార్గంలో తిరుగుబాటు చేస్తున్న కొన్ని గ్రూపులు

కూడా చెనోవెత్ విశ్లేషణను ఆమోదించాయి. ఇటీవల అవన్నీ తమ పంథాను మార్చుకున్నాయి. ఆమె సూత్రీకరణలు తమను నేరుగా ప్రభావితం చేశాయన్నది ఆ మిలిటెంట్ గ్రూపుల వ్యవస్థాపకులు స్వయంగా చెబుతున్న మాట.

హింస కంటే అహింసాయుత ప్రయత్నం, దాని చుట్టూ 3.5 శాతం మంది జనసమీకరణే విజయానికి మార్గమనే నిర్ధారణకు చెనోవెత్ రావటంపై బీబీసీ ఫ్యూచర్‌కు చెందిన సీనియర్ జర్నలిస్టు డేవిడ్ రాబసన్ ఒక కథనాన్ని ప్రచురించారు. 'సమాజానికి ఏదో ఒకటి చేయాలి, తామూ ఎదగాలి' అని తపించే పౌరులకు, ముఖ్యంగా యువతకు ఎంతో ఉపయోగపడతాయి కాబట్టి.. జనవరి 12న జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా ఆ వివరాల్ని ఈ వ్యాసం ద్వారా అందించే ప్రయత్నం చేస్తున్నాం.

చెనోవెత్ పరిశోధన.. చరిత్రను ప్రభావితం చేసిన అనేకమంది తాత్విక రాజకీయ కృషిని పునాదిగా చేసుకుందనటంలో సందేహం లేదు. అమెరికాలో బానిసత్వ వ్యతిరేక పోరాటం చేసిన ఆఫ్రికన్-అమెరికన్ సోజర్నర్ ట్రూత్, మహిళల ఓటు హక్కు కోసం పోరాడిన సుసాన్ బి. ఆంథోనీ, భారత స్వాతంత్ర్య పోరాటం ద్వారా సత్యాన్వేషణ రాజకీయం చేసిన మహాత్మాగాంధీ, అమెరికా పౌరహక్కుల ప్రచార యోధుడు మార్టిన్ లూథర్ కింగ్ మొదలైన వారంతా శాంతియుత నిరసనలతో శత్రువును జయించటం కోసం సుదీర్ఘ పోరాటాలు చేసినవారే. వీరందరినీ ఆమె అధ్యయనం చేశారు.

సాయుధ పోరాటం కంటే శాంతియుత నిరసనల పద్ధతిలోనే ఎక్కువ విజయాలని పరిశోధనకు ముందు నేను కూడా ఊహించలేదు. అయితే 2000 సంవత్సర మధ్య కాలంలో తాను పరిశోధనను ప్రారంభించినప్పుడు ఈ రకమైన సూత్రీకరణలు ఆవిష్కృతమవుతాయని తాను కూడా భావించలేదని చెనోవెత్ విస్మయంతో చెబుతారు. సాయుధ పోరాటం కంటే శాంతియుత నిరసనల ద్వారానే ఎక్కువ విజయాల్ని సాధించవచ్చనటంలో తనకు కూడా ఏమాత్రం నమ్మకం లేదన్నారు.

## రెంటి విజయాల శాతాన్నీ ఇప్పటి దాకా ఎందుకు పోల్చి చూడలేదో?

కొలరాడో విశ్వవిద్యాలయంలో పీహెచ్‌డీ విద్యార్థిగా ఉగ్రవాదం పెరుగుదలకు కారకాలపై చెనోవెత్ పరిశోధనలు చేస్తుండేవారు. కొన్నేళ్లు గడిచాయి. ఆ సమయంలో వాషింగ్టన్ కేంద్రంగా పనిచేసే 'ఇంటర్నేషనల్ సెంటర్ ఆఫ్ నాన్‌వయొలెంట్ కాన్‌ఫ్లిక్ట్' (ఐసీఎన్‌సీ) అనే స్వచ్ఛంద సంస్థ నిర్వహించిన వర్క్‌షాప్‌కి వెళ్లాల్సి వచ్చింది. శాంతియుత ప్రదర్శనలు, ప్రచారాల ద్వారానే సుస్థిర రాజకీయ మార్పు వస్తుంది అని అనేక సాధికార ఉదాహరణల ద్వారా ఆ కార్యశాలలో ప్రదర్శించారు. ఫిలిప్పిన్స్‌లో పీపుల్స్ పవర్ నిరసన ప్రదర్శనలు వంటి వన్నీ అందులో ఉన్నాయి.

అవన్నీ చూశాక చెనోవెత్‌కు కొత్త దృష్టి ఏర్పడింది. "అహింసాయుత ప్రతిఘటనలు సాధించిన కొన్ని ఆకర్షణీయ విజయాల్ని ఆదర్శ భావాలతో తరచూ ఏకరువు పెట్టుకు ట్టున్నాం. కానీ అహింసా పోరాటం ద్వారా సాధించిన విజ యాల్ని, సాయుధ పోరాట విజయాలతో పోల్చి రెండు పంథాల్లో ఏది ఎక్కువ శాతం విజయాల్ని సాధించిందో ఎందుకు లెక్క తీయలేకపోయాం?" అనే ప్రశ్న ఆమెలో తలెత్తింది. ఈ దిశగా ఇప్పటిదాకా సమగ్ర అధ్యయనం ఎందుకు చేయలేదో? అని ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశారు. అలా అధ్యయనం ప్రారంభించారు. అయితే, 'సమాజంలో పెద్ద మార్పుల్ని తీసుకురావటానికి అహింసాయుత పోరాటం సమర్థవంతమైన పద్ధతి కాదేమోనన్న సంశయంతోనే నేను ప్రారంభమయ్యాను" అని అంగీకరించారు.

## 1900 నుంచి 2006 వరకు జరిగిన ప్రతిఘటనలు, ఉద్యమాల పరిశీలన

ఐసీఎన్‌సీలో పరిశోధన చేస్తున్న మేరియా స్టెఫాన్‌తో కలిసి 1900 నుంచి 2006 వరకు జరిగిన పౌర ప్రతిఘటనల్ని, సామాజిక ఉద్యమాల్ని చెనోవెత్ విస్తారంగా సమీక్షించారు. వివిధ చోట్ల నుంచి తాము సేకరించిన వివరాల్ని ఆ రంగంలోని ఇతర నిపుణుల ద్వారా రూఢి చేసుకున్నారు. 'ఉన్న పాలకులను గద్దె దించి కొత్తవారిని అధికార పీఠమెక్కించటానికి' చేసిన ఉద్యమ ప్రయత్నాల్ని వీళ్లు ప్రాథమికంగా పరిగణలోకి తీసుకున్నారు. చురుగ్గా కార్యకలాపాల్ని నిర్వహించిన ఏడాది లోపు లేదా ఉద్యమ కార్యాచరణ ప్రత్యక్ష ఫలితంగా లక్ష్యాన్ని పూర్తిగా సాధిస్తే ఆ ఉద్యమం విజయవంతమైనట్లు పరిగణించారు. విదేశీ సైనిక జోక్యంతో పాలకులు మారటం వంటి వాటిని పరిగణలోకి తీసుకోలేదు. బాంబులు వేయడం, కిడ్నాపులు, మౌలిక వసతుల విధ్వంసం, ప్రజలకు లేదా ఆస్తులకు భౌతిక హాని కలిగించటం వంటి వాటికి పాల్పడితే వాటిని హింసాయుత పోరాటాలుగా పరిగణించారు.

## గుర్తింపు ఇవ్వడానికి కఠిన ప్రమాణాలు

"అహింసాయుత ప్రతిఘటనను విజయానికి ఒక వ్యూహాత్మక పంథాగా అనుసరించటాన్ని గుర్తించేందుకు కఠిన ప్రమాణాలను పాటించాం" అని చెనోవెత్ తెలిపారు (ఈ ప్రమాణాలు ఎంత కఠినంగా ఉన్నాయంటే, గాంధీజీ నేతృత్వంలోని భారత స్వాతంత్ర్య పోరాటాన్ని కూడా అహింసాయుత పోరాట విజయానికి నిదర్శనంగా చెనోవెత్, స్టెఫాన్ విశ్లేషణ ఆమోదించలేదు. అహింసాయుత ప్రదర్శనలు, కార్యక్రమాల ప్రభావం ఉన్నప్పటికీ.. బ్రిటన్ సైనిక సామర్థ్యం బలహీనపడటమే భారతదేశ స్వాతంత్ర్యానికి పెద్ద కారణమని వీరు భావించారు).

## శాంతియుత విజయాలు 53 శాతం కాగా, హింసాత్మక విజయాలు 26 శాతం మాత్రమే

ఇలా స్ట్రిక్ట్‌గా పరిశీలించి లెక్కేశాక మొత్తంగా తేలిందేమిటంటే.. అహింసాయుత పోరాటాల విజయం హింసాత్మక పోరాటాల విజయం కంటే రెండు రెట్లు ఎక్కువగా ఉంది. శాంతియుత పోరాటాలు 53 శాతం సందర్భాల్లో రాజకీయ మార్పును సాధించగా, హింసాత్మక పోరాటాలు 26 శాతం మేర మాత్రమే రాజకీయ అధికార పీఠాలను మార్చాయి.

## అన్ని వర్గాలనూ కలుపుకునే అవకాశాలు అహింసాయుత మార్గంలోనే ఎక్కువ

విస్తృత ప్రజానీకంలోని అనేక వర్గాలను కలుపుకునే అవకాశం ఉండటం వల్ల అహింసాయుత ప్రచారాలు విజయవంతమయ్యే అవకాశం ఎక్కువ అని చెనోవెత్ వాదన.



జనాభాలోని పలు రకాలవారు వచ్చి చేరటం వల్ల సాధారణ పట్టణ, సామాజిక జీవనాన్ని తమ కార్యక్రమాల ద్వారా ప్రభావితం చేసే శక్తి ఈ రకమైన పోరాటానికి ఉంది.

## హింసాత్మక పోరాటాలకన్నా నాలుగు రెట్లు ఎక్కువమంది భాగస్వాములయ్యారు

చెనోవెత్, స్టెఫాన్ 25 పెద్ద ప్రచారోద్యమాలను అధ్యయనం చేయగా, అందులో 20 అహింసాయుతమైనవి. వాటిల్లో 14 తిరుగులేని విజయాలు. మొత్తంగా, శాంతియుత పోరాటాలు (2,00,000) సరాసరిన హింసాత్మక పోరాటాల (50,000) కంటే నాలుగు రెట్లు ఎక్కువమందిని కార్యక్రమాల్లో భాగస్వాముల్ని చేసుకున్నాయి.

ఉదాహరణకు ఫిలిప్పిన్స్‌లో మార్కోస్ పాలనకు వ్యతిరేకంగా జరిగిన నిరసన ప్రచారోద్యమం ఉధృతంగా ఉన్న సమయంలో 20 లక్షల మంది పాలుపంచుకున్నారు. 1984, 1985లో బ్రెజిల్‌లో చోటు చేసుకున్న తిరుగుబాటులో 10 లక్షలమందే పాల్గొన్నారు. 1989లో చెకోస్లావేకియాలో జరిగిన వెల్వెట్ విప్లవంలో 5 లక్షలమంది భాగస్వాములయ్యారు.

## సంఘటితంగా ఉండటం కూడా అవసరం

"అధికారంలో పాతుకుపోయిన శక్తుల్ని కదిలించాలంటే రకరకాల పద్ధతుల్లో బలప్రదర్శన చేసే సంఖ్యాబలం సంఘటితంగా ఉండటం అవసరం. అటువంటి విస్తృతమైన మద్దతు సమీకరణకు అహింసాయుత ఆందోళనా పద్ధతి అత్యుత్తమ మార్గంగా కనిపిస్తోంది" అని చెనోవెత్ అన్నారు.

ఎప్పుడైతే మొత్తం జనాభాలో 3.5 శాతం మంది చురుగ్గా భాగస్వాములవటం ప్రారంభిస్తారో విజయం అనివార్యమనిపిస్తుంది. ఫిలిప్పిన్స్‌లోని పీపుల్ పవర్ మూవ్‌మెంట్‌తోపాటు, ఎస్తోనియాలోని సింగింగ్ విప్లవం, జార్జియాలో జరిగిన గులాబీ విప్లవం అన్నీ కూడా 3.5 శాతం కనీస ప్రమాణాన్ని సాధించాయి. "కీలకఘట్టంలో కనీసం 3.5 శాతం ప్రజలు పాల్గొన్న ఏ ప్రచారోద్యమం కూడా లక్ష్యాన్ని సాధించకుండా విఫలం కాలేదు" అని చెనోవెత్ అంటారు. దీన్నే ఆమె "3.5% రూల్"గా పేర్కొన్నారు.

## శాంతియుత పోరాటాల్లో పాల్గొనేవారు నైతిక శక్తిని కొనసాగిస్తారు

అహింసకు అనుకూలంగా వచ్చిన ఈ ఫలితాల్ని చూసి తొలుత తాను ఆశ్చర్యపోయానని చెనోవెత్ వెల్లడించారు. కానీ అహింసాయుత పోరాటాలకు అంత పెద్దఎత్తున మద్దతు లభించడానికి అనేక కారణాలున్నాయని గుర్తించారు. హింసాయుత పోరాటాల్లో రక్తపాతాన్ని వ్యతిరేకించే, దానికి భయపడే వారంతా దూరంగా ఉంటారని, అదే శాంతియుత ప్రదర్శనల్లో పాల్గొనేవారంతా నైతిక ధృతిని కొనసాగిస్తారని తెలిపారు.

## శారీరక పటుత్వం లేకున్నా శాంతియుత పోరాటాల్లో పాల్గొనవచ్చు

అహింసాయుత పోరాటాల్లో ప్రజల భాగస్వామ్యానికి భౌతిక అవరోధాలు తక్కువగా ఉంటాయని చెనోవెత్ పేర్కొన్నారు. ఒక సహాయ నిరాకరణలో పాల్గొనాలంటే మీరు ఆరోగ్యకరంగా, శారీరక దృఢత్వంతో ఉంటేనే సాధ్యమవుతుంది. హింసాయుత పోరాటాలు శారీరక పటుత్వమున్న యువకుల మీదే ఎక్కువగా ఆధారపడి ఉంటాయి.

## రిస్కులు ఉంటాయి కానీ..

అహింసాయుత పోరాటాల్లో రిస్కులు కూడా ఉంటాయని, 1989లో చైనాలోని తియాన్మన్ స్క్వేర్‌లో చైనా ప్రతిస్పందనే ఇందుకు ఉదాహరణ అని చెనోవెత్ అన్నారు. అయితే మొత్తంగా శాంతియుత ప్రచారోద్యమాలు బహిరంగంగా చర్చించటానికి ఎంతో అనువుగా ఉంటాయన్నారు. వాటి వివరాలు త్వరగా ఎక్కువమందిని చేరతాయన్నారు. దీనికి భిన్నంగా, హింసా

ఉద్యమాలకు ఆయుధాలు, రహస్య కార్యకలాపాలు అవసరమవుతాయని, సాధారణ ప్రజల్ని చేరుకోవటానికి అవి ఎన్నో సవాళ్లను ఎదుర్కోవలసి వస్తుందని అన్నారు.

## పోలీసులు, సైన్యం కూడా మొగ్గు చూపే అవకాశాలెక్కువ

సాధారణ ప్రజల్లో ఎక్కువ ఆదరణ కలిగిన అహింసాయుత ఉద్యమాల వైపు పోలీసులు, సైన్యం కూడా మొగ్గు చూపే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. శాంతిభద్రతల పరిరక్షణకు, చట్టం అమలుకు ఈ రెండు విభాగాలపైనే ప్రభుత్వం ఆధారపడుతుందనేది తెలిసిందే.

లక్షలాది మంది శాంతియుతంగా వీధుల్లోకి వచ్చి ప్రదర్శన చేస్తుంటే, తుపాకీ పట్టుకున్న రక్షణ దళాలకు స్థయిర్యం చెదురుతుంది. తమ బంధువులు, స్నేహితులు కూడా ప్రదర్శనకారుల్లో ఉన్నారేమోనని వారి మనసులో పీకుతుంది. ఉద్యమం మీద విరుచుకుపడటానికి వారు సంకోచిస్తారు. లేదంటే, ఉద్యమంలో పాల్గొన్న జనం సంఖ్యయినా వారిని కదిలిస్తుంది. పాలకుల పీఠాలు కదులుతున్నాయని వారికి



స్ఫురింపజేస్తుంది. మునుగుతున్న ఓడలో ప్రయాణించాలని వారు కోరుకోరు. సాధారణ సమ్మె, వస్తు బహిష్కరణ వంటి పద్ధతుల్ని శాంతియుత పోరాటాల్లో భాగంగా చెనోవెత్ ప్రస్తావించారు. దక్షిణాఫ్రికాలో వర్ణ వివక్షను ఎదుర్కోవడానికి తెల్లవారు యజమానులుగా ఉన్న కంపెనీల నుంచి వస్తువుల్ని కొనడానికి నల్లవారు సంఘటితంగా నిరాకరించారు. ఫలితంగా దేశంలోని తెల్లజాతి సంపన్నవర్గాల్లో ఆర్థిక సంక్షోభం తలెత్తి చివరకు 1990ల ప్రారంభంలో వివక్షకు చరమగీతం పలికారు.

## ప్రజలకు భౌతిక హాని కలిగించని మార్గాలు ఇందులో అనేకం

ప్రజల్ని భౌతికంగా ప్రమాదంలోకి నెట్టకుండా ఆందోళన చేయటానికి అహింసాయుత పంథాలో అనేక మార్గాలున్నాయి. ముఖ్యంగా భాగస్వామ్య ప్రజల సంఖ్య పెరుగుతున్నకొద్దీ ఇది చాలా ముఖ్యమైన అంశంగా మారుతుంది. దీనికితోడు అహింసాయుత ప్రతిఘటన పద్ధతులు కూడా చాలా సందర్భాల్లో స్పష్టంగా తెలుస్తుంటాయి. నేరుగా ఎలా పాల్గొనాలి, గరిష్ఠ స్థాయిలో విఘాత ప్రభావాన్ని చూపటానికి తమ కార్యక్రమాల్ని ఎలా సమన్వయం చేసుకోవాలీ వారు తేలిగ్గా తెలుసుకోగలుగుతారు.

## తిరిగి లేవటానికి కావలసిన ఊపు 3.5%తోనే సాధ్యం

ఇవన్నీ సాధారణ లక్షణాలు. అయితే, హింసాయుత ఘర్షణల కంటే రెండు రెట్లు ఎక్కువ విజయవంతమైనా కూడా శాంతియుత ప్రతిఘటనలు 47 శాతం సందర్భాల్లో విఫలమయ్యాయి.

చెనోవెత్, స్టెఫాన్ తమ పుస్తకంలో పేర్కొన్నట్లు, శత్రువు అధికార పునాదిని కదిలించటానికి, అణచివేత సమయంలో తిరిగి లేవటానికి కావలసిన మద్దతును, ఊపును వాళ్లు వాస్తవంగా ఎప్పుడూ సమీకరించలేకపోవటం ఈ వైఫల్యానికి కారణం. 3.5 శాతం దాకా జనసమీకరణ లేకున్నా.. పెద్దస్థాయిగా చెప్పుకోదగ్గ కొన్ని శాంతియుత ప్రతిఘటనలు కూడా విఫలమైన విషయాన్ని ఇక్కడ గుర్తించాలి. 1950లలో తూర్పు జర్మనీలో కమ్యూనిస్టు పార్టీకి వ్యతిరేకంగా ప్రదర్శనలు ఇలాంటివే. వీటిల్లో 4,00,000 మంది సభ్యులు పాల్గొన్నారు (జనాభాలో 2 శాతం దాకా). కానీ మార్పు తేలేకపోయారు.

## మ్యాజిక్ ఫిగర్ 3.5 శాతం సమీకరించటం చిన్న విషయమేమీ కాదు

చెనోవెత్ డేటా సెట్ ప్రకారం, 3.5 శాతం మంది చురుగ్గా పాల్గొన్నప్పుడు మాత్రమే మార్పుకు గ్యారంటీ ఉంటుంది. ఆ మేరకు మద్దతును సమీకరించటం కూడా చిన్న విషయమేమీ కాదు. యు.కెలో అంత శాతం మంది అంటే 23 లక్షలమంది ఉద్యమంలో పాలుపంచుకోవాలి. యు.కెలోని రెండో పెద్ద నగరం బర్మింగ్‌హామ్ జనాభాకు ఇది రెట్టింపు. అమెరికాలోనైతే 1.1 కోటి మంది పాల్గొనాలి. ఇది న్యూయార్క్ నగర జనాభా కంటే ఎక్కువ.

## అహింసాయుత ప్రతిఘటనలే సుస్థిర మార్పుకు సరైన మార్గం

హింసా పోరాటాల కంటే ఎక్కువమందిని సమీకరించాల్సి ఉండటం సహా అన్నిటినీ బేరీజు వేసి చూసినా.. అహింసాయుత ప్రతిఘటనలే సుస్థిర రాజకీయ మార్పుకు సరైన మార్గంగా తేటతెల్లమవుతుంది.

చెనోవెత్, స్టెఫాన్‌ల ప్రాథమిక అధ్యయనం తొలుత 2011లో ప్రచురితమైంది. అప్పటి నుంచి వారి సూత్రీకరణలు పలువురి దృష్టిని ఆకర్షిస్తూనే ఉన్నాయి. తమ పరిశోధనకు వారి అధ్యయనం ఎంతగానో ఉపయోగపడిందని ఇండియానాలోని నోట్రె డేమ్ విశ్వవిద్యాలయంలో పౌర ప్రతిఘటనపై పరిశోధన

చేస్తున్న మాథ్యూ షాండ్లర్ అన్నారు.

## ఇప్పుడు నిరూపిత సత్యం

చెనోవెత్, స్టెఫాన్‌ల పరిశీలనలు, సూత్రీకరణలు తోసిపుచ్చ లేనివని యూనివర్సిటీ ఆఫ్ కోపెన్‌హాగన్‌లో అంతర్జాతీయ ఘర్షణ పరిస్థితులపై అధ్యయనం చేసే ఇజబెల్ బ్రామ్‌సెన్ అంగీ కరించారు. "హింసాత్మక పద్ధతులకన్నా అహింసాయుత ప్రతిఘటన పద్ధతులు ఎక్కువ విజయవంతమయ్యే అవకాశాలు న్నాయన్నది నిరూపిత సత్యం" అని ఆమె వ్యాఖ్యానించారు.

## మిగిలినవారిలో కూడా అనేకమంది పరోక్ష మద్దతు తెలుపుతున్నట్లు అర్థం

3.5 శాతం రూల్ గురించి ఆమె వివరిస్తూ, "3.5 శాతం అనేది ఒక చిన్న మైనారిటీ. అంతమంది చురుగ్గా పాల్గొంటున్నారంటే, బహుశా మిగిలినవారిలో కూడా అనేకమంది పరోక్షంగా ఆ లక్ష్యానికి తమ ఆమోదం తెలుపుతున్నారని అర్థం అయ్యుండవచ్చు" అన్నారు.

## విజయానికి ఐక్యత ఎంతో ముఖ్యం

ఒక ఉద్యమం విజయవంతమవటానికి, విఫలమవటానికి దోహదం చేసే ఈ అంశాలపై మరింత స్పష్టత కోసం పరిశోధకులు ప్రయత్నిస్తున్నారు. ఉదాహరణకు, ఉద్యమకారుల్లో ఐక్యత విజయానికి ఎంతో ముఖ్యమని బ్రామ్‌సెన్, షాండ్లర్‌లు గుర్తించారు. 2011లో బహ్రెయిన్‌లో ఉవ్వెత్తున లేచిన ఉద్యమం విఫలమవటాన్ని బ్రామ్‌సెన్ ఈ సందర్భంగా వివరిస్తారు. ఈ ప్రచారోద్యమంలో అనేకమంది నిరసనకారులు పాల్గొన్నారు. కానీ కొద్దికాలంలోనే ముఠాలుగా విడిపోయి నువ్వా, నేనా అని కొట్లాడుకోవటం మొదలుపెట్టారు. ఫలితంగా ఉద్యమంలో క్రమత్వం దెబ్బతింది దీంతో, మార్పుకు అవసరమైన ఊపును ఉద్యమం అందుకోలేకపోయింది. చెనోవెత్ ఇటీవల సామాజిక రాజకీయ అంశాల మీద ఎక్కువ దృష్టిని సారించారు. బ్లాక్ లైవ్స్ మ్యాటర్ మూవ్‌మెంట్, విమెన్స్ మార్చ్ 2017 వంటి వాటి మీద అధ్యయనం చేస్తున్నారు. స్వీడన్‌కు చెందిన కార్యకర్త గ్రేటా థమ్‌బర్గ్ ద్వారా ఈమధ్య ఎక్కువగా ప్రచారంలోకి వచ్చిన కాలుష్యంపై తిరుగుబాటు ఉద్యమం మీద ఆమె ప్రశంసల్ని కురిపించారు. ఎడతెగని జడత్వం మీద వారు కొరడా ఝుళి పిస్తున్నారన్నారు. అహింసాయుత ప్రతిఘటనను ప్రచారం ద్వారా విస్తరించటానికి, పాఠాల్ని నేర్పించటానికి కావలసిన సహజ శక్తిసామర్థ్యాల్ని వారు ప్రదర్శిస్తున్నారన్నారు.

## చరిత్ర పుస్తకాల నుంచి యుద్ధాలు, హింసను తొలగించి అహింసాయుత ఉద్యమాల గురించి చెప్పాలి

యుద్ధాలు, రక్తతర్పణాల మీద కన్నా అహింసాయుత ప్రతిఘటనల గురించి ఎక్కువగా చెప్పడానికి చరిత్ర పుస్తకాలు ప్రాధాన్యతనివ్వాలని చెనోవెత్ సూచిస్తున్నారు.

"మనం ఒకరికొకరు చెప్పుకునే చరిత్రలు చాలా వరకు హింస చుట్టూనే ఉంటాయి. యుద్ధంలో సర్వనాశనం జరిగినా సరే, అందులో ఏదోకరకంగా విజయాల్ని వెతుకుతాం" అని ఆమె ఎద్దేవా చేస్తారు. "శాంతియుత ప్రతిఘటన విజయాన్ని విస్మరించటం మనకు అలవాటు మారిందని" అని తీవ్రస్థాయి విమర్శ చేస్తారు. "సామాన్య ప్రజలు నిరంతరం చిన్న చిన్న ధీరోదాత్త పనుల్లో మునిగితేలుతుంటారు. నిజానికి ప్రపంచాన్ని మార్చటంలో వారి చిన్న పనుల పాత్ర కీలకం. ఈ హీరోయిజాన్ని కూడా పట్టించుకోవాలి, అభినందించాలి. వీరందరినీ కలుపుకుంటూ నిర్దిష్ట లక్ష్యాల కోసం చేసే శాంతియుత ఉద్యమాలే ప్రపంచంలో మౌలిక మార్పులకు సరైన మార్గం" అనేది చెనోవెత్, స్టెఫాన్‌ల అధ్యయనం నుంచి అర్థమయ్యే రాజకీయ ఉద్యమ ఫార్ములా!

## పంథాతో పాటు.. సరైన పోరాట ఎజెండా కూడా ఉంటేనే ప్రజలు ఆశించిన స్థాయి మార్పు సాధ్యమవుతుంది

**(చెనవెత్ పరిశీలనలపై లోక్‌సత్తా)**

ఇటీవల చిలీ, బొలీవియా, హాంకాంగ్‌లో చోటు చేసుకున్న మార్పులు, తాజాగా సీఏఏ, ఎన్ఆర్‌సీలకు వ్యతిరేకంగా జరుగుతున్న పరిణామాలు కూడా ఈ సంకేతాన్నే ఇస్తున్నాయి. పలు అహింసాయుత ప్రతిఘటనలు 3.5 శాతం ట్రాక్షన్‌తో హింసాత్మక పోరాటాల కంటే ఎక్కువ సంఖ్యలో విజయం సాధించటమనేది ఒక కీలక పరిశీలన అనటంలో సందేహం లేదు. తాజాగా సీఏఏ, ఎన్ఆర్‌సీలకు వ్యతిరేకంగా జరుగుతున్న పరిణామాలు కూడా ఈ సంకేతాన్నే ఇస్తున్నాయి. గెలుపు కోసం ఆరాటంలో అసహనానికి, హింసాత్మక ఉద్రేకాలకు ఎక్కువగా లోనవుతున్న నేటి యువతరానికి వ్యక్తిగత జీవితంలో, సంఘటితంగా చేయాల్సిన సామాజిక కృషిలో ఇదో సక్సెస్ పాఠం. అయితే ఈ శాంతియుత ఉద్యమాలు విజయం సాధించినా ప్రజలు ఆశించిన స్థాయి మార్పు వారి జీవితాల్లో రాకపోవటాన్ని కూడా ఇక్కడ గమనించాలి. ఉదాహరణకు చెనోవెత్ చెప్పిన ఫిలిప్పిన్స్‌లో కావచ్చు, ఇటీవలి అల్జీరియా, సూడాన్‌లలో కావచ్చు.. పాలకులు మారారు గానీ పాలనలో పెద్ద మార్పేమీ రాలేదు. ఆటగాళ్లు మారారుగానీ ఆట నియమాలు మారలేదు. ఈ పరిమితిని చెనోవెత్ కూడా అంగీకరించారు. పాలకులను మార్చడానికి చేసిన ఉద్యమ ప్రయత్నాల్నే తాము ప్రాథమికంగా పరిగణలోకి తీసుకున్నట్లు తెలిపారు. 'పోరాట పంథా'కు సంబంధించి చెనోవెత్, స్టెఫాన్‌ల అధ్యయనాన్ని అభినందిస్తూనే, ప్రజలు ఆశించిన మార్పు రావడానికి 'సరైన పోరాట లక్ష్యాల'పై దృష్టిని కూడా కీలకంగా

గుర్తించాలని లోక్‌సత్తా భావిస్తుంది.

1970లలో ఇందిరాగాంధీకి వ్యతిరేకంగా లోక్‌నాయక్ జయప్రకాష్ నారాయణ్ ఉద్యమం చేసినప్పుడు ఆమెను గద్దె దించటమొక్కటే లక్ష్యం కావటంతో అంత పెద్ద ఉద్యమమూ పెద్ద ఫలితం లేకుండా కాలగర్భంలో కలిసిపోయింది. చూడటానికి జాతీయస్థాయిలో తొలి కాంగ్రెసేతర ప్రభుత్వం ఏర్పాటు అనే పెద్ద విజయం కనిపిస్తుంది. కానీ దాన్నుంచి ప్రజలు ఆశించిన ఫలితం మాత్రం కనిపించదు. ఇదే ఎజెండా వైఫల్యం ఇప్పటి నరేంద్రమోదీ ప్రభుత్వం వరకూ కొనసాగుతోంది. ఒకరిని గెలిపించటానికో, ఓడించటానికో ఎంత అహింసాయుతంగా ఎంత గొప్ప ఉద్యమాన్ని నడిపినా, అది విజయం సాధించినా దాని వల్ల దీర్ఘకాల ఫలితం ఉండే అవకాశాలు స్వల్పం.

మహాత్మాగాంధీ నడిపిన శాంతియుత స్వతంత్ర పోరాటాన్ని చెనోవెత్ 'స్వతంత్రం సాధించటం పరిధిలో' విజయంగా పరిగణలోకి తీసుకోలేదుగానీ.. స్వతంత్రం వరకే గాంధీజీ తన ఉద్యమాన్ని పరిమితం చేసి ఉంటే ఇతరత్రా కూడా ఆ విజయం గురించి సాంకేతికంగా తప్ప మాట్లాడుకోవాల్సిన అవసరమే ఉండేది కాదు. కులం, మతం, భాష, ప్రాంతాలకతీతంగా దేశాభివృద్ధిని కుంటుపరిచే ఏ రకమైన పద్ధతినీ నేటి ప్రజాస్వామ్యంలో అంగీకరించలేం. సార్వత్రిక సమ్మెను శాంతియుతంగా చేసే ప్రధాన ఆందోళనా పద్ధతిగా చెనోవెత్ పేర్కొన్నారు. కానీ గాంధీజీ అవలంబించినా సరే సార్వత్రిక హర్తాళ్లు, ఆమరణ నిరాహార దీక్షలు వంటివి రాజ్యాంగ ప్రజాస్వామ్యంలో ఆమోదయోగ్యం కావు. జాతీయోద్యమ కాలంలో నాటి ఆ పద్ధతుల్ని మార్చుకుని రాజ్యాంగబద్ధమైన ఆందోళనా పద్ధతులను మనం పెంపొందించుకోవాలి. ఎన్నికల్లో ఓటు వేసే సమయంలోనే కాకుండా.. ఎన్నికల మధ్య కూడా ప్రభుత్వాన్ని ప్రభావితం చేసే పాలనా పద్ధతుల్ని, నిరసన మార్గాల్ని అభివృద్ధి చేసుకుంటేనే అహింసాయుత పోరాటాలకు సమగ్రత చేకూరుతుంది.

హింసకు బదులుగా అహింసాయుత, రాజ్యాంగబద్ధ పోరాట పంథాను ఎంచుకోవటం, 3.5 శాతం మంది క్రియాశీల మద్దతును కూడగట్టడం, వారందరూ సంఘటితంగా పనిచేసేలా




భారతదేశాన్ని ఏకం చేయటంతోపాటు రాజకీయానికి, సమాజానికి, వ్యక్తిగతానికి సత్యాన్వేషణను ప్రాతిపదిక చేసే కృషి చేశారు కాబట్టే.. గాంధీజీ ఉద్యమానికి దీర్ఘకాలిక, ప్రపంచస్థాయి ప్రాధాన్యత సమకూరింది. తన పోరాటం ద్వారా అంత సుదూర లక్ష్యాన్ని చూశారు కాబట్టే.. స్వాతంత్ర్యం వచ్చినా 1947 ఆగస్టు 15న గాంధీజీ వేడుకల్లో పాల్గొన కుండా ఆనాటి తప్పటడుగులపై కన్నీరు కారుస్తూ ఢిల్లీకి దూరంగా ఎక్కడో ఉండిపోయారు. ఆందోళనా పద్ధతులు కూడా రాజ్యాంగ ప్రజాస్వా మ్యానికనుగుణంగా ఉండాలి

అలాగే ఆధునిక ప్రజాస్వామ్యంలో అహింసాయుత పోరాట పంథా ఎలా ఉండాలి అనే అంశం మీద కూడా స్పష్టత అవసరం. ఇతరుల ప్రాథమిక హక్కులకు భంగం కలిగిస్తూ, చూడటంతోపాటు మనం ఆశిస్తున్న మార్పునకు కావలసిన లక్ష్యంగా సరైన ఎజెండాను, ఆందోళనా పద్ధతుల్ని ఎంచుకుంటేనే సుస్థిరమైన విజయం సాధించినట్లు! మన లక్ష్యాల్ని తక్షణ, మధ్యకాలిక, దీర్ఘకాలిక లక్ష్యాలుగా విభజించుకోవచ్చు. కానీ ఆ లక్ష్యం పట్ల, సాధనకు వ్యూహాల పట్ల, అందులో క్రియాశీల భాగస్వాములవటం పట్లా ఉద్యమానికి మద్దతిచ్చే వారందరికీ ప్రాథమిక అవగాహనైతే ఉండాలి. సమాజం కోసం ఏదైనా చేయాలనుకుంటున్నవారు, ముఖ్యంగా యువత ఈ అంశాలపై ఆధునిక సాంకేతికతను వినియోగించుకుంటూ క్రియాశీల ఆలోచన చేయటం స్థానిక స్థాయి నుంచి మొదలుపెట్టాలి.

జనబలం
డిసెంబర్ 2019
లోక్‌సత్తా ఉద్యమ సంస్థ
మాసపత్రిక

# భయమేస్తోంది సమాజమా!

## (కఠిన శిక్షలతో అత్యాచారాలు ఆగుతాయా?)

ఎ. సునీత

కొన్నేళ్ల క్రితం 'నిర్భయ' ఘటన కాలంలో జరిగిన చర్చే ఇటీవల 'దిశ' అత్యాచారం, హత్య సందర్భంలో పునరావృతమవటం ఆశ్చర్యంగా, బాధాకరంగా ఉంది. ఈ ఘోరమైన హత్యాచారాలు ఆగాలంటే నిందితులను బహిరంగంగా ఉరి తియ్యటం లేదా కఠిన శిక్షలు విధించటమొక్కటే మార్గమన్న శుష్క, బాధ్యతారహితమైన వాదన సామాన్యుల నుంచి రాజకీయ నాయకుల వరకూ చేస్తుంటే భయం వేసింది (ఆ తర్వాత తమదైన శైలిలో కారణాలు చూపుతూ నిందితులను పోలీసులు ఎన్‌కౌంటర్ చేశారు. దీనికి గల్లీ నుంచి ఢిల్లీ దాకా సామాన్యులు, చట్టసభ సభ్యులు, రాజకీయ నేతలు హర్షాతిరేకాల్ని వ్యక్తం చేశారు. పోలీసుల్ని హీరోలుగా కీర్తించారు. వారిపై పూలజల్లుల్ని కురిపించారు). లైంగిక అత్యాచారం రోజువారీ ఎంత సాధారణంగా జరుగుతుందో తెలియని అజ్ఞానం, మన సమాజంలో పురుషులు ఈ రకంగా ఎందుకు తయారవుతున్నారో అవగాహనా రాహిత్యం ఇందుకు కారణం. నేరపరిశోధనా వ్యవస్థ, పోలీసులు, న్యాయవ్యవస్థ, న్యాయవాదులు, న్యాయమూర్తుల వైఖరులు ఎలా ఉంటాయో తెలియనితనం మధ్య సోషల్ మీడియాలో అజ్ఞాన తీర్పులు, పార్లమెంటులో అవివేక పరిష్కారాలు వెలువడ్డాయి.



ముందుగా దిశ లేదా ఆదిలాబాదులో ఇలాగే హత్యాచారానికి గురయిన కరుణ (పేరు మార్చాను) బతికుంటే ఏమి జరిగేదో ఆలోచిద్దాం. జరిగిన దాని గురించి వారిని, వారి కుటుంబాలని సమాజంలో బంధువులు, ఇరుగు పొరుగు వాళ్లు, తెలిసిన, తెలియని వాళ్లు అనేక రకాల అవమానాలకు గురిచేసేవారు. దిశకి పెళ్లవటం ఎట్లా అని బంధువులు గుచ్చి గుచ్చి అడుగుతుండేవారు. కుటుంబం మద్దతిచ్చినప్పటికీ ఇద్దరికీ పనికెళ్లటం దుర్భరంగా మారి ఉండేది. ప్రభుత్వ పరంగా గాని, ప్రయివేటు పరంగా గాని, ఇటువంటి అత్యాచారానికి గురయిన స్త్రీలకి ఆ భయోత్పాతం నుండి బయటపెయ్యటానికి అవసరమయిన వైద్య సదుపాయాలు పెద్దగా లభించి ఉండేవి కావు. దిశకి కొంతలో కొంత లభించినా, కరుణకి ఆ అవకాశం లేక దాన్నుండి బయట పడటానికి ఆమెకి జీవితకాలం పట్టి ఉండేది. ఈ లోపల ఆమె కుటుంబ ఆర్థిక పరిస్థితి మరింత కుంటుపడి ఉండేది.

ఇక నేర పరిశోధనా వ్యవస్థకొద్దాం. ముందుగా, కుటుంబ సభ్యులు ఆయా స్త్రీలు కన్పించట్లేదని పోలీసులకి ఫోన్ చేసినప్పుడు వాళ్లు సరిగా స్పందించలేదని, చట్ట విరుద్ధంగా పేరు, వివరాలు బయట పెట్టేశారని గుర్తుంచుకుందాం. ప్రజాపోరాటం లేకున్నట్లయితే, దిశకి అవసరం లేకపోయినా చట్ట విరుద్ధమయిన రెండు వేళ్ల పరీక్ష జరిగుండేది. ఆమెకి బాయ్‌ఫ్రెండ్స్ ఉన్నారా అని, కరుణకి ఆ ముద్దాయిల్లో ఎవరయినా తెలుసా అనే ఎంక్వయిరీ జరిగేది. సమయానికి ముద్దాయిలను గుర్తించే పెరేడ్ జరగటం, చార్జిషీట్ దిశ విషయంలో జరిగినా, కరుణ విషయంలో జరిగుండేవి కాదు. ఆమె కేసు పరిశోధనలో తాత్సారం తప్పకుండా జరిగుండేది. ఇదంతా జరిగి, ఈ రెండు కేసులు కోర్టుకి వెళితే, ముద్దాయిల తరపు డిఫెన్సు లాయర్లు తమ వృత్తి ధర్మం ప్రకారం ఆ సమయంలో వాళ్లిద్దరూ అక్కడ ఎందుకున్నారు అని, వాళ్లిద్దరి లైంగిక చరిత్ర, ముద్దాయిలు వారికి తెలుసా, వారు ఎందుకు రేపిస్టులతో సంఘర్షించలేదు, ఒంటి మీద గాయాలెందుకు లేవు వంటి ప్రశ్నలతో విసిగించి, నిందించి, అవమానించి, వారి వర్ణనల్లో తప్పులు వెతికి ముద్దాయిలని రక్షించటానికి ప్రయత్నం చేసేవారు. ఎందుకు ఫిర్యాదు చేశామా, ఎందుకు బతికున్నామా అని బాధితులకి అనిపించేలా కోర్టుల వాతావరణం ఉంటుందని ప్రతీక్ష బాక్సీ వంటి లీగల్ స్కాలర్ చెప్పిన రీతిలో ట్రయల్ జరిగుండేది. ఈ లైంగిక చరిత్ర గురించిన ప్రశ్నల బాధ కుల, వర్గ రీత్యా కరుణకి ఎక్కువగా, దిశకి తక్కువగా ఉండేది. ఇదే కారణాల వల్ల కరుణపై అత్యాచారం చేసినవారికి తక్కువ శిక్ష పడే అవకాశాలు కూడా ఉండేవి.

ఇదీ క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితి. ఈ పరిస్థితుల వల్లే లైంగిక అత్యాచారాల కేసుల్లో శిక్షలు పడ్డవి, పడుతున్నవి చాలా తక్కువ. ఇప్పటికీ సమాజంలో లైంగిక అత్యాచార బాధితుల పట్ల చులకన, చిన్నచూపు. అవమానకరమైన చూపులు, చేష్టలు మామూలు. యువతులనయితే వారి శీలం పోయిందని, వారిలో ఏదో తప్పుంది కాబట్టే వారిపై అత్యాచారం

జరిగిందని భావిస్తారు. అందరూ వారిని, వారి కుటుంబాన్ని దూరం పెడతారు. వారిదే తప్పని, వారినే నిందిస్తారు. పోలీసుల దగ్గరికి వచ్చేవి ప్రాణాల మీదకు వచ్చినవి, ఎక్కువగా మెడికో లీగల్ కేసులు ఉంటాయి. దేశంలో చాలామంది పోలీసుల చిట్టాలో స్త్రీలపై జరిగే లైంగిక నేరాలు దొంగతనాల కంటే చిన్న స్థాయి నేరాలు. లైంగిక అత్యాచారాలని అత్యధిక పోలీసు స్టేషన్లలో సరిగ్గా పట్టించుకోరు. దిశ కుటుంబ సభ్యులు చెప్పినట్లు ఫిర్యాదు చేసిన మహిళ గురించే పోలీసులు అవమానకరంగా మాట్లాడతారు. దేశంలో ఇతరచోట్ల అత్యాచారం జరిగిందని ఫిర్యాదు చెయ్యటానికి వెళ్లిన స్త్రీలపై పోలీసులు కూడా అత్యాచారానికి పాల్పడిన సంఘటనలు లేకపోలేదు. హాస్పిటళ్లలో డాక్టర్లతో సహా అందరూ అత్యాచారం కేసులో వైద్య పరీక్షలకు తీసుకెళ్లిన బాధితుల్ని జూలో జంతువులని చూసినట్లు చూస్తారు. కనీస మానవీయ స్పృహ లేకుండా హేళనగా చూస్తారు. చాలామంది డాక్టర్లకి రెండు వేళ్ల పరీక్ష నేర స్మృతి నుండి తీసేశారని, కాబట్టి చెయ్యకూడదని తెలియదు. ఇక కోర్టుల్లో వాయిదాలపైన వాయిదాలు అయ్యి కేసులు కొన్ని ఏళ్లపాటు సాగుతూ ఉంటాయి. చిన్న పిల్లలుగా అత్యాచారాలకి గురైనవారు తీర్పు సమయానికి పెళ్లీడుకు వచ్చిన ఘటనలు ఎన్నో. న్యాయపోరాటానికి కొన్నిసార్లు దశాబ్దాలు పడతాయి. అందుకే ఇప్పటికీ లైంగిక అత్యాచారాల గురించి ఫిర్యాదు చేసే ఆడవాళ్ల, బాలికల సంఖ్య అతి తక్కువ. జరిగే వాటిల్లో కేవలం రెండు నుంచి ఐదు శాతం మాత్రమే రిపోర్టు అవుతాయని ఒక అంచనా. తండ్రులు, సోదరులు, మామలు, బాబాయిలు, మొగుళ్లు చేసే లైంగిక అత్యాచారాలు అసలు బయటికి రావు. దినపత్రికల క్రైమ్ పేజీలో అప్పుడప్పుడు కనపడతాయి. చిన్న పిల్లలపై జరిగే వాటిల్లో అబ్బాయిలు, బాలుర మీద జరిగే లైంగిక అత్యాచారాలు సగానికి సగం ఉన్నాయని క్రైమ్ స్టాటిస్టిక్స్ చెబుతున్నాయి. ట్రాన్స్‌జెండర్ స్త్రీలపై రోజూ జరిగే అత్యాచారాలు, హత్యలు ఇంకా చట్టపరిధిలోకే రాలేదు. అంటే పట్టుబడిన నేరస్తుల సంఖ్య కంటే అసలు నేరస్తుల సంఖ్య అనేక వందల రెట్లు ఎక్కువ. బాధితులు ఫిర్యాదులే చెయ్యలేని పరిస్థితుల్లో ఉన్నప్పుడు, పట్టుబడిన ఒకరిద్దరికి కఠినమైన శిక్షలు వెయ్యటం వల్ల పరిస్థితి మారి, పట్టుబడని రేపిస్టులు భయపడతారని భావించటం కష్టం.

లైంగిక అత్యాచారం గురించి సమాజ ఆలోచనారీతులు మారకుండా ఈ పరిస్థితి మారుతుందని ఆశించగలమా? అసలు అత్యాచారాలని, ఆ స్త్రీ చనిపోతే తప్ప, ఇప్పటికీ హింసగా పరిగణించడం లేదు కదా! అంతే కాక, మనం వివిధ రకాల హత్యాచారానికి వేర్వేరు రకాలుగా ఆ స్త్రీ కులం, వర్గం, ప్రాంతం, జెండర్, రాజకీయ అస్తిత్వాలను బట్టి స్పందిస్తాం. అత్యాచారానికి గురయిన స్త్రీ బతికి బయట పడితే ఆమెని మనిషిగా గౌరవంతో చూడటం మనకింకా తెలియదు. వారి పట్ల మానవీయంగా ఎలా ప్రవర్తించాలో సమాజం నేర్పట్లేదు. అత్యాచారానికి గురయిన స్త్రీని శీలం చెడిన స్త్రీగా చూడటం మాత్రమే మనం నేర్చుకున్నాం. స్త్రీల శీలమంటే వారి శరీరాలలో ఉందనే సమాజం ఇప్పటికీ చెపుతోంది. దాని దృష్టిలో స్త్రీలంటే ప్రధానంగా పురుషుల లైంగిక వాంఛలకు పనికొచ్చే వస్తువులు– వివాహం బయట, లోపల కూడా. అందుకే అత్యాచార వ్యతిరేక నిరసనలు ఆయా స్త్రీలు వివాహ వ్యవస్థకి పనికిరారనే భయం, బాధ నుంచి వస్తున్నాయి ఎక్కువగా. స్త్రీలు వ్యక్తులనీ, లైంగిక అత్యాచారం వారి శరీరాన్నీ వ్యక్తిత్వాన్నీ ఆత్మ గౌరవాన్నీ గాయపరుస్తుందనీ, శరీరంపై హక్కుకి హాని కలిగిస్తుందన్న అవగాహన, స్పృహ అత్యాచార వ్యతిరేక నిరసనల్లో కూడా ఇంకా రాలేదు.

ఇంత పెద్ద సంఖ్యలో రేపిస్టులు ఎందుకు తయారు అవుతున్నారనేది మనల్ని మనం వేసుకోని ఇంకో ప్రశ్న. ఇంతమంది పురుషులు స్త్రీల శరీరాల్ని కేవలం తమ లైంగికేచ్ఛకి వాడుకునే వస్తువులుగా భావించటానికి కారణాలేంటి? అసలు మన పురుషుల్లో, యువకుల్లో ఎంతమందికి లైంగికచర్య ఇద్దరు మనుషుల పరస్పర అంగీకారంతో కూడుకుని ఉండాలని తెలుసు? స్త్రీలకి వాంఛలు, ఇష్టాయిష్టాలు ఉండవని, ఉండకూడదని, వారు కేవలం పురుషుల వాంఛలకు, ఇష్టాలకి పనికొచ్చే వస్తువులని నేర్పింది సంప్రదాయ సమాజం. దాన్ని ఈ ఆధునిక సమాచార యుగంలో కొనసాగిస్తోంది– నేటి సమాజం లోని కుటుంబాలు, విద్యావ్యవస్థ, సినిమాలు, ఇంటర్నెట్, సోషల్ మీడియాలే కదా? ఈ ధోరణులు మారకుండా యువకులు, పురుషులు ఎట్లా మారతారు? విద్యాసంస్థల్లో లైంగికత, లైంగిక సంబంధాల గురించి సరయిన దృక్పథం నేర్పాలంటే అడ్డుపడేది యాజమాన్యం, ఆ తరువాత తల్లిదండ్రులు, వెనుకాడేది టీచర్లు. ఎవరూ ఏమీ నేర్పకపోతే ఇంటర్నెట్ పోర్నోగ్రఫిక్ సైట్ల నుంచి లైంగిక సంబంధాల గురించి నేర్చుకుంటున్నారు ఈ తరం యువకులు. దిశ చనిపోయిన విషయం తెలిసిన కొన్ని గంటల్లోనే ఆమె అత్యాచార వీడియో కోసం పోర్నోగ్రఫిక్ సైట్లలో వెతికిన 8 లక్షల వ్యక్తులు వీళ్లలో భాగమే. పురుషత్వం ఇలా తయారవుతున్న నేపథ్యంలో, ఇతరుల శరీరాలు కేవలం వాడుకుని పారేసే వస్తువులు కాదని పురుషులకి ఈ సమాజం ఎలా నేర్పాలనుకుంటోంది? వారిని రేపిస్టులుగా తయారవకుండా ఎలా ఆపాలనుకుంటోంది? ఈ రకంగా 'మగబుద్ధి'ని పెంచి పోషిస్తున్న సమాజంలో పట్టుబడని లైంగిక అత్యాచారాల సంఖ్య, రేపిస్టుల సంఖ్య తగ్గే అవకాశమేదీ?

దిశ హత్యలో పట్టుబడిన నిందితులకు బహిరంగంగా ఉరి వెయ్యాలని ఉత్సాహపడ్డవారు అర్థం చేసుకోవాల్సింది ఏమిటంటే, వీళ్లనీ, ఇంకా పట్టుబడని అనేకమంది నేరస్తుల్నీ తయారు చేస్తోంది మన సమాజం, మన వ్యవస్థలేనని. రేపిస్టులందరినీ ఉరికంబం ఎక్కించాలంటే మన దేశంలో పురుష జనాభా శాతం తగ్గిపోయే ప్రమాదం నిజంగా ఉంది. మనం త్వరగా చెయ్యాల్సింది ఈ లైంగిక అత్యాచారాలని ప్రేరేపించే సంస్కృతిని కట్టడి చెయ్యడం. అత్యాచార బాధితులకి అవసరమయిన సహాయ సహకారాలు అందించే వ్యవస్థలని ఏర్పర్చుకోవటం. బాధితుల మాట నమ్మటం. పోలీసులు బతికున్న బాధితులపైన అత్యాచారాన్ని కూడా సీరియస్‌గా తీసుకుని తమ శైలి మార్చుకుని అత్యాచార నిందితులు అందరికీ శిక్ష పడేట్లుగా చూడటం. కోర్టుల వాతావరణాన్ని బాధితులకి అనుగుణంగా మార్చటం. బాధితులకి మానసిక స్థైర్యాన్నిచ్చే వైవిధ్యపరమయిన వసతులని తయారు చెయ్యటం, దానికి వైద్య వ్యవస్థని సన్నద్ధం చెయ్యటం. అత్యాచార బాధితులు ఎందుకు బతికున్నామా అనుకొనే ప్రస్తుత పరిస్థితుల నుండి జరిగిన దాంట్లో మా తప్పేమీ లేదు, మేము గౌరవంతో బతుకుతాం అన్న పరిస్థితిని సమాజ వైఖరులు మార్చటం ద్వారా తీసుకురావటం. ఇవన్నీ చెయ్యకుండా పట్టుబడ్డ నలుగురో, ఐదుగురో నిందితులను క్రూరంగా చంపేస్తే లైంగిక అత్యాచారాలు తగ్గుతాయనుకుంటే అంతకన్నా హాస్యాస్పదం ఇంకోటి ఉండదు!

# 'దశ' లేని పాలన .. 'దిశ' లేని న్యాయం!

## (సునీత గారి వ్యాసంపై లోక్‌సత్తా భావజాల స్పందన)

'కఠిన శిక్షలతో అత్యాచారాలు ఆగుతాయా?' పేరుతో ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన సునీత గారి వ్యాసంలోని పలు అభిప్రాయాలతో లోక్‌సత్తా ఏకీభవిస్తోంది. కాకపోతే.. సమస్య లేవనెత్తటానికి, వర్ణనకు ఇచ్చిన ప్రాధాన్యతను పరిష్కారా లకు ఇవ్వలేదనిపించింది. అందుకే స్పందించాలని భావించింది.

రాజ్యాంగ నిర్మాత డా॥ అంబేద్కర్‌ను స్మరించుకుంటున్న రోజునే దిశ హత్యాచార నిందితులను పోలీసులు ఎన్‌కౌంటర్ చేశారు. నిందితులు కర్రలు, రాళ్లతో, తమ వద్ద నుంచి లాక్కున్న తుపాకులతో దాడికి దిగటంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో ప్రాణరక్షణ కోసమే ఎన్‌కౌంటర్ చేసినట్లు పోలీసులు చెబుతున్నారు. ఎన్‌కౌంటర్ మీద సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ వి.ఎస్ సిర్పుర్కర్ నేతృత్వంలో ఆరు నెలల గడువుతో త్రిసభ్య కమిటీ వేశారు కాబట్టి.. కాస్త అటూఇటుగానైనా ఆ నిపుణులు వాస్తవాల్ని వెల్లడిస్తారని ఆశిద్దాం. కానీ ఆ ఎన్‌కౌంటర్ పూర్తిగా నివారించదగ్గది అని పోలీసు శాఖ పనితీరుపై సుదీర్ఘ అనుభవం, అధ్యయనంతో కూడిన అవగాహన కలవారు చెబుతున్నారు. ఇక, నిందితులకు ఆటవిక శిక్షలు విధించాలని డిమాండ్ చేస్తున్న జనం.. కాల్చివేయబడ్డ నిందితులే దోషులని చూచాయగా తప్ప నిర్ధారితంగా తెలియకపోయినా, నేరంలో ఇంకెవరైనా కూడా ఉన్నారా అని స్పష్టత లేకపోయినా ఎన్‌కౌంటర్‌కి జేజేలు పలికారు. ఎన్‌కౌంటర్ అన్యాయాన్ని, అదే న్యాయం అనుకుంటున్న ప్రమాదకర మూకస్వామ్యాన్ని ఖండించటం మాత్రమే చాలదిక్కడ. న్యాయం అంటే ఇదీ అని నిర్దిష్టమైన, ఆచరణీయమైన పరిష్కారాల్ని చూపాలి. ఈ పరిష్కారాల్ని ప్రతిపాదించేందుకే లోక్‌సత్తా భావజాలం తరపున స్పందిస్తున్నాం. వీటి కోసం లోక్‌సత్తా ఎన్నో ఏళ్లుగా పనిచేస్తోంది, కొన్ని ఫలితాలను కూడా సాధించింది. ఇప్పుడు కూడా దిశ హత్యాచారం తర్వాత ప్రజల్లో పెల్లుబికిన ఆగ్రహావేశాలను, చైతన్యాన్ని నిర్మాణాత్మకంగా మళ్లించి, మహిళల రక్షణకు శాశ్వత ఏర్పాట్లను సాధించేందుకు లోక్‌సత్తా తన వంతు కృషి చేస్తోంది.

### 2008 - 2019

2019లో హైదరాబాద్‌లో దిశ ఉదంతంలో జరిగినట్లే 2008లో వరంగల్‌లో అదే డిసెంబర్ మాసంలో జరిగిన ఓ ఎన్‌కౌంటర్‌ను కూడా అనేకమంది సమర్థించారు. రాజకీయ పార్టీల నేతల్లో బహుశా లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ ఒక్కరే నిర్ద్వంద్వంగా ఆ ఎన్‌కౌంటర్‌ను ఖండించారు. 'రాక్షసక్రీడకు ఆటవిక న్యాయమే సమాధానమా?.. ఎన్‌కౌంటర్‌ను ప్రజా ప్రతినిధులు సమర్థించటాన్ని తప్పుపట్టిన లోక్‌సత్తా' శీర్షికతో ఆనాటి ఎన్‌కౌంటర్‌కు వ్యతిరేకంగా విడుదల చేసిన ప్రకటనలో ఇలా పేర్కొంది:

"వరంగల్‌లో ఇంజినీరింగ్ విద్యార్థినులు స్వప్నిక, ప్రణీతపై యాసిడ్ దాడికి పాల్పడిన ఉదంతంలో నిందితులను పోలీసులు కాల్చిచంపటం ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదు. విద్యార్థినులపై యాసిడ్‌దాడికి పాల్పడినవారి దుర్మార్గానికి, పోలీసుల చర్యకూ తేడా ఏముంది? దాడికి పాల్పడినట్టు నిందితులు అంగీకరించాక, వారికి శిక్షపడేందుకు తగిన సాక్ష్యాధారాలు లభించాక పోలీసులు ఎన్‌కౌంటర్‌కు పాల్పడితే ఇక చట్టాలకు, న్యాయాలకు విలువేంటి? ఆత్మరక్షణ కోసం చంపామని పోలీసులు చెబుతున్న కథనం నమ్మశక్యంగా లేదు. ఎంతటి నేరానికి పాల్పడ్డవారైనా డబ్బు, అధికారాన్ని అడ్డంపెట్టుకుని శిక్షపడకుండా తప్పించుకునే దుస్థితి ఉందని నమ్ముతుండబట్టే సామాన్య ప్రజలు ఎన్‌కౌంటర్‌ను సమర్థిస్తున్నారు. రాజకీయనాయకుల సన్నిహితులు హత్య, రేప్ వంటి నేరాలు చేసి కూడా నిర్దోషులుగా బైటతిరుగుతున్న ఉదంతాల్ని చూస్తున్నాం. మంత్రి పొన్నాలసహా రాజ్యాంగం మీద ప్రమాణం చేసిన ప్రజాప్రతినిధులు ఎన్‌కౌంటర్‌ను సమర్థించటం బాధ్యతారాహిత్యం. ఈరోజు కొందరు దోషుల్ని శిక్షించటానికి దీన్ని అనుమతిస్తే, రేపు తమ ప్రత్యర్థుల్ని చంపటానికి పాలకులు దీన్ని వినియోగిస్తారు. కేసులు నిర్దిష్టకాలంలో పరిష్కారమయ్యేలా న్యాయసంస్కరణలు తీసుకురావాలి. పోలీసు విచారణ పద్ధతుల్ని పూర్తిగా సంస్కరించి మానవహక్కుల ఉల్లంఘనకు పాల్పడకుండా ఏర్పాట్లు చేయాలి. నేరపరిశోధనలో పోలీసులు సమర్థంగా వ్యవహరించేలా రాజకీయజోక్యాన్ని నివారించాలి. ఇందుకోసం నేరపరిశోధన విభాగానికి స్వతంత్ర ప్రతిపత్తిని కల్పించాలి. యువతకు రోల్‌మోడల్స్‌గా ఉండాల్సిన రాజకీయనేతలు... గూండాలు, నేరస్తులు, అవినీతిపరులు కావటం వల్ల ఈరోజు యువత కూడా అదేతరహాలో తయారవుతున్నారు. రాజకీయాల పట్ల అసహ్యంతో సినీనటుల్ని అనుకరిస్తున్న యువకులు కూడా సినిమాల్లో చూపిన హింసాసంస్కృతిని ఆచరిస్తున్నారు. సమాజంలో విలువలు గల నాయకుల అవసరం ఎంతైనా ఉంది".

దిశ హత్యాచారం ఎన్‌కౌంటర్‌పై కూడా ఇదే వాదనకు లోక్‌సత్తా కట్టుబడి ఉంది. ఎన్‌కౌంటర్ అనంతరం ప్రైవేటు సంభాషణల్లో పోలీసు అధికారులు మీడియా వద్ద వ్యక్తం చేసిన అభిప్రాయాలు విన్నాక, నూటికి నూరు శాతం కట్టుబడవచ్చని పునర్నిర్ధారించుకుంది. దిశపై అత్యాచారం, హత్యకు పాల్పడిన నలుగురు నిందితుల్ని ఎన్‌కౌంటర్ చేయటానికి రెండ్రోజుల ముందు ఓ ఆంగ్ల పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో నాటి యాసిడ్ దాడి బాధితురాలు టి.ప్రణీత కూడా లోక్‌సత్తా వాదననే బలపరిచేలా మాట్లాడారు. అప్పట్లో తాను కూడా ఈ తరహా ఎన్‌కౌంటర్ అన్యాయ న్యాయాన్నే కోరుకున్నా.. కాలక్రమంలో అది వాస్తవ న్యాయం కాదని ఆమె గుర్తించారు. 'మాపై దాడి చేసిన ముగ్గురు నిందితుల్ని 2008లోనే ఎన్‌కౌంటర్ చేసినా కూడా.. ఇప్పటికీ న్యాయం జరిగిందన్న భావన నాకు కలగడం లేదు' అని ప్రణీత చెప్పారు. మహిళలపై దాడులు జరగకుండా చూడటమే వారికి చేసే సరైన న్యాయమన్నారు. యాసిడ్ దాడిలో ప్రణీతతోపాటు గాయపడిన స్వప్నిక 20 రోజుల తర్వాత మరణించారు. గాయాల

నుంచి కోలుకుని ఉద్యోగంలో చేరిన ప్రణీత ప్రస్తుతం అమెరికాలోని డెన్వర్‌లో ఉంటున్నారు. "పోలీసులు తక్షణం స్పందిస్తే చాలామంది మహిళలు దాడుల నుంచి బయటపడతారు. నిందితులకు వ్యతిరేకంగా పోలీసులు గట్టి సాక్ష్యాలు సేకరించాలి. వారిని కోర్టులో విచారించి తగిన శిక్ష పడేలా చేయాలి. ప్రతి కేసు పైనా పకడ్బందీగా విచారణలు జరిపి శిక్షిస్తే.. ఇలాంటి నేరాలు పునరావృతం కావు" అని ప్రణీత అన్నారు. అందుకే దిశ ఉదంతంలో ప్రజావ్యతిరేకత గురించి ఆలోచించకుండా.. ఎన్‌కౌంటర్ వార్తను విన్న కొన్ని నిమిషాల్లోనే జేపీ అది పరిష్కారం కాదని ట్వీట్ చేశారు. ప్రజల్లో ఆవేశం తగ్గాక ఒక క్రమపద్ధతిలో వారికి వాస్తవాల్ని తెలియజేస్తూ, ఎన్‌కౌంటర్లు వంటి పద్ధతుల వల్ల చివరికి సామాన్య ప్రజలే ఎలా నష్టపోతారో వివరించాలని లోక్‌సత్తా బృందాలకు, తాను మెంటార్‌గా వ్యవహరిస్తున్న యూత్ ఫర్ బెటర్ ఇండియా నేతలకు సూచించారు.

నిర్భయ ఉదంతం నాటికన్నా దిశ ఉదంతంలో ప్రజల స్పందన తీవ్రంగా ఉంది. ఎన్నాళ్లీ వేధింపులు, లైంగిక దాడులు.. ఏదో ఒకటి శాశ్వత ప్రాతిపదికన పరిష్కారం కావాలన్న భావం చాలామందిలో బలంగా కనిపిస్తోంది. ఈ క్రమంలోనే 'ఎన్‌కౌంటర్లు – బాధితులకు న్యాయం జరగటం– సమాజంలో నేరాలను నిరోధించటం'పై కొంత వివరంగా చర్చించుకోవటం అవసరం.

**దిశ, కరుణలాంటి వారికి న్యాయం జరగటంతోపాటు, ఇక ముందు సమాజంలో ఎవరికీ అలాంటి దారుణాలు జరగకుండా మనల్ని పరిష్కారంలో భాగం చేసే కొన్ని ఆలోచనలివి.**

## పేరుకి పాప్యులర్ ప్రభుత్వాలు, నాయకులు – కానీ మొట్టమొదటి బాధ్యతలోనే పాస్ మార్కులు రావు

ప్రభుత్వం.. అది రాష్ట్రమైనా, కేంద్రమైనా మొట్టమొదట చేయాల్సిన పని– శాంతిభద్రతల్ని పరిరక్షిస్తూ చట్టబద్ధపాలనని అందించటం! కానీ.. స్వతంత్రం తర్వాత ఏ ప్రభుత్వమూ చేయలేనిరీతిలో భారతదేశంలో అద్భుత మార్పుల్ని తీసుకొస్తున్నాం, ప్రజాదరణలో సాహో అనిపించుకుంటున్నామని చెప్పుకుంటున్న నరేంద్ర మోదీ ప్రభుత్వానికిగానీ.. పాలనలో ఇన్ని అవార్డులను అందుకున్నాం, మా మాటే జనవాణి అని విమర్శకుల నోళ్లు నొక్కేస్తున్న తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలకు గానీ 'చట్టబద్ధపాలన'లో ఎన్ని మార్కులు వస్తాయి? నూటికి 20 మార్కులైనా వస్తాయా? చాలా సందర్భాల్లో రావు. తాము చేయాల్సిన మొట్టమొదటి పనిలోనే మన పాలకులు విఫలమయ్యారు. చట్టబద్ధపాలన అనే సంస్కృతిని ప్రజల రోజువారీ జీవితంలో భాగం చేసే ప్రయత్నం చేయలేదు. చట్టబద్ధంగా నడుచుకోవటం బలహీనతని, చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవటమే బలమని జనం భావించే పరిస్థితినే వీరు కొనసాగిస్తున్నారు. రాజ్యాంగం సరిగా అమలుకాకపోయినా, చట్టబద్ధపాలన లేకపోయినా తీవ్రంగా నష్టపోయేది జనాభాలో మెజారిటీగా ఉన్న పేద, అణగారిన వర్గాలు, మహిళలు, బాలలే! మన కుటుంబ వ్యవస్థ, సామాజిక పద్ధతులు బలంగా ఉండబట్టి గానీ, కేవలం మన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను నమ్ముకుంటే మన భద్రత ఈపాటికే గాలిలో దీపమయ్యుండేది. ప్రభుత్వం ఏం చేయాలో మనకు తెలియకుండా, వాటి కోసం మనం డిమాండ్ చేస్తూ ఓటు వేయకుండా.. ఎప్పుడో ఓ ఘటనపై హఠాత్తుగా పూనకాలు తెచ్చుకుని ఊగిపోతుండటం వల్లే దిశలాంటి ఘటనలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి.

## ప్రతిపక్షాల రాజ్యాంగ వ్యతిరేక పద్ధతులే పాలకపక్షం చేతిలో తుపాకులవుతున్నాయి

ఏ రాజ్యాంగమైతే సామాన్య, అణగారిన ప్రజలకు రక్షణ కల్పిస్తోందో ఆ రాజ్యాంగానికే వ్యతిరేకంగా ప్రజాభిప్రాయం పేరుతో కార్యక్రమాల్ని నిర్వహిస్తున్న విపక్ష రాజకీయ పార్టీలు, పౌర సంఘాల అరాచకత్వాన్నే పాలక పక్షాలు తుపాకీతో తమకనుగుణంగా మలచుకుంటున్నాయి. ప్రజలకు ఏది మంచి, ఏది చెడు అని తెలియజెప్పి వారిని మంచి దిశగా మళ్లించే రాజకీయం చేయకుండా, విధానం చూపకుండా.. ప్రజలను రెచ్చగొట్టి ఉద్యమాలు, ఆందోళనలు చేసే ప్రతిపక్షాల దివాళాకోరు రాజకీయమే పాలక పక్షాలకు ఎన్‌కౌంటర్లు వంటి సందర్భాల్లో అందివస్తున్న అవకాశం. పార్టీల మధ్య ఎజెండాలో, సంస్కృతిలో ఏమాత్రం తేడా లేకపోవటంతో ప్రజలకు రాజకీయ ప్రత్యామ్నాయం తప్ప.. ప్రత్యామ్నాయ రాజకీయం అందుబాటులో లేకుండా పోతోంది. ఎవరు అధికారంలోకి వచ్చినా చివరికి ప్రజాస్వామ్యానికి– నియంతృత్వానికి మధ్య ఉన్న గీత చెరిగిపోతోంది. ప్రజలతో అవసరమున్నప్పుడు వారికి బిస్కట్లలాగా డబ్బుని, తాయిలాల పథకాల్ని పడేయటం, అవి చాలనప్పుడు కులం, మతం, ప్రాంతం, భాష వంటి సంకుచిత ధోరణుల్ని రెచ్చగొట్టటం, అవీ చాలని పరిస్థితులు తలెత్తినప్పుడు ఎన్‌కౌంటర్లు వంటి థ్రిల్లింగ్ సర్‌ప్రైజ్‌లకు పాల్పడటం చేస్తుండటం తప్ప.. ప్రజల నిజమైన అవసరాలు, ఆకాంక్షలను పెద్దగా పట్టించుకోని సాంప్రదాయ రాజకీయ జమానాయే ప్రతి ఎన్నిక తర్వాతా కొనసాగుతోంది.

## ఆర్టీసీ సమ్మెనే చూడండి

తెలంగాణలో ఆ మధ్య ఆర్టీసీ సమ్మె విషయాన్నే ఉదాహరణగా తీసుకుంటే, ఇందులో ప్రధాన స్టేక్‌హోల్డర్లయిన ప్రజల ప్రయోజనాల్ని విస్మరించి విపక్షాలు రాజకీయం చేశాయి. అధికార క్రీడలో పడి న్యాయస్థానాన్ని అందుకు ఉపయోగించుకునే ప్రయత్నం చేశాయి. సమ్మె, ఆర్టీసీ ఉద్యోగుల డిమాండ్ల విషయంలో కోర్టు చేయగలిగిందేమీ లేదు, కోర్టు చెయ్యాల్సిన పనులు వేరే ఉన్నాయి, ప్రజలకు త్వరగా, చౌకగా, నిష్పాక్షికంగా న్యాయం అందించటం వంటి అంశాల మీద కోర్టు దృష్టి పెట్టాలి తప్ప ప్రభుత్వ విధానపరమైన అంశాల్లో జోక్యం చేసుకోకూడదు, కార్మికులు– సర్కారు చర్చల ద్వారా పరిష్కరించుకోవాలి.. అని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ విస్పష్టంగా సూచించినా చివరిదాకా వినిపించుకోలేదు. చివరికి కార్మికులు దాదాపు రెండు నెలలు సమ్మె అనంతరం, బేషరతుగా విరమించాల్సి వచ్చింది. ప్రభుత్వం ఆ తర్వాత ఏకపక్షంగా కార్మికులకు అడగని డిమాండ్లపై కూడా హామీ ఇచ్చి, ప్రజలకు మాత్రం ఛార్జీలు పెంచింది. సమ్మె వల్ల రెండు నెలలపాటు నష్టపోవటమేకాకుండా, ఇప్పుడు ఛార్జీల భారాన్ని కూడా సామాన్య జనమే మోయాల్సి వస్తోంది. ఒక విధానం, రాజ్యాంగబద్ధ ప్రజాస్వామిక సంస్కృతి లేకుండా ఎలాగోలా ప్రజల్ని రెచ్చగొట్టి హుజూర్ నగర్ ఉప ఎన్నికలో, ఆ తర్వాత ఆర్టీసీ ప్రైవేటీకరణ ప్రతిపాదన విషయంలో

విపక్షాలు లబ్ధి పొందాలని చూశాయి. విపక్షాల అరాచకత్వాన్నే తెలంగాణ పాలకపక్షం అవకాశంగా తీసుకుని రాజకీయంగా పైచేయిని సాధించింది. ఆ తర్వాత దిశ ఉదంతం విషయంలో కూడా అదేరీతిలో వ్యవహరించింది. ప్రజల భావోద్వేగ మద్దతు లభిస్తుందంటే ఏదైనా చేయొచ్చనే ధోరణితోనే వ్యవహరించింది. ఓ మహిళా తహసీల్దార్ సజీవ దహనం వంటి ఉదంతాల్లో అప్పటికే డిఫెన్స్‌లో పడ్డ ప్రభుత్వం.. దిశ కేసులో చట్టాన్ని అతిక్రమించినా తప్పులేదనే సంకేతాన్ని పోలీసు యంత్రాంగానికిచ్చింది (దిశ హత్యాచారం నిందితుల ఎన్‌కౌంటర్ ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌దేనని ఆయన మంత్రివర్గ సహచరులే బహిరంగంగా వ్యాఖ్యానించారు. 'హ్యాట్సాఫ్ కేసీఆర్' అని ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ దిశ ఉదంతంపై మాట్లాడుతూ సాక్షాత్తూ అసెంబ్లీలోనే అన్నారు, అది ఉద్దేశపూర్వక ఎన్‌కౌంటరే అనే అభిప్రాయాన్ని కూడా వ్యక్తంచేశారు).

## కోర్టు తీరు కూడా..

హైకోర్టు కూడా రాజ్యాంగబద్ధంగా తన పరిధిని దాటి, ఆర్టీసీ సమ్మెను రోజుల తరబడి సాగదీసిన తీరు కూడా ప్రభుత్వానికి అవకాశమిచ్చింది. న్యాయస్థానమే కట్టు తప్పుతుంటే మనం తప్పితే ఏమయితది అని ప్రభుత్వం, పాలనా యంత్రాంగం అనుకుందంటే కోర్టు తప్పుపట్టగలదా? మరోవైపు, ప్రజా ప్రయోజన వ్యాజ్యాల (పిల్స్)పై సంచలన వ్యాఖ్యలతో మీడియాలోకి రావటం తప్పించి కోర్టులు తాము చెయ్యాల్సిన పనుల మీద దృష్టి కేంద్రీకరించక పోవటం వల్ల.. ప్రజలకు కూడా న్యాయవ్యవస్థ మీద నమ్మకం పోతూ ఎన్‌కౌంటర్లను సమర్థించే పరిస్థితి ఏర్పడుతోంది. ఏతావాతా చివరికి నష్టం ప్రజలకే, అందులోనూ సామాన్య ప్రజలకే! ఆర్టీసీ ఇటీవలి ఓ సందర్భం మాత్రమే, వ్యవస్థలు పోటీపడి రాజ్యాంగ ప్రజాస్వామ్యానికి తూట్లు పొడవటం అనేక సందర్భాల్లో జరుగుతూ వస్తోంది.

## అధికారాల విభజన స్పష్టంగా ఉండి ఉంటే, స్థానిక కోర్టులు, పౌర సేవల చట్టం అమలవుతుంటే.. దిశ బలయ్యేది కాదేమో

మనం ఏర్పాటు చేసుకున్న మన ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రభుత్వం, చట్టసభలు, న్యాయవ్యవస్థ చేయాల్సిన పనులేమిటి, వాటి మధ్య అధికారాల విభజన ఏమిటి.. అనే స్పష్టత మనకి వచ్చి ఉంటే.. ఈపాటికే లోక్‌సత్తా ఎప్పటి నుంచో చెబుతున్న ప్రభుత్వ కార్యాలయాల్లో హక్కుగా పౌర సేవల చట్టం, స్థానిక ప్రభుత్వాల దాకా అధికార వికేంద్రీకరణ సాకారమై ఉండేవి. గ్రామన్యాయాలయాల చట్టం ఇప్పటికే స్థానిక కోర్టుల చట్టంగా అన్ని చోట్లా అమలవుతుండేది. పౌర సేవల చట్టం అమలవుతుండటం వల్ల.. ప్రజలు బిక్కుబిక్కుమంటూ కాకుండా, లంచాలు, ఎమ్మెల్యేల సిఫార్సులు లేకుండా పోలీస్‌స్టేషన్లలో పనులు చేయించుకుంటుండేవారు. పోలీసులు జవాబుదారీతనంతో పనిచేస్తుండేవారు. ఇదే జరిగి ఉంటే దిశ కేసులో ఆమె ప్రాణాల్ని కాపాడుకునే అవకాశం ఉండేది.

అలాగే గ్రామన్యాయాలయాలు. ఈ చట్టం కోసం లోక్‌సత్తా జేపీ 2003 నుంచి ప్రయత్నిస్తూ వచ్చారు. 2009లో వచ్చింది. కానీ దశాబ్దం దాటినా తెలుగు రాష్ట్రాల్లో ఇప్పటికీ అమల్లోకి రాలేదు. ఇప్పుడిప్పుడే ఏదో పరిమితంగా చేస్తామంటున్నారు. గ్రామన్యాయాలయాల్ని స్థానిక కోర్టు లుగా పట్టణ, నగర ప్రాంతాల్లో కూడా ఏర్పాటు చేస్తే, ఈవ్‌టీజింగ్, వేధింపుల దశలోనే లైంగిక నేరాలకు అడ్డుకట్ట వేయవచ్చు. హత్యాచారం దాకా రాకుండా చూసుకోవచ్చు. మహిళలపై ఇలాంటి తొలిదశ నేరాల సంఖ్య పెరుగుతోందే తప్ప తగ్గటం లేదు. హైదరాబాద్ తాజా వార్షిక క్రైమ్ రిపోర్టు కూడా ఇదే చెబుతోంది. మహిళల గౌరవాన్ని కించపరిచే, వేధించే దశలో నేరాల్ని అడ్డుకోనంత వరకూ పెద్దనేరాల అదుపు అసాధ్యమే అవుతుంది. పెద్ద నేరాలకు పెద్ద శిక్షలు వేయటం వల్ల పలు అనర్థాలకు కూడా అవకాశముంది.

కానీ కొంపలంటుకున్న తర్వాత తప్ప.. ముందే జాగ్రత్త పడి అమాయకులు బలికాకుండా చూసుకోవలన్న ధోరణి మన రాజకీయంలో, సమాజంలో కొరవడటం వల్ల ఇప్పటికీ స్థానిక కోర్టుల ద్వారా అత్యాచారాలను నిరోధిద్దామనే సంకల్పం కొరవడింది. గ్రామన్యాయాలయాల అమలు గురించి ప్రచారం చేయండని, చర్యలు చేపట్టండని పలుమార్లు కోరినా మహిళా సంఘాలు కూడా అంత ఆసక్తి చూపలేదు. తెలంగాణలో ఆర్టీసీ సమ్మె విషయంలో చూపిన అత్యుత్సాహంలో కొంతైనా గ్రామ న్యాయాలయాల ఏర్పాటుకు హైకోర్టు చూపి ఉంటే మహిళలకు చాలా మేలు జరిగి ఉండేది. స్థానిక కోర్టులు ఏర్పాటై ఉంటే, పలు సివిల్ కేసులు, చిన్న చిన్న తగాదాలకు కూడా పరిష్కారం లభించి పేదలకు ఎంతో ఊరట లభించి ఉండేది. ఉన్నత న్యాయస్థానాలు కూడా అడ్వకేట్ల కోసం, సొంత గుర్తింపు కోసం ఆలోచిస్తే సామాన్యులకు న్యాయమెట్లా జరుగుతుంది? సంస్థలు కావచ్చు, వ్యక్తులు కావచ్చు.. సంచలన ఘటనల్లో స్పందించటం వల్ల పేరు రావచ్చేమోగానీ, సమాజానికి న్యాయం చేయలేరు. నిజంగా మన లక్ష్యం మహిళల భద్రతే అయితే.. మనం పేరు కోసం వెంపర్లాడకుండా స్థానిక న్యాయాలయాల ఏర్పాటు కోసం పనిచేయాల్సి ఉంటుంది. బలమైన పునాదిని ఏర్పాటు చేయాల్సి ఉంటుంది.

ఇక అధికార వికేంద్రీకరణ జరిగితే కమ్యూనిటీ పోలీసింగ్ బలంగా ఉండి, స్థానికంగా శాంతిభద్రతలు ఎక్కడికక్కడ కనీస ప్రమాణాలతో ఉంటాయి.

## అనేక కేసుల్లో నిందితులు నిరక్షరాస్యులే

దిశ కేసులోనే కాదు, ఇంకా అనేక కేసుల్లో నిందితుల్లో చాలామంది నిరక్షరాస్యులు. వారిలో కొందరు పదవ తరగతి దాకా చదివినట్లున్నా, మంచి ప్రమాణాల చదువులేని వ్యవస్థలో అది అక్షరాస్యత అనిపించుకోదు. వివక్ష లేకుండా ఎదిగే అవకాశాల కోసం ప్రతి బిడ్డకూ నాణ్యమైన చదువును, ముఖ్యంగా పాఠశాల చదువును అందించటం కూడా ప్రభుత్వాల బాధ్యతే. కానీ మనం చదువులో ప్రమాణాల మీద ప్రభుత్వాల్ని ఎప్పుడైనా గట్టిగా అడిగామా? దిశ కేసులో నిందితుల గురించి, అంతకుముందు ఏడేళ్ల క్రితం నాటి నిర్భయ కేసులో నిందితుల గురించి బయటకు వచ్చిన సమాచారం ప్రకారం.. వాళ్లలో తాము చేసిన దారుణ నేరం పట్ల పెద్ద పశ్చాత్తాపం లేదు. ఇది చాలా చిన్న విషయమన్నట్లు వారు ప్రవర్తించారు. సునీత గారు చెప్పినట్లు.. పోలీసులు కూడా ఇదే తీరుగా ఉన్నారు. మన చుట్టూ రోజువారీ జీవితంలో సాటి మనిషి పట్ల నిర్లక్ష్యం, అగౌరవభావం, అమానవీయత నానాటికీ పెరుగుతుండటం, ఎదుటివాళ్లను ఎంత దుర్మార్గంగానైనా ఉపయోగించుకోవటమే జీవించటమంటే అనే ధోరణి ప్రబలుతుండటం..

అమ్మాయిలు, మహిళల పట్ల వివక్షకు పాశవికతను జోడిస్తున్నాయి. దీనికి మూలం ప్రధానంగా మన విద్యావ్యవస్థలోనే ఉంది. సరైన చదువులు మంచి ఉపాధి అవకాశాన్నే కాదు.. సామరస్య సమాజాన్ని, అందులో మంచి జీవితాన్ని కూడా అందిస్తాయి. ఇవేవీ అందించలేని పనికిమాలిన చదువుల వ్యవస్థను మనం పెంచి పోషిస్తున్నాం. మహిళల్ని కించపరిచే బూతు సంస్కృతిని, ఈర్ష్యాద్వేషాల్ని పెంచే అసమానతల్ని తొలగించలేని విద్యావ్యవస్థకు మూల్యాన్ని దిశ, కరుణలాంటి వాళ్లు చెల్లిస్తున్నారు. మంచి చదువు అంది ఉంటే, దిశ కూడా ఇంకా తెలివిగా, ధైర్యంగా వ్యవహరించి తనను తాను కాపాడుకోగలిగేదేమో.

## కోర్టుల్లోనూ తేవాలి సంస్కరణలు

ఇంకో అంశం కేసుల విచారణకు సంబంధించి కోర్టుల్లో జాప్యం. ఇందుకు స్థానిక కోర్టుల ఏర్పాటు నుంచి సమర్థ, నిష్పాక్షిక న్యాయమూర్తుల నియామకం వరకూ పలు సంస్కరణల్ని చేపట్టాల్సి ఉంది. కింది స్థాయి నుంచి అత్యున్నత న్యాయస్థానం దాకా కోట్లాది కేసులు పేరుకు పోవటానికి న్యాయమూర్తుల కొరతే కారణమన్నది పాక్షిక సత్యమే. ప్రజలకు సత్వర న్యాయం జరగకుండా కేసులు పేరుకుపోవడానికి చాలామంది భావిస్తున్నట్టుగా న్యాయమూర్తుల కొరత ఒక్కటే కారణం కాదని కేంద్ర న్యాయమంత్రిత్వ శాఖ కూడా గతంలో (మోదీ ప్రభుత్వం-1 హయాంలో) ఒక నోట్‌లో స్పష్టంచేసింది. ఢిల్లీ, గుజరాత్ వంటి రాష్ట్రాల్లో న్యాయమూర్తులు-ప్రజల నిష్పత్తి ఎక్కువగానే ఉన్నా అక్కడ కేసులను పరిష్కరించడానికి ఇబ్బందులు పడుతున్నారని తెలిపింది. కేసులు పేరుకుపోవడానికి పలు కారణాలున్నాయని న్యాయమంత్రిత్వ శాఖ పేర్కొంది. న్యాయస్థాన నిర్వహణ వ్యవస్థలు సరిగా లేకపోవడం, తరచూ వాయిదాలు పడటం, న్యాయవాదుల సమ్మెలు, రిట్ అవకాశాన్ని విచక్షణారహితంగా వినియోగించుకోవడం తదితర కారణాలను ప్రస్తావించింది. న్యాయమూర్తులు-ప్రజల నిష్పత్తిలో రెండో స్థానంలో ఉన్న ఢిల్లీ, ఐదో స్థానంలో ఉన్న గుజరాత్‌లో కేసుల పరిష్కారంలో జాప్యం జరుగుతుండగా.. ఈ నిష్పత్తి తక్కువగా ఉన్న తమిళనాడు, పంజాబ్ వంటి రాష్ట్రాల్లో కేసుల పెండింగ్ తక్కువగా ఉన్న విషయాన్ని న్యాయశాఖ గుర్తుచేసింది. జిల్లా, సబార్డినేట్ న్యాయస్థానాల్లో విచారణకు వచ్చిన సివిల్ కేసుల సంఖ్యను పరిశీలిస్తే, 2005తో పోలిస్తే 2015 నాటికి కేసుల సంఖ్య 11శాతం తగ్గినట్టు వెల్లడవుతోందని తెలిపింది. అదేకాలంలో పేరుకుపోయిన కేసుల సంఖ్య 16శాతం పెరిగిందని పేర్కొంది. 2005లో జిల్లా, సబార్డినేట్ కోర్టుల్లో జడ్జీల సంఖ్య 11,682కాగా, 2015నాటికి 16,070కి పెరిగింది. ఈ కాలంలో కేసుల సంఖ్య తగ్గి న్యాయమూర్తుల సంఖ్య పెరిగినా కేసులు పేరుకుపోవడం పెరిగిందని న్యాయశాఖ విశ్లేషించింది.

సిబ్బంది కొరత, కేసులు పేరుకుపోవటం వంటి సమస్యలకన్నా పెద్దసమస్యలు న్యాయవ్యవస్థను పీడిస్తున్నాయి. పోలీసులు సాక్ష్యాధారాలను శాస్త్రీయంగా అందించటంలో తరచూ విఫలమవుతున్నారు. రాజకీయ జోక్యం దగ్గర్నుంచి మౌలిక, సాంకేతిక వసతులు, నైపుణ్యాల కొరత దాకా పలు అంశాలు ఇందులో ఉన్నాయి. ఈ ధోరణి విపరీత జాప్యానికి కూడా దారితీస్తూ అంతిమంగా కేసు కొట్టివేయటానికి కారణమవుతోంది. నూటికి పది కేసుల్లో మాత్రమే పోలీసులు శిక్ష పడేలా చేయగలుగుతున్నారు. ఇందులో కూడా సాక్ష్యాధారాల్ని సేకరించటంలో సామర్థ్యం కంటే, అమాయకుల్ని సైతం చావగొట్టి నేరం ఒప్పించటం ద్వారా శిక్షలు వేయిస్తు న్నారు. అత్యాచార కేసుల్లో నేరనిరూపణ ఇంకా తక్కువగా ఉంది. వీటన్నిటికీ తోడు స్వతంత్ర ప్రాసిక్యూషన్ లేకపోవటం వల్ల పేదలకో న్యాయం, సంపన్నులకు ఇంకో న్యాయం జరుగుతోంది. జైళ్లలో ఉన్నవారిలో 70 శాతం మంది పోలీసులు-న్యాయవ్యవస్థ మధ్య చిక్కుకుని న్యాయ విచారణ ప్రక్రియలో వైఫల్యం వల్ల మగ్గుతున్నవారే. ఈ అండర్ ట్రయల్స్‌లో దాదాపు 90 శాతం మంది పేదలు, అణగారిన వర్గాలవారే.

సకాలంలో ప్రతి ఒక్కరికీ న్యాయం అందించటం ప్రజాస్వామ్య మనుగడకు ఎంత ముఖ్యమో గుర్తించింది కాబట్టే.. లోక్‌సత్తా వీటి కోసం తొలి నుంచీ ప్రయత్నం చేస్తూ వస్తోంది. ప్రజాప్రయోజన వ్యాజ్యాలకు (పిల్) మూలకారకుడైన జస్టిస్ కృష్ణయ్యర్, సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తులు జస్టిస్ జేఎస్ వర్మ, జస్టిస్ వెంకటాచలయ్య వంటి వారితో కలిసి పనిచేసింది. న్యాయవ్యవస్థలో పార దర్శకత కోసం లోక్‌సత్తా కృషి వల్లే వచ్చిన 99వ రాజ్యాంగ సవరణ (ఎన్‌జేఏసీ)ను సుప్రీంకోర్టు కొట్టివేసినా, ఏదోక రోజు ఆ మార్పు వచ్చితీరుతుందన్నది లోక్‌సత్తా సహేతుకంగా, చారిత్రక అవగాహనతో విశ్వసిస్తోంది.

న్యాయ, పోలీసు సంస్కరణల కోసం కూడా మనం స్పష్టతతో కృషి చేయాలని చేస్తున్న తాజా హెచ్చరిక దిశ ఉదంతం. గ్రామన్యాయాలయాల చట్టం ద్వారా స్థానిక కోర్టుల్ని తక్షణం ఎక్కడికక్కడ ఏర్పాటు చేయించాలి. న్యాయనియామకాల్లో పారదర్శకత, న్యాయమూర్తుల పనితీరులో జవాబుదారీతనం, సీఆర్‌పీసీలో, ప్రొసీజరల్ చట్టాల్లో సవరణలు, స్వతంత్ర ప్రాసిక్యూషన్, కేసుల సంఖ్య పెరుగుతుందని ఫిర్యాదుల్ని తొక్కిపట్టే పోలీసు వ్యవస్థ స్థానంలో తక్షణం స్పందించే ఏర్పాట్లు, ఎటువంటి నేరాన్నయినా పోలీసులు ఛేదించగలరు అని ప్రతి ఒక్కరికీ అర్థమయ్యే శాంతిభద్రతల వ్యవస్థ, నేర పరిశోధనలో రాజకీయ జోక్యం లేకుండా పోలీసు సంస్కరణలు వీటన్నిటినీ కూడా మనం పట్టువిడవకుండా సాధించుకోవాల్సి ఉంది. వీటిలో కొన్ని కేంద్ర ప్రభుత్వం చేయాల్సి ఉండగా, కొన్ని పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వమే చేసేయొచ్చు. ఇవి చేయకుండా ఎన్‌కౌంటర్ అనంతరం సమాజంలోని భావోద్వేగాలకు (మూడ్ ఆఫ్ ది సొసైటీ) వక్రభాష్యాలు చెప్పి ఆచరణలో విఫలమయ్యే, అమాయకుల్ని శిక్షించే, కొత్త సమస్యలు ఉత్పన్నమయ్యే రీతిలో హడావుడి చట్టాలను రూపొందిస్తే ఉపయోగం లేదు. న్యాయం మూడు వారాల్లో చేస్తామంటే ఆహ్వానించాల్సిందే. మూడు రోజుల్లోనే చేయగలమంటే ఇంకా సంతోషం. కానీ ఇందుకోసం తాము చేయాల్సిన సంస్థాగత ఏర్పాట్లు ఏవో కొన్ని హడావుడిగా చేసి సంచలనాల మీద దృష్టి పెడితే చట్టమే ప్రమాదకారిగా మారుతుంది. ఒకసారి నేరం చేసిన వ్యక్తి జీవితాంతం నేరస్తుడే అనే ధోరణి అనాగరికం, తిరోగమనం. 'మనలో పాపం చేయనివారు ఎవరో చెప్పండి, ఏ నేరం చేయనివారు ముందుగ రాయి విసరండి' అన్న క్రీస్తు స్ఫూర్తిని మాటల్లో కాకుండా చేతల్లో ప్రదర్శించాలి. నేరస్తుల్ని శిక్షించటంలో చూపే ఉత్సాహాన్ని.. నేరాలు ఇక ముందు జరగకుండా చేయటంలో చూపాలి. నేరస్తులు జీవితాంతం నేరస్తులుగానే కొనసాగుతారనే తరహా వ్యవహారశైలితో అది సాధ్యం కాదు. అసాధారణ నేరాలకు పాల్పడ్డవారికి ఉపయోగించాల్సిన కఠిన శిక్షల్ని సాధారణ వ్యక్తులకు కూడా అమలు చేయటం, తక్షణ విచారణ పేరుతో అమాయకులు బలయ్యే అవకాశాల్ని పట్టించుకోకపోవటం వంటివి విపరిణామాలకు దారితీస్తాయి. సత్వర న్యాయం సక్రమ న్యాయానికి శత్రువుగా మారకూడదు.

# నిర్భయ ఉదంతం నేపథ్యంలో ఏర్పాటైన జస్టిస్ జేఎస్ వర్మ కమిటీకి ఎఫ్‌డీఆర్, లోక్‌సత్తా అందించిన కొన్ని సూచనలు, ప్రతిపాదనలు

మహిళలపై అత్యాచార నిందితులు తప్పుడు సాంకేతిక సాకులను చూపి తప్పించుకుంటున్నారు కాబట్టి నిర్దోషిత్వ నిరూపణ భారం నిందితుల మీదే ఉండాలని.. నిర్భయ ఉదంతం నేపథ్యంలో చట్టాలను బలోపేతం చేయటానికి జస్టిస్ జేఎస్ వర్మ నేతృత్వంలో ఏర్పాటు చేసిన న్యాయకోవిదుల కమిటీకి 2013 జనవరిలో సమర్పించిన నోట్‌లో లోక్‌సత్తా, ఎఫ్‌డీఆర్ (ప్రజాస్వామ్య పీఠం) పేర్కొన్నాయి. అయితే అదేసమయంలో ఈ వెసులుబాటును వ్యక్తిగత స్వార్థం కోసం, లేదా రాజకీయ, ఇతర కారణాలతో ప్రతిష్ఠను దెబ్బతీయటం కోసం ఉపయోగించుకుని తప్పుడు ఫిర్యాదులు కూడా దాఖలయ్యే ప్రమాదముంది కాబట్టి, లైంగిక నేరానికి సంబంధించి తప్పుడు ఆరోపణలు చేస్తే అది విచారణకు అర్హమైన, బెయిలుకు అవకాశం లేని నేరంగా పరిగణించేలా, కనీసం 5ఏళ్లపాటు కఠిన కారాగార శిక్ష విధించేలా ఐ.పి.సిలో ఒక సెక్షన్‌ను చేర్చాలని కోరాయి.

## కమిటీకి అందించిన నోట్‌లో ఎఫ్‌డీఆర్, లోక్‌సత్తా చేసిన ఇంకొన్ని ప్రతిపాదనలు:

- సామూహిక అత్యాచారం, అత్యాచారంతోపాటు హత్యాయత్నం, కస్టడీలో అత్యాచారం, అపహరించి అత్యాచారం, మైనర్లపై అత్యాచారం, తనకు నయంకాని సాంక్రమిక లైంగిక వ్యాధులు ఉన్నాయని తెలిసి కూడా వ్యక్తి అత్యాచారం చేసిన సందర్భంలో, మళ్లీమళ్లీ లైంగికనేరాలకు పాల్పడటం, అనేక అత్యాచారాలకు పాల్పడటం కేసులలో మరణశిక్షను విధించాలని లోక్‌సత్తా, ఎఫ్‌డీఆర్ కోరాయి.
- అత్యాచారానికి సహకరించటం, ప్రోత్సహించటం వంటి చర్యలకు శిక్ష విధించేలా ఐ.పి.సిలో ఒక కొత్త సెక్షన్‌ను చేర్చాలి. ఒక మహిళ గౌరవాన్ని దెబ్బతీసేలా దాడికి దిగటం లేదా నేరసమాన బలప్రయోగం చేయటం వంటి కేసులకు శిక్ష కనీసం 5ఏళ్లు కఠిన కారాగారం ఉండాలని, అవసరమైతే 10ఏళ్ల పాటు కూడా ఉండాలి.
- మరణశిక్షకు అర్హమైన కేసులలో తప్ప మిగిలిన అన్నిరకాల లైంగిక నేరాలలో ఐ.పి.సి సెక్షన్ 509 కింద 'బెత్తం దెబ్బలు' కొట్టటాన్ని (జ్యుడీషియల్ కేనింగ్)ను తప్పనిసరి చేయాలని, ఇందుకోసం శిక్షాస్మృతిలో తగిన చేర్పులు చేయాలి.
- జైలుశిక్ష లేదా మరణశిక్షకు తోడు ఆ నేరాలను బెయిలుకు, కోర్టుబైట రాజీకి అవకాశంలేనివిగా చేసేలా, నేరస్తుల ఆస్తుల్ని జప్తుచేయటం కూడా తప్పనిసరి శిక్షగా చేసేలా చట్టాన్ని సవరించాలని లోక్‌సత్తా, ఎఫ్‌డీఆర్ కోరాయి.
- బాధిత మహిళలకు సాయం అందించటానికి, మహిళలపై దాడుల నియంత్రణకు ఉపయోగపడేలా ఒక నిధిని ఏర్పాటు చేయాలి. జరిమానా విధించటం ద్వారా ఆ నిధికి డబ్బు సమకూర్చాలి.
- అత్యాచార నేరాలపై వేగంగా, ప్రభావశీలంగా వ్యవహరించేందుకు ప్రత్యేక కోర్టుల్ని ఏర్పాటు చేయాలి. 2009లో వచ్చిన గ్రామ (స్థానిక) న్యాయాలయాల చట్టాన్ని అమలుచేస్తే, మహిళలపై అత్యాచార కేసులలో చాలావాటిని స్థానికంగానే, వేగంగా, తక్కువ ఖర్చుతో పరిష్కరించవచ్చు. అటువంటి అన్ని కేసులలో, విచారణ రెండు నెలల్లో పూర్తిచేయటం తప్పనిసరిచేస్తూ చట్టంలో ఏర్పాటు చేయవచ్చు. వేధింపుల దశలోనే స్థానిక న్యాయాలయాల ద్వారా వేగంగా, అందుబాటు వ్యయంతో విచారణ పూర్తి చేసి తగిన శిక్షలను విధించే ఏర్పాటు ఉంటే మహిళలపై అత్యాచారాలను సమర్థవంతంగా నిరోధించవచ్చు.
- మహిళలపై విద్యార్థులు నేరాలకు పాల్పడటాన్ని అరికట్టటానికి నోట్ సూచనలు చేస్తూ, అత్యాచారం లేదా లైంగిక దాడికి పాల్పడినట్టు విచారణ కోర్టులో నేరారోపణ జరిగితే నిర్దోషులుగా తేలేంతవరకూ ఆ విద్యార్థులను విద్యాసంస్థ నుంచి బహిష్కరించాలని నోట్ పేర్కొంది. అత్యాచారం లేదా లైంగిక దాడి కేసులో శిక్ష పడ్డ విద్యార్థులను తదుపరి చదువు కొనసాగించటానికి, ప్రభుత్వోద్యోగాలకు శాశ్వత అనర్హులుగా చేయాలని ప్రతిపాదించింది.
- బాల న్యాయ చట్టంలోని 'జువనైల్' (బాల్య దశ) అనే పదాన్ని పునర్‌నిర్వచించాలని నోట్ సూచించింది. మహిళలపై అత్యాచార నేరాలకు సంబంధించి 16ఏళ్ల వయసు పూర్తి చేసుకున్న నిందితులందరిపై కూడా వయోజనుల తరహాలోనే విచారణ చేపట్టే ఏర్పాటు చేయాలి.
- లైంగిక నేరంతో సంబంధమున్న నిందితుడు పోలీసు అధికారికి ఇచ్చే వాంగ్మూలాన్ని కూడా కోర్టు పరిగణలోకి తీసుకునేలా చట్టంలో మార్పు చేయాలి.
- మహిళలపై నేరాలకు పాల్పడ్డాడని విచారణ కోర్టులో ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తి, కోర్టులో నిర్దోషిగా రుజువయ్యేంతవరకూ ప్రజాప్రతినిధిగా ఎన్నికయ్యేందుకు అనర్హుడిగా చేసేలా ప్రజాప్రాతినిధ్య చట్టాన్ని సవరించాలి (కానీ 2014-19 మధ్యకాలంలో జరిగిన ఎన్నికల్లో గెలిచి

ఎంపీలు, ఎమ్మెల్యేలు అయినవారిలో 76 మంది మహిళలపై నేరాలకు సంబంధించిన ఆరోపణలను ఎదుర్కొంటున్నారు. వీరిలో ఎక్కువమంది బీజేపీలో (21) ఉండగా, 16 మందితో కాంగ్రెస్ ఆ తర్వాతి స్థానంలో ఉంది. ప్రాంతీయపార్టీ వైకాపాలో 7 గురు అలాంటి నేరారోపణలు ఎదుర్కొంటున్న వారున్నారని అసోసియేషన్ ఫర్ డెమోక్రాటిక్ రిఫార్మ్స్ తెలిపింది).

- ప్రతి పోలీస్ స్టేషన్‌లో మహిళలకు ప్రత్యేక విభాగం, ప్రతి జిల్లాలో అన్ని అధునాతన సదుపాయాలతో పనిచేసే ఫోరెన్సిక్ ల్యాబొరేటరీ, అన్ని పోలీసు ఠాణాలకు లైంగిక దాడులకు సంబంధించి సాక్ష్యాలను పకడ్బందీగా సేకరించేందుకు వీలుగా అన్ని పోలీసు ఠాణాలకు, ఫోరెన్సిక్ ల్యాబ్‌లకు, ప్రభుత్వ ఆసుపత్రులకు ఎస్.ఎ.ఎఫ్.ఇ (సెక్సువల్ ఎజాల్ట్ ఫోరెన్సిక్ ఎవిడెన్స్-సేఫ్) సేకరణ కిట్‌లను అందించటం, అత్యాచార నేరస్తుల జాబితా వివరాలను ప్రజలందరికీ అందుబాటులో ఉంచటం, పోలీసుల ప్రయత్నాలకు తోడ్పాటునందించేలా కమ్యూనిటీ పోలీసింగ్‌ని ఏర్పాటు చేయటం, మహిళలపై ఏరకంగా దాడిచేసేతీరుగా ఉన్నా అటువంటి కథాంశాలను, సన్నివేశాలను తొలగించేలా సినిమా సెన్సార్‌షిప్‌ని కఠినతరం చేయటం కూడా చేపట్టాలని నోట్ కోరింది.
- లైంగిక వాంఛల్ని అణచివేసుకునే సంస్కృతిగల భారతదేశంలో పట్టణీకరణ పెరుగుతూ, ఉమ్మడి కుటుంబ వ్యవస్థ తగ్గిపోతున్న ప్రస్తుత తరుణంలో, ఇంట్లో నమ్రతతో వ్యవహరిస్తూ బైటికెళ్లాక విశృంఖలంగా వ్యవహరించే వారి సంఖ్య పెరిగిపోతోంది. లైంగిక నేరస్తులు ఎక్కడో శత్రుదేశాల నుంచి వచ్చిన వాళ్లు కారు. వాళ్లంతా మన ఇళ్లలో నుంచి వస్తున్న వారే. కాబట్టి మానవసంబంధాలను, ఆడ-మగ సమానమే అనే అవగాహనను 9వ తరగతి నుంచి తెలిగ్గా, విద్యార్థులు భాగస్వాములయ్యేలా విద్యా సంస్థలలో బోధించే ఏర్పాటు చేయాలని, బాధితుల పట్ల సుహృద్భావంతో, నాగరిక ధోరణితో వ్యవహరించేలా పోలీసులకు, న్యాయవ్యవస్థకు కూడా ఇదే తరహాలో కార్యక్రమాలను నిర్వహించాలని వర్మ కమిటీకి పంపిన నోట్‌లో లోక్‌సత్తా, ఎఫ్‌డీఆర్ కోరాయి.

అత్యాచార కేసుల్లో సత్వర న్యాయం అందించే విషయాన్ని పరిశీలించేందుకు ఇద్దరు జడ్జీలతో సుప్రీంకోర్టు ఏర్పాటు చేసిన కమిటీ కూడా ఈ అంశాల్ని పరిగణలోకి తీసుకుంటుందని ఆశిద్దాం.

వర్మ కమిటీకి నివేదికను ఇవ్వటంతో పాటు.. ఆ తర్వాత ఏర్పాటైన నిర్భయ ఫండ్‌ను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వినియోగించకుండా మురగబెట్టటంపై కూడా లోక్‌సత్తా సమావేశాలు, ఆన్‌లైన్ పిటిషన్ల ద్వారా ఆందోళన నిర్వహించింది.

## చట్టబద్ధపాలన బాగున్న దేశాల్లో కూడా అత్యాచారాలు జరుగుతున్నాయి కానీ..

చట్టబద్ధపాలన మనకంటే అనేకరెట్లు మెరుగ్గా ఉన్న దేశాల్లో కూడా మహిళలపై అత్యాచారాలు మన దేశంలో కంటే ఎక్కువగా జరుగుతున్న మాట వాస్తవం. వారి దేశాల్లో నేరాలు ఎక్కువగా రికార్డుల్లో రావటం ఒక కారణమైతే, మన దేశంలో లైంగికహింస బహిరంగపరచలేని అత్యాచారాల రూపంలో, పైకి కనిపించని లైంగిక హింస రూపంలో ఎక్కువగా ఉంటోంది. ఇందులో మన కుటుంబ వ్యవస్థలోని లోపాల పాత్ర కూడా ఉంది. కానీ మొత్తంగా చూస్తే మన కుటుంబ వ్యవస్థలో బలాలే ఎక్కువ కాబట్టి.. ఈ బలాలకు చట్టబద్ధపాలనను జోడించగలిగితే, అభివృద్ధి చెందిన అనేక దేశాల్లో కంటే మన మహిళలకు ఎక్కువ రక్షణ లభిస్తుంది. లంపేన్ ధోరణులు పెరగకుండా చర్యలుండాలి,

## ఆర్థిక, రాజకీయ, పాలనా సంస్కరణల్ని తెచ్చుకోవాలి

మరోవైపు, సమాజంలో విలువలకు విలువ ఉంటుందనే పరిస్థితులు తగ్గిపోతుండటం, సరైన రోల్‌మోడల్స్ కొరవడుతుండటం, తగినన్ని ఉపాధి అవకాశాలు లేకపోవటం వంటి అంశాలు కూడా యువతను లంపేన్‌లుగా మారుస్తున్నాయి. ఇందుకోసం విలువలను ప్రోత్సహించటం, సామాజిక మనస్తత్వాన్ని నిరంతరం అధ్యయనం చేస్తుండటం, ఆర్థిక, రాజకీయ, పాలన, ఎన్నికల సంస్కరణల్ని తీసుకురావటం అవసరం. తాత్కాలిక తాయిలాల స్థానంలో ఎదిగే అవకాశాలతో కూడిన ఉపాధిని అందరికీ అందుబాటులోకి తేవాలి.

## రోబోలు, వర్చువల్ అనుభవాలతో లైంగికేచ్ఛను సంతృప్తి పరిచే వైపు మళ్లినా ఆశ్చర్యపోనక్కర్లేదు


ప్రభుత్వాలు ఇవేవీ చేయనక్కర్లేకుండా కూడా సమస్యను పరిష్కరిస్తాం, డబ్బుకి డబ్బు, పరిష్కారానికి పరిష్కారం లభిస్తుందని కొందరు సాంకేతిక రంగ బేహారులు ముందుకొస్తే అవకాశాలు కూడా ఉన్నాయి. ఎట్లాగంటే..

హ్యూమనాయిడ్ రోబోలు, వర్చువల్ రియాలిటీ అనుభవాలతో లైంగికేచ్ఛను పక్కదారుల్లోకి మళ్లించటం ద్వారా. న్యాయం అందించలేక ఎన్‌కౌంటర్లకు పాల్పడే పాలకులకు ఇదో మతాన్ని మించి మత్తునిచ్చే పరిష్కారంగా, కొత్త ఎన్నికల రాజకీయ టెక్నిక్‌గా కనిపిస్తే ఆశ్చర్య పోనక్కర్లేదు. ఈ పరిష్కారాన్ని పూర్తిగా తోసిపుచ్చనక్కర్లేదు కానీ.. మనిషి మేధస్సును వికసింపచేయకుండా నిర్వీర్యం చేసే పాలననే కొనసాగిస్తే, రోబోల యుగంలో కూడా సంక్షోభం, నేరాలు పెరుగుతాయే తప్ప తగ్గవు. రోబోల యుగంలో కూడా ప్రజలు ప్రభువుల్లా కాకుండా ద్వితీయశ్రేణి పౌరుల్లా జీవించే పరిస్థితి కొనసాగుతుంది. కాబట్టి.. ప్రభుత్వం తాను చేయాల్సిన మౌలిక బాధ్యతల విషయంలో టెక్నాలజీని అడ్డదారిగా, ఒక పరిమితి దాటి ఉపయోగించుకునే అవకాశం లేదు. రోబోలు, ఇతర సాంకేతిక పరిజ్ఞానం మనిషి అధీనంలో ఉండాలి తప్ప, మనిషి వాటి చేతిలో ఉపకరణంగా మారిపోతే కొత్త సమస్యలు, నేరాలు పుట్టుకొస్తాయి. పాలకులు, టెక్నాలజీ ఎప్పుడూ సేవకుల్లా ఉంటేనే ప్రజాస్వామ్యంలో ప్రభువులైన ప్రజల ప్రయోజనాల పరిరక్షణకు గ్యారంటీ ఉంటుంది.

ఈ నేపథ్యంలో.. చట్టబద్ధపాలన, సత్వర న్యాయం, మంచి విద్య, ఆరోగ్యం, స్థానిక ప్రభుత్వాల సాధికారత, ప్రభుత్వ కార్యాలయాల్లో హక్కుగా పౌర సేవల్ని ప్రభుత్వాల చేత నయానోభయానో చేయించటమే సమాజంగా మన ముందున్న కర్తవ్యం. ఆర్థిక, రాజకీయ, పాలనా సంస్కరణల మీద గట్టిగా దృష్టి సారించాలి. ఇవన్నీ ప్రభుత్వాలు చేయాల్సిన, పూర్తిగా ఆచరణసాధ్యమైన పనులు. వీటిని సాధించుకునే సంకల్పాన్ని మనం ప్రదర్శిస్తే.. అప్పుడు మద్యం, రెచ్చగొట్టే సీరియళ్లు, సినిమాలు, మొబైల్ నెట్, సోషల్ మీడియా, ఇతర సాంకేతికావిష్కరణల బలహీనతల్ని అధిగమించి మనందరం కోరుకుంటున్న సురక్షితమైన, సంతోషకరమైన జీవితాల్ని కుల, మత వివక్షలు లేకుండా గడపగలం. ఎన్‌కౌంటర్లతో, మానసికంగా, శారీరకంగా ప్రజల్ని నిర్వీర్యం చేసే కొత్త సాంకేతిక, మత్తు కుట్రలతో కాలం గడిచిపోవటం తప్ప మన సుఖమయ జీవితాలకు గ్యారంటీ లభించదు. ఈ ఎజెండాను సాధించుకుంటే.. ఇంట్లోని మహిళలపై లైంగిక హింస అవకాశాలకు భయపడి వారిని రకరకాల సంప్రదాయాలు, నిబంధనలతో అణగదొక్కే వివాహం పేరుతో మరో ఇంటికి పంపాలనుకునే మనలోని అనేకమంది పురుషులకు కూడా ఎంతో రిలీఫ్ లభిస్తుంది.

ప్రభుత్వాలు చేయాల్సిన పనుల్లో విఫలమైనప్పుడే.. మహిళలపై అత్యాచారం కేసుల్లో కావచ్చు, మరో సందర్భంలో కావచ్చు- ఎన్‌కౌంటర్లు జరుగుతాయి. చట్టం అనుమతించిన అసాధారణ సందర్భాలలో మాత్రమే చేయాల్సిన ఎన్‌కౌంటర్లు.. పాలక పక్షాల రాజకీయ, ఆర్థిక అవసరాల కనుగుణంగా వారు కోరుకున్న పుడల్లా జరిగిపోతున్నాయి. చట్టాలు చేసే సభలకు మనం ఎన్నుకున్న ప్రతినిధులే ఎన్‌కౌంటర్లను సమర్థిస్తున్న సిగ్గుచేటైన వ్యవస్థ నడుస్తోందిప్పుడు. దిశ కేసులో పలువురు భావిస్తున్నట్లు జరిగిన న్యాయం.. పేదవారిని, అణగారిన కులాల నిందితులను చంపటానికి తప్ప ఆ తర్వాత అటువంటి నేరాలను నియంత్రించటంలో ఎంతమాత్రం ఉపయోగపడే అవకాశం లేదు. సమాజంలో మంచిని ప్రోత్సహిస్తూ చెడును నిరుత్సాహ పరచలేనప్పుడు, కుల, మత, ఆర్థిక వివక్షలను అధిగమించలేనప్పుడు న్యాయం తన నిర్వచనాన్నే కోల్పోయినట్లు. న్యాయం సక్రమంగా లేప్పుడు ప్రజాస్వామ్యం సక్రమంగా ఎలా ఉంటుంది? రాజ్యాంగం రాకముందు మన సమాజం చక్కగా ఉండేది, రాజ్యాంగం మన దేశ పరిస్థితులకు తగినది కాదు.. అని కొందరు ఆలోచనాపరులు కూడా బాధ్యతారహితంగా ప్రమాదకర వ్యాఖ్యలు చేస్తున్నారు. వారు కొన్ని విషయాల్ని గుర్తించాలి. అప్పట్లో అణగారిన కులాల, పేద కుటుంబాల మహిళలపై అత్యాచారాలకు పాల్పడిన కిక్కురుమనకుండా ఉండేవాళ్లు. బలవంతంగా ఉంపుడుగత్తెలుగా మార్చుకున్నా మహిళలు ఫిర్యాదులు చేసేవాళ్లు కాదు. అది మామూలే అన్నట్లు సమాజం వ్యవహరించేది. ఈవేళ రాజ్యాంగమే లేకపోతే, సమానత్వ హక్కుల్ని ప్రసాదించి ఉండకపోతే.. దళితులు, ఇతర బలహీన వర్గాల పరిస్థితి ఎలా ఉండేదో ఒక్కసారి ఊహించుకుని చూడండి. రాజ్యాంగం అమలు కావటానికి పైన చెప్పిన విధానాల్ని, వ్యవస్థల్ని ఏర్పాటు చేయకుండా చేతులారా తప్పిదం చేసుకుంది మనం. దానికి రాజ్యాంగాన్ని నిందించటం అమాయకత్వమైనా అయ్యుండాలి, ఉద్దేశపూర్వకమైనా అయ్యుండాలి. ఏదైనా ప్రమాదకరమే. భారతీయ సమాజం ఎవరి నుంచీ ఏదీ నేర్చుకోవాల్సిన అవసరంలేని, ఏ రాజ్యాంగమూ అక్కర్లేని పరిపూర్ణ స్థితిలో ఉంటే.. ఎందుకండీ ఇన్ని కోట్ల మంది ఈ దేశంలో నివారించదగ్గ బాధలతో, కన్నీళ్లతో బతుకీడుస్తున్నారు? ఎందుకు తరతరాలుగా ఎదిగే అవకాశాలు లేకుండా నలిగిపోతున్నారు? ఎందుకు వీలుంటే విదేశాలకు వెళ్లి సెటిలైపోవాలనుకుంటున్నారు?.. రాజ్యాంగం విఫలం కాలేదు. అధికార క్రీడలో పడి విఫలం చేసుకుంటున్నాం.

కొస: ఓ మహిళపై లైంగికచర్య చాలా పెద్ద అంశమని అందరూ కాకపోయినా.. మనలో చాలామంది అనుకుంటూండవచ్చు. కట్టుబాట్లకు విరుద్ధంగానో, బలవంతంగానో ఓ మహిళపై లైంగిక చర్య జరిగితే కొంపలు మునిగి కుటుంబాలు ఛిన్నాభిన్నమై పోతాయనుకోవచ్చు. ఎన్ని లోపాలున్నా కుటుంబ వ్యవస్థను కాపాడుకోవాల్సిందే, భార్యాభర్తలిద్దరూ తమ లైంగిక సంబంధాల్లో పరస్పర ఒప్పందానికి కట్టుబడి ఉండాల్సిందే. కానీ సునీత గారు చెప్పినట్లు.. కేవలం లైంగికచర్య వల్ల ఓ స్త్రీ తన శీలాన్ని కోల్పోతుందనేది మాత్రం అబద్ధం, దగా! తన ప్రమేయం లేకుండా తన శరీరంలోని ఓ అంగంతో చర్య వల్ల ఓ మనిషి తన శీలాన్ని ఎలా కోల్పోతుందో గుడ్డినమ్మకాల్ని, అభద్రతల్ని దాటి సమాజం ఆరోగ్యకరంగా ఆలోచించాలి. లైంగికదాడిని ఆమె ఆత్మగౌరవంపై దాడిగానే గుర్తించాలి. మహిళలపై నేరాల్లో బాధితుల తప్పులు కూడా ఉండొచ్చు. కానీ వాళ్లు కుల, మత వివక్షల్లో కూడా వివక్షకు గురవుతున్నవారు, అగ్రకులాలుగా చెప్పబడుతున్న కులాల్లో కూడా అణగారినవారు! శతాబ్దాల అణచివేత భావజాలంలో నుంచి బయటికొస్తున్న అమ్మాయిల్లో పలువురు తమ చుట్టూ ఉన్న పరిసరాలు, పరిస్థితులను గుర్తించటంలో విఫలమై ఇంగితజ్ఞానంతో కూడా వ్యవహరించలేకపోవచ్చు.. కానీ వాటిని అడ్డం పెట్టుకుని వారి అంగీకారం లేకుండా లైంగిక చొరవ తీసుకునే స్వేచ్ఛ మాత్రం ఎవరికీ లేదు (నిజానికి హింస అనేదే లైంగిక అత్యాచారాల్లో పెద్ద అంశం. సరైన చట్టబద్ధపాలనతో స్త్రీ, పురుష తేడా లేకుండా ఎవరి మీదైనా, ఏ రూపంలోనైనా హింసను కట్టడి చేస్తే, లైంగిక అత్యాచారాలను కూడా చాలామేర అదుపు చేయవచ్చు). వైవాహిక ఒప్పందానికి భంగం కలగకుండా, హింస లేకుండా మానసిక ఆరోగ్యవంతులైన వయోజనుల మధ్య ప్రైవేటుగా జరిగే లైంగిక చర్యల్ని చర్చించటం, లైంగిక దాడిని ఆమె ఆత్మగౌరవంపై కాకుండా శీలంపై దాడిగా, స్త్రీ సమస్యగా భావించటం అనే జబ్బుల నుంచి ఒక సమాజంగా బయటపడదాం. నీ నీతులు నా బూతులు అనే స్థాయిలోనే ఇంకా బతుకుతామా, జంతువులు కూడా చేయని రీతిలో లైంగిక హింసకు పాల్పడే (వైవాహిక రేప్ సహా) దశ నుంచి నాగరిక మానవుడి స్థాయికి ఎదుగుతామా?.. అనేది పూర్తిగా మన చేతుల్లోనే, మనం ఉమ్మడిగా అనుసరించే విధానాలు, రాజ్యాంగానికి-సమాజానికి మధ్య నిర్మించుకునే పద్ధతుల మీదే ఆధారపడి ఉంది.



**(నిర్భయ నిధిని వినియోగించకపోవటాన్ని ఖండిస్తూ కార్యాచరణను ప్రకటించిన సందర్భంగా 2015, మార్చి 9న లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జేపీ, ఇతర నేతలు ఇచ్చిన మీడియా ప్రకటన)..**

# నిర్భయ నిధిలో ఒక్క రూపాయి ఖర్చు చేయకపోవటం

## సద్వినియోగంపై లోక్‌సత్తా వెబ్ పేజీలో సూచనలివ్వాలని ప్రజలకు విజ్ఞప్తి

బాధిత మహిళలకు తక్షణసాయంగా ఉపయోగపడేందుకు 2,000 కోట్లతో 2013లో ఏర్పాటు చేసిన నిర్భయ నిధిలో ఇంతవరకూ ఒక్క రూపాయిని కూడా అత్యాచార బాధితులకు వినియోగించకపోవటం సిగ్గుచేటని లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. నిర్భయ చట్టం రూపొందించే సమయంలో జస్టిస్ జె.ఎస్ వర్మ కమిటీకి లోక్‌సత్తా ఇచ్చిన నివేదికలో ఈ నిధి ఏర్పాటు కూడా ఒకటని, దోషుల ఆస్తుల్ని జప్తు చేయటం లేదా భారీ జరిమానాను విధించటం ద్వారా ఈ నిధికి డబ్బు సమకూర్చాలని లోక్‌సత్తా చేసిన సూచనను కమిటీ ఆమోదించిందని గుర్తుచేశారు. మొక్కుబడిగా మహిళా దినోత్సవాలను జరపటమే తప్ప మహిళల సమస్యల్ని పరిష్కరించేందుకు సాధారణ పాలనా చర్యల్ని, చట్టబద్ధ పాలన అమలుని కూడా పాలకులు సక్రమంగా నిర్వహించలేకపోతున్నారన్నారు.




నిర్భయ నిధిని ప్రభుత్వం తోచినరీతిలో వినియోగించటం కాకుండా పౌరుల నుంచి సూచనల్ని తీసుకోవాలని జేపీ అన్నారు. నిర్భయ ఫండ్‌ను సద్వినియోగం చేయటంపై ప్రజాభిప్రాయాన్ని సేకరించేందుకు ఈ అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజున లోక్‌సత్తా పార్టీ ఒక వెబ్ పేజీని ప్రారంభించిందని, అత్యాచారాల కట్టడికి, మహిళల సాధికారతకు దోహదం చేసేలా నిర్భయ నిధిని ఎలా వినియోగించాలో ప్రజలు **www.loksatta.org/nirbhaya** వెబ్ పేజీలో సలహాసూచనల్ని తెలియచేయాలని కోరారు. వీటిలో మెరుగైన సలహాల్ని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి అమలు చేయించేందుకు శాయశక్తులా లోక్‌సత్తా కృషి చేస్తుందని, ఇందుకు తాను వ్యక్తిగతంగా హామీ ఇస్తున్నానని జేపీ తెలిపారు.

పురుషులతో సమానంగా, సామర్థ్యమున్న యువత ముందుకొస్తే అంతకంటే ఎక్కువగానే మహిళలకు వాస్తవ ప్రాతినిధ్యం కల్పించే పార్టీ లోక్‌సత్తా మాత్రమేనని లోక్‌సత్తా పార్టీ జాతీయ అధ్యక్షుడు సురేంద్ర శ్రీవాస్తవ ఈ సందర్భంగా అన్నారు. మహిళలకు ప్రాతినిధ్యం గురించి ఉపన్యాసాలు చెబుతూ కూతుళ్లు, కోడళ్లు, బంధువులకు ప్రాతినిధ్యం కల్పించే పాత రాజకీయ పార్టీలకు పూర్తి భిన్నంగా, లోక్‌సత్తాలో నిబద్ధత, సామర్థ్యం ఉంటే ఏ మహిళకైనా ప్రజాస్వామికంగా ఎదిగే అవకాశం లభిస్తుందని అన్నారు. లోక్‌సత్తా చేసిన అనేక ప్రతిపాదనల్ని జస్టిస్ వర్మ కమిటీ తీసుకున్నా, మహిళలపై వేధింపుల దశలోనే వేగంగా విచారణ పూర్తి చేసి శిక్షలు విధించేందుకు లోక్‌సత్తా కృషితో వచ్చిన స్థానిక న్యాయాలయాలు ఎంతో ఉపయోగపడతాయని చేసిన సూచనని పరిగణలోకి తీసుకోలేదని, స్థానిక పట్టణ న్యాయాలయాల ఏర్పాటుతోపాటు మరికొన్ని సూచనల్ని నిర్భయ చట్టంలో చేర్చితే అత్యాచారాల్ని గణనీయంగా తగ్గించవచ్చని లోక్‌సత్తా పార్టీ లీగల్ కమిటీ జాతీయ ఛైర్‌పర్సన్ ఎలిజబెత్ శేషాద్రి అన్నారు.

వివక్ష లేకుండా మహిళలకు సమాన హక్కులు, సమాన ప్రాతినిధ్యం అమలులో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకే కాదు, లోక్‌సత్తా స్ఫూర్తితో వచ్చిన కొత్త రాజకీయ పార్టీ ఆమ్ ఆద్మీ (ఆప్)కి కూడా చిత్తశుద్ధి లేదని లోక్‌సత్తా పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి హైమా ప్రవీణ్ అన్నారు. మహిళా దినోత్సవ వాతావరణం కేవలం ఒక్క రోజేకాకుండా సంవత్సరమంతా కొనసాగాలని, రాజ్యాంగం అందించిన స్వేచ్ఛ, సమానత్వం, సాధికారత వారికి లభించేందుకు తగిన వ్యవస్థను రాజకీయం నిర్మించాలని అన్నారు. ఆడపిల్లలు, మహిళలు శారీరకంగా, మానసికంగా బలంగా, చురుగ్గా ఉండేందుకు ఆటల్లో కూడా పాల్గొనాలనే నినాదాన్ని లోక్‌సత్తా విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్తుందని, మహిళల కోసం స్థానిక ప్రభుత్వాలు ఆటస్థలాల్ని, మరుగుదొడ్లని, ఇతర మౌలిక సదుపాయాల్ని కల్పించాలని డిమాండ్ చేశారు. లోక్‌సత్తా పార్టీ జాతీయ అధికార ప్రతినిధి జగదీశ్వరన్ దక్షిణామూర్తి మార్చి 8న **www.loksatta.org/nirbhaya** వెబ్ పేజీని ప్రారంభించారని లోక్‌సత్తా వర్గాలు ఒక ప్రకటనలో తెలిపాయి.

**ఏపీలో రాజధాని విస్తరణను సూత్రప్రాయంగా ఆహ్వానిస్తున్నాం,
కానీ ఇది చాలా చిన్న చర్య..**

---

**'స్థానిక ప్రభుత్వాల సాధికారత, సీమ, ఉత్తరాంధ్రలకు
ఎమ్మెల్యేలతో స్వయంప్రతిపత్తి ప్రాంతీయ మండళ్లు,**

---

**ముఖ్యమంత్రి అధికారాలను దిగువకు, జిల్లాలకు
బదిలీ చేయటం'తోనే నిజమైన వికేంద్రీకరణ**


# రాజధాని వేరు, మహానగరం వేరు..

## కొన్ని శాఖలని వివిధ నగరాలలో విస్తరించినా, అమరావతిని మహానగరంగా అభివృద్ధి చేయటం మేలు: జేపీ

ఆంధ్రప్రదేశ్ రాజధానిని మూడు చోట్లకు విస్తరించాలన్న రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనను సూత్రప్రాయంగా ఆహ్వానిస్తున్నామని, వికేంద్రీకరణలో భాగంగా విస్తరణ జరగాలని లోక్‌సత్తా మొదట్నుంచీ చెబుతోందని ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. రాష్ట్ర రాజధానిగా ఎంపిక చేసిన ప్రాంతంలో శాసనసభలు, సచివాలయం, శాఖాధిపతుల కార్యాలయాలు, హైకోర్టు లేదా హైకోర్టు బెంచ్ ఉంటే సరిపోతుందని, ఇందుకు 2,000 ఎకరాలు సరిపోతాయన్నారు. వివిధ శాఖాధిపతుల కార్యాలయాల్ని ఇతర చోట్ల, ఆ రంగంతో ముడిపడిన ప్రాంతాల్లోనే ఏర్పాటు చేయటం వల్ల లాభమే తప్ప నష్టముండదన్నారు. ఉదాహరణకు గిరిజన సంక్షేమ కార్యాలయాల్ని ఆ జనాభా ఎక్కువ ఉన్న ఉత్తరాంధ్ర ప్రాంతంలో, అలాగే సెరికల్చర్‌ను అనంతపురంలో, గ్రామీణ, మెట్ట, దుర్భిక్ష ప్రాంతాభివృద్ధి కార్యాలయాలను రాయలసీమలోని జిల్లాలలో, గనుల శాఖని ఖనిజ, గనుల తవ్వకాలను ఆ వనరులున్న ప్రాంతాల్లో, సముద్ర పరిశోధనల కేంద్రాన్ని సాగర జలాలున్నచోట ఏర్పాటు చేస్తే లాభముంటుందన్నారు. ఈ కార్యాలయాలన్నిటినీ రాజధాని పేరుతో ఒకే చోట ఏర్పాటు చేయనవసరంలేదని అన్నారు. అయితే అసెంబ్లీ ఒక నగరంలో, పరిపాలన మొత్తం మరో నగరంలో పెట్టటం ఆచరణసాధ్యం కాదన్నారు.

ఆంధ్రప్రదేశ్‌కు మూడు రాజధానులు ఏర్పాటు చేయాల్సిన పరిస్థితి కనిపిస్తోందని రాష్ట్ర అసెంబ్లీలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి చేసిన ప్రకటన, తదనంతర పరిణామాలపై తనను కలిసిన మీడియాతో జేపీ మాట్లాడారు.

రాజధాని వికేంద్రీకరణకి ప్రపంచ దేశాల్లోనే కాకుండా మన దేశంలో కూడా అనేక ఉదాహరణలున్నాయని జేపీ ఈ సందర్భంగా అన్నారు. మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్ అయినా, గ్వాలియర్, ఇండోర్, జబల్పూర్‌లో అనేక ప్రభుత్వ కార్యాలయాలున్నాయన్నారు. అలాగే మహారాష్ట్ర రాజధానిగా దేశానికే తలమానికమైన ముంబయి ఉన్నా.. నాగ్‌పూర్‌లో అసెంబ్లీ సమావేశం జరుగుతుంటుందని, పూణె, నాగ్‌పూర్‌లలో ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నాయన్నారు. వింటర్, సమ్మర్ రాజధానులు మనకు సాధారణమేనన్నారు. అందువల్ల రాజధానిని విస్తరించటం ఏ రకంగానూ పొరపాటు కాదు, దీని వల్ల నష్టముండదు అన్నారు. అన్నీ ఒకచోట ఉండనక్కర్లేదన్నారు.




### ప్రజలు పనుల కోసం ముఖ్యమంత్రి, రాజధాని వద్దకు వచ్చే అవసరం లేకుండా చేయాలి

అయితే ఇది పరిపాలనలో ఒక అంశానికి మాత్రమే పరిమితమయ్యే చర్య అని జేపీ స్పష్టం చేశారు. ఇది అన్ని ప్రాంతాలనూ సంతృప్తి చెందేలా చేస్తుంది, కొన్ని సేవల అందుబాటుపరంగా ఊరటనిస్తుందిగానీ ఇదే వికేంద్రీకరణ కాదన్నారు. నిజమైన వికేంద్రీకరణ అంటే, ప్రజలు తమ పనుల కోసం ముఖ్యమంత్రి దగ్గరకు, రాజధానికి వచ్చే అవసరం లేకుండా చేయటమన్నారు. బడిపంతులు బదిలీకి కూడా ఫైల్ పట్టుకుని ఎమ్మెల్యేలు, ఉద్యోగులు ముఖ్యమంత్రి దగ్గరకు రావాల్సిన అవసరమేంటి? అని ప్రశ్నించారు. ఇది కాదు వికేంద్రీకరణ అంటే.. అన్నారు. ముఖ్యమంత్రి తన వద్దనున్న అధికారాలను మంత్రులకి, అధికారులకి బదిలీ చేయాలన్నారు. గతంలో భూమి శిస్తు కమిషనర్, డి.జి.పిలకున్న అధికారాల్ని కూడా ఇప్పుడు ముఖ్యమంత్రి చేతుల్లో పెట్టుకున్నారని వివరించారు. సమ్మిళిత అభివృద్ధికి 'జిల్లా ప్రభుత్వాలు' ఏర్పాటు చేయాలని లోక్‌సత్తా దశాబ్దాల నుంచి కోరుతోందన్నారు. నూటికి 95 పనులకి జిల్లా దాటి రావలసిన అవసరం లేకుండా చేయాలని సూచించారు.

## 20,000 - 25,000 జనాభాతో పెద్ద పంచాయతీల్ని ఏర్పాటు చేయాలి

అలాగే పంచాయితీలను విస్తరించి పెద్దవిగా మార్చాలని, 20,000 - 25,000 జనాభాతో ఒక్కో పంచాయతీని ఏర్పాటు చేసి వికేంద్రీకరణ చేపట్టాలని జేపీ అన్నారు. ఇప్పుడు ఏపీ ప్రభుత్వం గ్రామసచివాలయాలను ఏర్పాటు చేసి పెద్ద ఎత్తున సిబ్బందిని తీసుకుందని, కానీ జనాభా తక్కువ, సిబ్బంది ఎక్కువ కావటంతో వాళ్లకు పనిలేకుండా పోయిందన్నారు. సిబ్బంది ఏం చేస్తున్నారో ఎవరికీ తెలియదన్నారు. పెద్ద పంచాయతీలను పెట్టి, ఇదే సిబ్బందినిచ్చి, మంచి ఆఫీసు, కంప్యూటర్లు, ఇతర వసతుల్ని సమకూర్చి అధికారాలను పూర్తిగా బదిలీ చేస్తూ భూమి రికార్డులు దగ్గర్నుంచి దాదాపు అన్ని ముఖ్యమైన పనుల్నీ అప్పచెబితే, అప్పుడు నిజమైన వికేంద్రీకరణ మొదలవుతుందన్నారు. రాష్ట్ర బడ్జెట్ వాస్తవ విలువ సుమారు రూ.1,50,000 కోట్లు మాత్రమే అనుకున్నా.. అందుకోసం కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రానికి ఎలాగైతే నిధు లొస్తున్నాయో, అదే రకంగా రాష్ట్ర బడ్జెట్‌లో కనీసం 3వ వంతుని స్థానిక ప్రభుత్వాలైన పంచాయతీలు, మునిసిపాలిటీలకు కేటాయిం చాలన్నారు. అధ్యాపకుల జీతాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నిధులు, నిర్వహణ తదితర బాధ్యతలన్నిటినీ స్థానిక ప్రభుత్వాలకే అప్పగించాలన్నారు. అజమాయిషీని ప్రభుత్వమే చేస్తుందన్నారు.

అలాగే రాయలసీమ, ఉత్తరాంధ్రలకు ఎమ్మెల్యేలతో ప్రాంతీయ మండళ్లను ఏర్పాటు చేసి కొన్ని అవసరమైనవి మినహాయించి సర్వాధికారాలు ఇవ్వాలని జేపీ కోరారు. పనులు జరగకపోతే రాష్ట్ర ప్రభుత్వం బెత్తం పట్టుకోవాలన్నారు.

వీటితోపాటు.. ముఖ్యమంత్రి అధికారాల్ని వికేంద్రీకరించాలని జేపీ అన్నారు. ముఖ్యమంత్రి ఆధునిక రాచరికంలా, చక్రవర్తిలా వ్యవహరించటం ప్రతి రాష్ట్రంలో, గతంలో కూడా కనిపిస్తుం దన్నారు. చంద్రబాబు నాయుడు, వైఎస్ రాజశేఖర రెడ్డి, తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు ఇదే తరహా కేంద్రీకృత పాలనకు నిదర్శనాలన్నారు. బడిపంతులు బదిలీ దగ్గర్నుంచి ప్రతి చిన్న పనికి కూడా ప్రజలు ముఖ్యమంత్రి దగ్గరకు రావాల్సి అవసరమేముం దన్నారు. ఇది ముఖ్యమంత్రి గౌరవాన్ని కూడా పెంచదన్నారు. రాజధాని విస్తరణ, అధికార వికేంద్రీకరణ ఒకటి కాదన్నారు. స్థానిక ప్రభుత్వాల సాధికారత, నిధులు, విధులు ఉన్న ప్రాంతీయ కమిటీలను ఎమ్మెల్యేలతో ఏర్పాటు, ముఖ్యమంత్రి తన అధికారాలను మంత్రులు, శాఖాధిపతులు, దిగువ సిబ్బందికి బదిలీ చేస్తేనే వికేంద్రీకరణ ఫలాలు లభిస్తాయన్నారు.

## రాజధాని నిర్మాణాన్ని, మహానగర నిర్మాణంతో లంకెపెట్టవద్దు

ఇక రెండో అంశం, రాజధాని నిర్మాణాన్ని, మహానగర నిర్మాణాన్ని లంకెపెట్టటమనే పొరపాటు చేస్తున్నారని జేపీ అన్నారు. రాజధాని వేరు.. రాష్ట్ర సమగ్ర ఆర్థికాభివృద్ధికి, ప్రపంచస్థాయి వాళు మన దేశంలో పెట్టుబడులు పెట్టటా నికి మహానగరం నిర్మించటం వేరు అన్నారు. దేశంలో ఎక్కడ చూసినా మహానగరం ఉన్న ప్రాంతాలే వేగంగా పెరుగుతున్నాయన్నారు. అవి లేని రాష్ట్రాలు ఎలాతెలా పోతున్నాయన్నారు. మనకిష్టమున్నా, లేకున్నా ఇది వాస్తవమన్నారు. ప్రధానంగా మహానగరాల్లో ఉండే 'క్లస్టర్ ఎఫెక్ట్' వల్ల అనేక అంశాలు ఒకోచోట సమాహారంగా ఉండి ఆధునిక ఆర్థిక వ్యవస్థ పెట్టుబడులను ఆకర్షిస్తున్నాయన్నారు. దీనికి సంబంధించిన గణాంకాల గురించి మనమేమీ మల్లగుల్లాలు పడాల్సిన పని కూడా లేదని, దేశంలోని విదేశీ, స్వదేశీ వాణిజ్య సంస్థల వద్ద సమగ్ర వివరాల డేటా ఉందన్నారు. ఈవేళ దేశంలోని 50 శాతం మార్కెట్ డిమాండ్ కేవలం 7 మహానగరాలలో కేంద్రీకృతమై ఉందన్నారు. ఢిల్లీ, ముంబయి, కోల్‌కతా, చెన్నై, బెంగళూరు, హైదరాబాద్, అహ్మదాబాద్‌లే దేశ వాణిజ్యానికి గుండెకాయలన్నారు. విద్య, ఆరోగ్యం, సాంస్కృతికం ఇలా అన్నీ అందుబాటులో ఉన్న హైదరాబాద్‌ను కోల్పోవటం వల్ల జరిగిన నష్టాన్ని పూడ్చుకోవటానికి అమరావతిని గొప్ప నగరంగా అభివృద్ధి చేసుకోవాలన్న ఆకాంక్ష తప్పేమీ కాదన్నారు.

## మిగిలిన వేలాది ఎకరాలతో అమరావతిని మహానగరంగా తీర్చిదిద్దవచ్చు..

## సిరి రా మోకాలడ్డ కూడదు

చట్టసభలు, సచివాలయం, ఇతర కార్యాలయాలు వగైరాలకు 2,000 ఎకరాలు పోగా భూసేకరణలో మిగిలిన వేలాది ఎకరాలను అమరావతిని మహానగరంగా తీర్చిదిద్దేందుకు ఉపయోగించుకోవచ్చని జేపీ అన్నారు. రాష్ట్రానికి నడిబొడ్డులో ఉండటం, ఇప్పటికే 30,000 - 40,000 కోట్ల పెట్టుబడులకు ముందుకు రావటం వంటివి వదులుకోకూడని అవకాశాలన్నారు. సిరి రా మోకాలడ్డ కూడదన్నారు. ఇప్పటికే ప్రభుత్వం చేసిన కొన్ని పొరపాట్ల వల్ల అమరావతిలో, రాష్ట్రంలో పెట్టుబడుల్లో స్తబ్ధత ఏర్పడిందన్నారు. అమరావతిని అభివృద్ధి చేయటం.. విశాఖ, ఇతర ప్రాంతాల అభివృద్ధికి వ్యతిరేకం అనుకోవాల్సిన పనిలేదన్నారు. పెట్రో కాంప్లెక్స్, విశాఖ-చెన్నై పారిశ్రామికవాడ వంటి భిన్నమైన పద్ధతుల్లో ఆ ప్రాంతాలను అభివృద్ధి చేసుకోవచ్చన్నారు. అమెరికాలో పెట్టుబడులు పెట్టాలంటే న్యూయార్క్, అట్లాంటా, చికాగో, హ్యూస్టన్‌ల గురించి ఆలోచిస్తారని, అలాంటి నగరం లేకుండా పెట్టుబడులు రావన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో విద్య, ఆరోగ్యం, ఇతర మౌలిక వసతుల్ని ఏర్పాటు చేస్తే మహానగరాలు విశేషంగా పెట్టుబడులను ఆకర్షి స్తాయన్నారు. ఢిల్లీలో కాలుష్యం పెరిగి పోవటం వల్ల అక్కడికి రావటానికి ఇప్పుడు అంతర్జాతీయ నిపుణులు సుముఖత చూపటం లేదని, ఫలితంగా అనేక కంపెనీల్లో ఉన్నతస్థాయి పదవులు ఖాళీగా ఉన్నాయన్నారు. కాబట్టి ప్రపంచ స్థాయిలో- జీవనప్రమాణాలతో కూడిన నగరం అవసరముం దని అన్నారు. నగరాల్లోనే ఉండాలని ప్రభుత్వం ఇస్తున్న జీతాలు తీసుకుంటున్న అధికారులే అనుకుంటున్నప్పుడు.. ప్రపంచ స్థాయి ఆలోచనలతో వేలకోట్లు పెట్టుబడి పెట్టేవారు మహా నగరం గురించి ఎందుకు ఆలోచించరని జేపీ వ్యాఖ్యానించారు.

## అన్ని చోట్లా ప్రభుత్వం ఈ మౌలిక ఏర్పాట్లు చేస్తే భూముల ధరలు అడ్డగోలుగా పెరగవు

భూముల ధరలు ఒక పద్ధతి లేకుండా, పట్టణీకరణ అవకాశం లేని చోట కూడా పెరుగుతూ ఆకాశాన్నంటుతుండటానికి మనలోని ఫ్యూడల్ మనస్తత్వం, పాలకుల విధానాల వైఫల్యమే కారణమని జేపీ

ఒక ప్రశ్నకు సమాధానంగా అన్నారు. మనకు కాస్త మిగులు డబ్బు కనబడగానే మన ఆలోచన భూములు, బంగారం చుట్టూనే తిరుగుతుంటాయన్నారు. అందుకే రాజధాని అనగానే గతంలో పోలో మంటూ హైదరాబాద్‌లో, ఆ తర్వాత విజయవాడలో భూముల కొనుగోళ్లకు పరిగెట్టారన్నారు.

రాజధానిగా ప్రకటించగానే విజయవాడలో భూముల రేట్లు అమాంతం పెరిగి హైదరాబాద్ స్థాయికి చేరాయని అన్నారు. అలాగే ముంబయిలో రేట్లు న్యూయార్క్ స్థాయిలో పెరిగాయని, కానీ రెండు నగరాల మధ్య ప్రమాణాల్లో ఎంతో అంతరముందన్నారు. మౌలిక వసతులు, నాణ్యమైన విద్య, ఆరోగ్యం వంటివి అన్ని ప్రాంతాలకూ అందుబాటులోకి తెస్తే, భూముల ధరలు కూడా ఇష్టారీతిన పెరగవన్నారు. అన్ని ప్రాంతాల్లో ఈ వసతుల్ని కల్పించినా కూడా క్లస్టర్ ఎఫెక్ట్ వంటి కారణాల వల్ల మహానగరాల వైపు మొగ్గు ఉంటుంది కాబట్టి ఆర్థికాభివృద్ధి ఇంజిన్లుగా మహానగరాల అభివృద్ధికి ప్రతి రాష్ట్రం కృషి చేయాలన్నారు. అమరావతిని రాష్ట్ర అధికార కార్యకలాపాల కేంద్రంగా, రాజధానిగా పరిమితం చేస్తూనే, దాన్నే ఆర్థికాభివృద్ధి కేంద్రంగా ఉండే మహానగరంగా తీర్చిదిద్దే ప్రయత్నం జరగాలన్నారు.

## హైకోర్టును కర్నూలుకు తరలించటాన్ని సమర్థిస్తాను

అలాగే హైకోర్టు కర్నూలుకు తరలించాలన్న వాదనను తాను సమర్థిస్తానని, కానీ శ్రీకాకుళంలో ఉండేవారికి న్యాయం కావాలంటే రాష్ట్రంలోని ఈ మూల ఉండే కర్నూలుకు రావటం కష్టమైన పనేనని జేపీ అన్నారు. కాబట్టి హైకోర్టును కర్నూలులో ఏర్పాటు చేస్తే.. దూరంగా ఉన్న విశాఖపట్నం, అమరావతి వంటి చోట్ల ప్రాంతాల్లో హైకోర్టు బెంచ్‌లను ఏర్పాటు చేయాలన్నారు.

## రూ.10 ఖర్చు పెట్టాల్సిన చోట రూ.1000 ఖర్చు పెట్టటం వల్లే..

ప్రజాధనం ప్రతి రూపాయీ విలువైనదనే పొదుపరితనాన్ని ప్రభుత్వాలు మర్చిపోయాయని, తమ విలాస భవంతులు, వాహనాల కోసం రూ.10 ఖర్చు పెట్టాల్సిన చోట రూ.1000 ఖర్చు పెడుతున్నాయని జేపీ ఒక ప్రశ్నకు సమాధానంగా అన్నారు. దీర్ఘకాలంగా ప్రజలకు ఏది మేలు చేస్తుందో ఆలోచించకుండా.. తమకు కాంట్రాక్టులు, ప్రజల ఓట్లు లక్ష్యంగా ప్రజల సొమ్మును తగలేస్తున్నారన్నారు. దీనివల్లే ఆర్థికలోటు ఇంకా పెరుగుతోందన్నారు. ఈ విషయంపై అనేకమార్లు హెచ్చరించానన్నారు.

## ఏపీకి విభజన హామీలపై లోక్‌సత్తా నివేదికను ఉపయోగించుకోవాల్సిన బాధ్యత పార్టీలు, ప్రజల మీదే ఉంది

విభజన సమయంలో ఆంధ్రప్రదేశ్‌కిచ్చిన హామీల్ని కేంద్రం నెరవేర్చేలా సమగ్ర నివేదికను లోక్‌సత్తా, ఎఫ్‌డీఆర్ స్వతంత్ర నిపుణులతో కలిసి రూపొందించిందని, దీన్ని వినియోగించుకోవటం రాజకీయ పార్టీలు, ప్రజల బాధ్యతని జేపీ స్పష్టం చేశారు. ఇది అనుభవం, పరిజ్ఞానం, విశ్వసనీయత గలవారు రూపొందించిన నివేదికని, దీనికోసం పనిచేసినవారు ఒక్క రూపాయి కూడా తీసుకోకుండా కేవలం పౌరులుగా తమ బాధ్యతగా చేశారన్నారు. దేశంలో ఒక రాష్ట్ర సమస్య మొత్తం దేశ సమస్య అనే ఉద్దేశంతో తెలుగేతర రాష్ట్రాల నిపుణులు కూడా దీన్ని నిగ్గు తేల్చి ఆమోదించారన్నారు. ఇందులో తప్పులుంటే చూపాలని బహిరంగంగా ప్రకటన కూడా జారీచేశామన్నారు. దీన్ని వినియోగించుకోవటం ఇక పూర్తిగా పార్టీలు, పౌర సమాజం, ప్రజల కోర్టులో ఉందన్నారు.

## ఎఫ్‌డీఆర్‌ను ఢిల్లీలో పెట్టమన్నా తిరస్కరించాను, రాజధానిని వదిలి మన ఊరు, మన చుట్టూ గురించి ఆలోచించటం మొదలుపెడదాం

దేశమంటే మట్టి కాదు, మనుషులు అనే ధోరణిపోయి.. దేశమంటే, రాష్ట్రమంటే రాజధానే అనే రాచరికపు భావజాలం మనలో పాతుకుపోయిందని జేపీ అన్నారు. "ఢిల్లీలో ఏం జరిగినా, పార్లమెంటులో ఏం జరిగినా అది మనకు పెద్దవార్త. మహానగరంలో ఏదైనా జరిగితే సంచలన వార్త. మన ఊళ్లో భూకంపం వచ్చినా మనం పట్టించుకోం. పరిణతి చెందిన దేశాల్లో ఇలా ఉండదు. మారుమూల పల్లెల్లో జరిగిన వార్తలకు సైతం అక్కడి రాజకీయ, న్యాయవ్యవస్థలు, మీడియా స్పందిస్తాయి. మన దేశంలో మీడియా కూడా ఢిల్లీలో తుమ్మటం, దగ్గటమే వార్తన్నట్లు ప్రచారం చేస్తుంది. ఇది మారాలి. అధికారం ఉన్నచోటే ఆర్థిక వ్యవస్థ ఉండాల్సిన పనిలేదు. అధికార వికేంద్రీకరణ వేరు, ఆర్థిక వికేంద్రీకరణ వేరు అని గుర్తించాలి. ఎఫ్‌డీఆర్‌ను ఢిల్లీలో పెట్టమని చాలామంది సూచించినా నేను తిరస్కరించాను. మన దేశ పరిస్థితుల్లో ఈ సంస్థ ఢిల్లీలో ఉండి ఉంటే మకుటాయమానమైన అత్యున్నతస్థాయి గుర్తింపును దేశవ్యాప్తంగా కూడా తెచ్చుకుని ఉండేది. కానీ ప్రజలు, మనం ఎక్కడుంటే అక్కడే ఎఫ్‌డీఆర్ ఉండాలని హైదరాబాద్‌నే ఎంపిక చేసుకున్నాం. ఒక్క భారతదేశంలో మాత్రమే రాజధానిలో వాళ్లు ప్రభుత్వాలు, మిగిలినవాళ్లు పురుగులు అనే ధోరణి ఉంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పాలకులు అన్నీ హైదరాబాద్‌లో ఏర్పాటు చేయటం వల్లే తెలంగాణ ప్రజల్లో ఆవేదన ఉద్యమ రూపం దాల్చిందని, అదే తప్పును తెలంగాణలో, నూతన ఏపీలో మళ్లీ చేయవద్దని, స్థానిక స్థాయికి అధికారాలను వికేంద్రీకరించాలని, రాజధానితో సంబంధం లేకుండా ఆర్థికాభివృద్ధిని చేయాలని పలుమార్లు కోరాను. కేవలం మాటల్లోనే కాదు.. నేను ప్రభుత్వాధికారిగా ఉన్నప్పుడు ఆచరణలో కూడా వికేంద్రీకరణను, ఆర్థిక వృద్ధి చూపాను, ప్రయత్నాలు చేశాను. మూసీనది కృష్ణలో కలిసే చోట, బెంగళూరు హైవే కృష్ణని దాటే చోట పెద్ద పారిశ్రామికవాడల ఏర్పాటు కోసం అప్పట్లో ప్రధాని పీవీ నరసింహారావుతో గట్టిగా వాదించాను. అలాగే దిగువ మానేరుడగ్గర కరీంనగర్ జిల్లాలో, కండలేరు నీటి వినియోగం ద్వారా కృష్ణపట్నంలో పారిశ్రామికవాడల నివేదికల్ని రూపొం దించి మరీ ప్రతిపాదించాను. కానీ తాత్కాలిక ఉపశమనాలు తప్ప భవిష్యత్తుకు ఉపయోగే పడే దృష్టి కొరవడటం వల్ల ఇప్పటికీ సక్రమంగా ఆచరణలోకి రాలేదు. "ముఖ్యమంత్రి ఎక్కడుంటే అది తప్ప మిగిలిన ప్రాంతమంతా శ్మశానమే అనుకుంటున్నాం. కానీ అధికారంలో ఉన్నవారు ప్రభువులు కాదు, నవాబులు కాదు, చక్రవర్తులు కాదు. ప్రజల వద్దకు పాలన వెళ్లాలి తప్ప.. ప్రజలు పాలన వద్దకు రాకూడదు" అని జయప్రకాష్ నారాయణ్ స్పష్టంచేశారు.




# 'అవినీతి' అంశాన్ని పాఠ్యపుస్తకాల్లో చేర్చండి

అవినీతిలో భారతదేశం ప్రపంచస్థాయిలో 78వ స్థాయిలో ఉంటే, దేశంలో తెలంగాణ 5వ స్థానంలో ఉందని, అవినీతి 'కంపు' లోకి భావితరాలు దిగకుండా ఉండేందుకు పాఠ్యపుస్తకాల్లో దీన్నో అంశంగా చేయాలని లోక్‌సత్తా ఉద్యమ సంస్థ కరీంనగర్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎన్.శ్రీనివాస్, ప్రకాష్ హోల్లాలు అన్నారు. అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినం సందర్భంగా 'అవినీతి వ్యతిరేక ప్రచార వారోత్సవాన్ని' లోక్‌సత్తా నిర్వహించింది. అందులో భాగంగా స్థానిక ట్రినిటీ బాలికల కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో లోక్‌సత్తా నేతలు పాల్గొన్నారు. అత్యున్నత స్థాయి ఐఏఎస్ ఉద్యోగాన్ని వదులుకుని అవినీతి నిర్మూలనకు దశాబ్దాలుగా కృషి చేస్తున్న లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్‌ను ఆదర్శంగా తీసుకోవాలని ప్రిన్సిపాల్ రమణారెడ్డి ఈ సందర్భంగా విద్యార్థులను కోరారు. హాజరైన వెయ్యి మంది విద్యార్థులతో అనంతరం అవినీతి వ్యతిరేక ప్రతిజ్ఞ చేయించారు. కళాశాల పాలనాధికారి రాజిరెడ్డి, లెక్చరర్ మహీపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో..

ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో నిర్వహించిన అవినీతి వ్యతిరేక ప్రచార కార్యక్రమంలో శ్రీనివాస్, ప్రకాష్ హోల్లాలు మాట్లాడుతూ.. పేదలు, రైతుల నిత్యసంక్షోభానికి, ఆత్మహత్యలకు అవినీతే మూలకారణమని స్పష్టం చేశారు. తెలంగాణలో అవినీతి పెరగడానికి అధికారులు-రాజకీయ నాయకులు కుమ్మక్కవటమే కారణమన్నారు. అవినీతిని నిర్మూలిస్తే బంగారు తెలంగాణ ఏర్పడటంతోపాటు భవిష్యత్ భారతం బంగారుమయం అవుతుందన్నారు. రాష్ట్రంలో లోకాయుక్తను తక్షణమే నియమించాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల్లో సామాజిక స్పృహ కలిగించేందుకు కార్యక్రమం చేపట్టినందుకు లోక్‌సత్తా నాయకులను ప్రిన్సిపాల్ కె.రవీందర్ రెడ్డి అభినందించారు. లోక్‌సత్తా నేతలు కె.ఎస్ నారాయణ, టి.గంగారావు, సయ్యద్ ముజఫర్, ఎం.గంగాధర్, మహేందర్, లక్ష్మీనారాయణ, నాగమోహన్, మునీర్ తదితరులు ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

## ఆర్‌టీఐ కార్యకర్తను కాపాడండి

ఇసుక అక్రమ రవాణా గురించి అధికారులకు సమాచారమిచ్చి ప్రజాధనాన్ని కాపాడాలనే ఉద్దేశంతో పనిచేస్తున్న బొమ్మకల్ గ్రామానికి చెందిన దొమ్మాటి బాబుపై ఇసుక మాఫియా దాడులు చేస్తున్నదని, ఇసుక మాఫియాకు అడ్డుకట్ట వేయాలని కరీంనగర్ జిల్లా పోలీస్ అధికారికి లోక్‌సత్తా నేతలు శ్రీనివాస్, ప్రకాష్ హోల్లా విజ్ఞప్తి చేశారు. కలెక్టర్, పాలకులు ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకోవాలన్నారు. అవినీతిని బైటపెట్టే విజిల్ బ్లోయర్లను రక్షించాలని, ఆర్‌టీఐ కార్యకర్తల రక్షణకు 2010లో ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను అమలు చేయాలన్నారు.






# సాంకేతికతను సమాజహితానికి ఉపయోగించండి



ఈవేళున్న సాంకేతిక పరిజ్ఞానంతో గత తరంలో అసాధ్యమనుకున్న, ఊహించను కూడా లేని అనేక జటిలమైన సమస్యలను పరిష్కరించవచ్చని, అయితే సాంకేతిక పరిజ్ఞానంతోపాటు నాయకత్వ లక్షణాలను కూడా అలవరచుకుంటేనే ఇంజినీరింగ్ విద్యార్థులు విజయాల్ని సొంతం చేసుకోగలరని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. బుద్ధిబలం, ఉమ్మడిగా పోరాడేతత్వం, సాంకేతిక పరిజ్ఞానాన్ని సమాజ శ్రేయస్సు కోసం వినియోగించే దృక్పథం ఉంటే.. విద్యార్థులు తమ సమస్యల్ని, చుట్టూ సమాజంలో ఉన్న సమస్యల్నీ కూడా పరిష్కరించుకోగలరన్నారు. విజయనగరం జిల్లా డెంకాడ మండలం చింతలవలసలోని మహారాజా విజయరాం గజపతిరాజు (ఎంవీజీఆర్) ఇంజినీరింగ్ కళాశాలలో వివిధ వలంటీర్ కమిటీల ద్వారా సేవలందిస్తున్న విద్యార్థులనుద్దేశించి జేపీ మాట్లాడారు. 'పౌరులుగా యువత తమ హక్కుల్ని, బాధ్యతల్ని తెలుసుకోవటం' గురించి వివరించారు.

మనకు మానవ వనరులు పుష్కలంగా ఉన్నా, అందులో యువతే అత్యధిక సంఖ్యలో ఉన్నా.. పాలనలు వాటికి సానపట్టకుండా అపసవ్య దిశలో నడిపిస్తున్నాయని జేపీ అన్నారు. విద్యార్థులు ప్రాథమిక అంశాల మీద పట్టు సాధిస్తే, ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తే ఉన్నతస్థాయిని అందుకోగలరన్నారు. ప్రగతిని సాధించే క్రమంలో భావోద్వేగాలు, ఒత్తిడికి గురికావద్దన్నారు. ప్రతి సమస్యకూ ఒక పరిష్కారం ఉంటుందని, డిప్రెషన్‌కు లోనవ్వాల్సిన పనిలేదన్నారు. తెలివిగా వ్యవహరిస్తూ సమస్యల్ని అధిగమించాలన్నారు. సమస్యల్ని పరిష్కరించుకునే ప్రక్రియలో ప్రతి ఒక్కరూ క్రమబద్ధమైన అవగాహన కలిగిఉండాలన్నారు. ఇలాంటి యువతే దేశాభివృద్ధికి కీలకమన్నారు.

ప్రస్తుతం దేశం ఎదుర్కొంటున్న పెనుసవాళ్లలో విద్యుత్‌ను నిల్వ చేయటం ఒకటన్నారు. ఇలాంటి సవాళ్ల మీద కొత్త ఆలోచనలతో విజయం సాధించాలని జేపీ సూచించారు.

అనంతరం విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు జేపీ సమాధానాలిచ్చారు. దిశ వంటి అత్యాచార కేసుల్లో నూటికి 90 మంది దోషులకు శిక్షలు పడటం లేదన్నారు. పోలీసు, న్యాయవ్యవస్థలను బాగు చేయటం గురించి కాకుండా.. ఎన్‌కౌంటర్ల గురించి మాట్లాడుకుంటే ఎప్పటికీ మహిళలు, సామాన్యులపై హింసకు పరిష్కారం రాదన్నారు. రాజకీయం బానిసత్వంలాగా తయారైందన్నారు. పార్టీలు సొంత ఎస్టేట్లుగా తయారయ్యాయని.. ఎందుకు గెలుస్తున్నామో, చట్టసభ సభ్యులమని చెప్పుకుంటూ సరైన చట్టాలు చేయకుండా ప్రభుత్వం చేయాల్సిన పనుల్లో ఎందుకు జోక్యం చేసుకుంటున్నామో తెలియకుండా ఎన్నికల్లో కోట్లు ఖర్చు పెడుతున్నారన్నారు. ప్రభుత్వాల మీద నమ్మకం లేదు కాబట్టే ప్రజలు ఉచితాలను డిమాండ్ చేస్తున్నారని, ఉచితాలను ఇస్తామనకపోతే గ్యారంటీగా ఓడిపోతామని పార్టీలు అంటున్నాయని అన్నారు. దీన్ని రాజకీయం అనరని, దీన్ని మార్చే నిజమైన రాజకీయ కృషినే తాను, లోక్‌సత్తా చేస్తున్నామని అన్నారు.

కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ కేవీఎల్ రాజు, మాన్సాస్ ట్రస్ట్ సభ్యుడు పీఎల్‌పీ రాజు, స్టూడెంట్స్ డీన్ ఎస్.మోహన్ కుమార్, యూత్ ఫర్ బెటర్ ఇండియా (వైబీఐ) సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## రాష్ట్రానికి, దేశానికి అశోక్ సేవలు అవసరం

ఢిల్లీలో శస్త్రచికిత్స చేయించుకుని విజయనగరంలోని నివాసానికి ఇటీవలే తిరిగొచ్చిన కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజును జేపీ పరామర్శించారు. రాష్ట్రంలో, దేశంలో నెలకొన్న రాజకీయాలపై కొంతసేపు చర్చించారు. అశోక్, తాను మంచి మిత్రులమని, తెలుగునాట, జాతీయస్థాయిలోనూ పలు అంశాల్లో కలిసి పనిచేశామని జేపీ ఈ సందర్భంగా చెప్పారు. రాజకీయాల్లో నైతిక విలువల కోసం కృషి చేసే అశోక్‌లాంటి వారి అవసరం రాష్ట్రానికి, దేశానికి ఉందన్నారు. ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. జేపీతోపాటు లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ, రాష్ట్ర ప్రతినిధి ఎం. రాజ్‌వర్మ, పీఎల్‌పీ రాజు తదితరులు ఉన్నారు.



# ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ.. రాజ్యాంగమా, రాజ్యాంగమా రక్షించు అంటే ప్రయోజనముండదు





రాజ్యాంగ విలువలను రాజకీయ పార్టీలు ధ్వంసం చేస్తున్నాయని లోక్‌సత్తా ఉద్యమ సంస్థ కన్వీనర్ బండారు రామ్మోహనరావు అన్నారు. పేదలు, బలహీనులను కాపాడే గొడుగు రాజ్యాంగమని, అయితే వారిలో రాజ్యాంగ అవగాహన లేకుండా చేస్తూ వారి చేతే రాజ్యాంగ ఉల్లంఘనల్ని పార్టీలు, కొన్ని ప్రజాసంఘాలు చేయిస్తున్నాయని అన్నారు. రాజ్యాంగాన్ని కాపాడుకోవటం, మాటల్లో కాకుండా ఆచరణలో ఉండేలా చేయటం మీదే ప్రజల ఉజ్వల భవిష్యత్ ఆధారపడి ఉంటుందన్నారు. ఏడు దశాబ్దాల రాజ్యాంగ, రిపబ్లిక్ దినోత్సవాల సందర్భంగా హన్మకొండ కల్యాణి నర్సింగ్ హోంలో జరిగిన నిర్వహించిన రౌండ్‌టేబుల్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాజ్యాంగ పదవులైన రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి, పార్లమెంటు ఉభయ సభల స్పీకర్లు, గవర్నర్లతోపాటు న్యాయవ్యవస్థను కూడా భ్రష్టుపట్టించే రాజకీయం కొన్నేళ్లుగా ఊపందుకుందని రామ్మోహనరావు అన్నారు. చట్టసభల్లో ఉన్న సభ్యుల్లో చాలామందికి చట్టాల గురించే అవగాహన లేదని, చట్టవ్యతిరేక చర్యలను ప్రోత్సహించేలా వ్యవహరిస్తున్నారన్నారు. మనం ఓటు హక్కును, స్వేచ్ఛను సరిగా వినియోగించుకోకుండా.. మేం తప్పులు చేస్తుంటాం, అయినా రాజ్యాంగం రక్షించాలంటే సాధ్యం కాదన్నారు. స్థానిక ప్రభుత్వాల నుంచి పార్లమెంటు దాకా మనం ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసుకుంటే, మన రాజ్యాంగం మన కలల్ని నెరవేర్చే ఫలితాలనిస్తుందన్నారు.

లోక్‌సత్తా ఉద్యమ సంస్థ రాష్ట్ర సలహాదారు పర్చ కోదండ రామారావు మాట్లాడుతూ, స్వార్ధ రాజకీయాల నుంచి దేశాన్ని రక్షించాల్సిన బాధ్యత యువత తీసుకోవాలన్నారు. రాబోయే కాలంలో 90 శాతానికి పైగా యువతదేనని, తమ కోసమే తాము దేశం కోసం పనిచేస్తున్నామని యువత, విద్యార్థులు గుర్తించాలన్నారు. యూత్ మేల్కొనని పక్షంలో రాజకీయ పార్టీలు, నేతల నియంతృత్వం ప్రమాదకర స్థాయికి చేరుతుందన్నారు. భారత సంవిధానాన్ని ఆచరణలోకి తేవటానికి చేయాల్సిన పనులే యువతకు మంచి రోడ్‌మ్యాప్ అన్నారు. 'జ్వాల' స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు సుంకరి ప్రశాంత్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో.. ప్రొఫెసర్ కూరపాటి నారాయణ, అబ్దుల్ కలాం ఫౌండేషన్ బాధ్యులు శివప్రసాద్, స్వరరావు, వ్రతం క్రిష్ణయ్య, లోక్‌సత్తా ఉద్యమ సంస్థ జిల్లా అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డి, వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.




"ప్రజల మెప్పుదలకు పాకులాడే
ప్రజాసేవకుడు చుక్కానిలేని పడవ వంటివాడు."
-మహాత్మాగాంధీ




## జవాబుదారీతనం, సాంకేతికతతో

# మెరుగైన పౌర సేవలు

ఆధునిక ప్రజాస్వామ్యంలో ప్రభుత్వమంటే పెత్తనం కాదని, ప్రజలకు సేవ చేయటమని ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకుడు, యూత్ ఫర్ బెటర్ ఇండియా (వైబీఐ) మెంటార్ డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. జవాబుదారీతనం లేని అధికారం ఎంత గొప్ప పాలకుడికైనా, అధికారికైనా ఉండదన్నారు. వైబీఐ, 'యస్ వియ్ కెన్' సంస్థల ఆధ్వర్యంలో విశాఖపట్నంలోని ప్రిజమ్ డిగ్రీ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులతో జేపీ సమావేశమయ్యారు. 'పౌర సేవల్ని మెరుగుపరచటానికి నూతన నిర్వహణ పద్ధతులు'పై చర్చించారు.



ప్రభుత్వమంటే రాచరికం కాదు, ప్రజలకు సేవ చేసే ఉమ్మడి సంస్థ అని జేపీ అన్నారు. ప్రభుత్వానికి గుత్తాధిపత్యం లేకుండా స్వేచ్ఛాయుత పోటీని, పారదర్శకతను పెంచితే ప్రజలకందాల్సిన సేవలు మెరుగవుతాయన్నారు. స్కీముల మీద ఎంత ఖర్చు చేస్తున్నారనేదాని కన్నా, వాటి ద్వారా ఎలాంటి ఫలితాలు వస్తున్నాయన్నదే మనకు ముఖ్యం కావాలన్నారు. 'పాలనా దారిద్ర్యం వల్ల విద్య, ఆరోగ్య రంగాల్లో ఒక దేశంగా మనం ఘోరంగా విఫలమయ్యాం. మనకున్న సామర్థ్యానికి, మనం సాధించిన విజయాలకు మధ్య అంతరం భారీగా ఉంది' అన్నారు. మన దేశంలో ప్రతి ముఖ్యమంత్రీ ప్రధానమంత్రిలా వ్యవహరిస్తున్నారని జేపీ అన్నారు. లంచం తీసుకున్న వాళ్లకు రక్షణ కల్పిస్తూ, గతి లేక లంచం ఇచ్చే ప్రజలను జైళ్లలో పెట్టే చట్టాన్ని తెచ్చి, అవినీతిపై పోరాడుతున్నట్లు పార్టీలు నాటకాలాడుతున్నాయన్నారు. పేద, మధ్యతరగతి ప్రజలకు న్యాయం జరగాలంటే పాలనా పద్ధతులు సమూలంగా మారాలని అన్నారు. ప్రజలు కట్టిన ప్రతి రూపాయి సద్వినియోగమయ్యేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. సమాజంలో సమస్యల పరిష్కారానికి అధునాతన సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించాలన్నారు. ఈ చర్చ ప్రతి ఇంటిలోనూ జరగాలన్నారు. వ్యవస్థలను ఆధునికం చేసుకుంటూ పారదర్శకత, జవాబుదారీతనంతో ఫలితాలు సాధించుకుంటూ స్థానిక ప్రభుత్వాలను బలోపేతం చేసుకుంటే మెరుగైన ఫలితాలు వస్తాయన్నారు. ప్రభుత్వాలు అనవసర ఆర్భాటాలకు పోకుండా ప్రజలకు శాంతి భద్రతలు, విద్య, వైద్యం, తాగునీరు వంటి మౌలిక సేవల్ని అందించాలన్నారు. విద్యార్థులు మొక్కుబడి నినాదాలకు పరిమితంకావద్దని జేపీ సూచించారు. విషయాల గురించి పరిజ్ఞానాన్ని పెంచుకోవటం మీద దృష్టి పెట్టాలన్నారు. వ్యవస్థలో లోపాల్ని ప్రశ్నిస్తూ పరిష్కరించే శక్తిని పెంచుకోవాలన్నారు.

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ బ్రిటిష్ హై కమిషనర్ హెచ్.ఇ ఆండ్రూ ఫ్లెమింగ్ మాట్లాడుతూ, బ్రిటన్‌లో కొన్ని దశాబ్దాల వరకూ ఉన్న ఉదాసీనతను, పాలనా వైఫల్యాలను ప్రజల భాగస్వామ్యంతో అధిగమించామన్నారు. కృత్రిమ మేధను, నెట్‌వర్కింగ్‌ను సమర్థవంతంగా వినియోగించుకుంటే పౌర సేవలు బాగా అందుతాయన్నారు. యువత అవకాశాలను ఉపయోగించుకుని తమ భవిష్యత్తుకు బంగారుబాట వేసుకోవాలన్నారు. బ్రిటన్‌లో ప్రజాసమస్యలపై అవగాహన పెంచటంలో యువ పార్లమెంట్ సభ్యులు చేసిన కృషిని ఆయన ప్రశంసించారు. విద్యార్థులు తమ సమయాన్ని అనవసర పనులకు, వ్యసనాలకు ఉపయోగించకుండా, ఇలాంటి కార్యక్రమాల ద్వారా సద్వినియోగం చేసుకోవాలని ప్రిజమ్ కళాశాల ప్రిన్సిపల్ గోపాలకృష్ణమూర్తి కోరారు.

# లోక్‌సత్తా ఎజెండాను విస్తృతంగా ప్రచారం చేయండి..
# పోటీ మాత్రం పరిమితంగానే చేయండి

## మునిసిపోల్స్‌పై పార్టీ తెలంగాణ నేతలకు జేపీ దిశానిర్దేశం

ఫ్యూడల్ సంస్కృతి నుంచి బైటపడి కాస్త కీర్తికండూతిని తగ్గించుకుని ప్రజాస్వామికంగా పనిచేయటం మొదలుపెడితే ఇప్పుడు చేస్తున్న దాని కంటే గొప్ప పనులు మన ద్వారా జరుగుతాయని లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ సూచించారు. లక్ష్యాన్ని మరచిపోయి ప్రచారాలు, ప్రక్రియల్లో కొట్టుకుపోతుండం వల్లే.. సమాజం కోసం ఆలోచించే గొంతులు మూగపోతున్నాయన్నారు. రాజకీయం, నాయకత్వం అంటే ఉమ్మడి అవసరాల కోసం పనిచేయటమని.. మనకలక్ష్యమేంటో మనకు స్పష్టంగా ఎప్పుడూ గుర్తుంటే సంఘటితంగా పనిచేయటానికి భేషజాలకు పోమని అన్నారు. లోక్‌సత్తా పార్టీ తెలంగాణ విభాగం ఆధ్వర్యంలో 'రానున్న మునిసిపల్ ఎన్నికలు – ప్రజల ఎజెండా' అంశంపై విస్తృతస్థాయి సమావేశం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞానకేంద్రంలో జరిగింది. లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మనపల్లి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస వర్మ, రెండు తెలుగు రాష్ట్రాల సమన్వయకర్త కటారి శ్రీనివాస్‌రావు పాల్గొన్న కార్యక్రమానికి జేపీ ముఖ్య అతిథిగా హాజరై దిశానిర్దేశం చేశారు. తెలుగునాట ప్రారంభమై దేశంలో కొత్త రాజకీయానికి నాంది పలికిన లోక్‌సత్తా పార్టీ ఎజెండాను ప్రజల్లోకి విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లటానికి మునిసిపల్ ఎన్నికల్ని అవకాశంగా ఉపయోగించుకోవాలని జేపీ కోరారు.




అధికార కేంద్రీకరణను తీవ్రంగా వ్యతిరేకిస్తూ స్థానిక ప్రభుత్వాల సాధికారతను ఫెడరల్ వ్యవస్థలో భాగంగా గుర్తించే పార్టీ లోక్‌సత్తా అన్నారు. ముఖ్యమంత్రి, ప్రధానమంత్రి ఎన్నికల్లో కన్నా మునిసిపల్ ఎన్నికల్లో సరిగా ఓటును వినియోగించుకుంటే.. ప్రజలకు ఎక్కువ మేలు జరుగుతుందన్నారు. అందుకే ప్రజల్ని ప్రభువులుగా నిలిపేలా 'ఇంటి ముందు ప్రభుత్వం – కంటి ముందు పాలన' కోసం పనిచేస్తున్న లోక్‌సత్తా ఎజెండాను తెలంగాణలో ఇంటింటికీ తీసుకెళ్లాలన్నారు.

ప్రత్యేక రాష్ట్రం ద్వారా ప్రజలు ఆకాంక్షించిన స్థానిక స్వయంపాలన లోక్‌సత్తా చెబుతున్న రీతిలో స్థానిక ప్రభుత్వాల సాధికారతతోనే సాధ్యమని జేపీ అన్నారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి నిధులు రాకపోతే వార్తల్లోకి వస్తోంది కానీ, అదే రీతిలో స్థానికంగా ఉండే మునిసిపాలిటీలు, పంచాయతీలకు నిధుల్ని రాష్ట్రం ఇవ్వకపోతే పట్టించుకోవటం లేదన్నారు. రాష్ట్ర బడ్జెట్ నుంచి కనీసం 25 శాతం నిధుల్ని నేరుగా మునిసిపాలిటీలకు, ఇతర స్థానిక ప్రభుత్వాలకు కేటాయించాలన్నారు. నిధులు దుర్వినియోగం కాకుండా జవాబుదారీతనం కోసం అంబుడ్స్‌మన్‌ను ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో లంచాలు, వేధింపులు లేకుండా పనులు చేసేందుకు హక్కుగా పౌర సేవల చట్టాన్ని ప్రజలకు పరిహారం చెల్లింపు నిబంధనతో అమలు చేయాలన్నారు. ఎజెండాను ఇలా విస్తృతంగా ప్రచారం చేస్తూ.. పోటీని మాత్రం స్పందన ఎక్కువగా ఉండే ఎంపిక చేసిన చోట్ల చేయాలని సూచించారు. గెలుపోటములను పట్టించుకోవాల్సిన పనిలేదని, దీర్ఘకాలిక పోరాటంగా లోక్‌సత్తా పార్టీ కృషి చేయాలన్నారు.

దిశ హత్యాచారం కేసులో పోలీసులు చేసిన ఎన్‌కౌంటర్ మనకు రక్షణ ఇస్తుందా? మరింత ప్రమాదంలోకి నెడుతుందా?.. అందరూ ఆలోచించాలని జేపీ అన్నారు. సినిమాల్లో జరిగినట్లుగా వెంటనే పరిష్కారం చూపడం సరైంది కాదని, దీనివల్ల సమాజానికి భద్రతలేని పరిస్థితులు ఏర్పడతాయన్నారు. తాను ఓ జిల్లా కలెక్టర్‌గా ఉన్నప్పుడు కొంతమంది మహిళలు వచ్చి తమ మానప్రాణాలు కాపాడమని కోరారన్నారు. ఓ తెగ నాయకుడు ఇళ్లల్లోకి చొరబడి భర్త రెక్కలు కట్టేసి వారి ముందే భార్యలను మానభంగం చేస్తున్నాడని ఫిర్యాదు చేశారన్నారు. ఆ తెగ నాయకుడ్ని అరెస్టు చేయలేకపోతే షూట్ చేసైనా తీసుకురావాలని జిల్లా ఎస్పీకి ఆదేశాలిచ్చానన్నారు. వారం రోజుల్లో ఆ వ్యక్తి కత్తులతో పోలీసులపై ఎటాక్ చేయటంతో చంపేశారన్నారు. పౌరసంఘాలు, వామపక్ష తీవ్రవాదులు సహా ఎవరూ ఆ ఘటనను వేలెత్తి చూపలేక పోయాం న్నారు. అలాంటివి కేవలం అత్యంత అరుదైన సందర్భాలు మాత్ర మేనని, చట్టబద్ధ పాలన లేకుండా ఎన్‌కౌంటర్లే పరిష్కాం మనుకోవటం ప్రమాదకరమని అన్నారు. దిశ కేసు ఓటు బ్యాంకు కోణంలో పరిష్కారమైందే తప్ప చట్టబద్ధంగా కాలేదన్నారు. దిశ కేసులో నిందితుల ఎన్‌కౌంటర్‌తో ఎన్నికలకు వెళితే నూటికి 80 మంది మహిళలు కేసీఆర్‌కే ఓటు వేస్తారని, అది రాజకీయమని అన్నారు. మన దేశ పరిస్థితుల్లో కొన్ని సందర్భాల్లో ఉరి శిక్ష అవసరమేనన్నారు. చట్టబద్ధపాలన, స్థానిక ప్రభుత్వాల సాధికారత, అందరికీ నాణ్యమైన విద్య, ఆరోగ్యం, మౌలిక రాజకీయ సంస్కరణలు, ప్రభుత్వ కార్యాలయాల్లో జవాబుదారీతనం, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసి రైతులకు మేలు చేసే విధానాలు అమలై ప్రజలు తలెత్తుకుని బతికే పరిస్థితి వస్తే తాను హాయిగా రాజకీయాల నుంచి రిటైరవుతానన్నారు.

**ఐదుగురితో కమిటీ**

తెలంగాణలో మునిసిపల్ ఎన్నికలు, ప్రజల ఎజెండా రూపకల్పన లోక్‌సత్తాను సంస్థాగతంగా బలోపేతం చేసేందుకు ఐదుగురితో నూతన కార్యాచరణ కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీలో తుమ్మనపల్లి శ్రీనివాస్, కటారి శ్రీనివాసరావు, రామరాజు, దోసపాటి రాము, శ్రీనివాస వర్మ ఉన్నారు. కమిటీ సూచన మేరకు తుది నిర్ణయం తీసుకుంటామని జేపీ తెలిపారు. లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర కార్యదర్శి బొర్ర శివరామకృష్ణ, జీహెచ్‌ఎంసీ అధ్యక్షుడు దోసపాటి రాము, నేతలు పాల్గొన్నారు.


ISB | Bharti Institute of Public Policy
FDR FOUNDATION FOR DEMOCRATIC REFORMS
हैदराबाद विश्वविद्यालय University of Hyderabad
INDIAN DEMOCRACY AT WORK
ANNUAL CONFERENCE SERIES
Theme for 2020
MONEY POWER IN POLITICS
09 -10 January 2020
Venue : Indian School of Business, Hyderabad
Inaugural Address on 9th January 2020 by
Shri M. Venkaiah Naidu
Honourable Vice-President of India
Key Speakers
Amit Varma Writer, Columnist and Podcaster
C Anjaneya Reddy Former DG Vigilance and Enforcement
Ashok Lavasa Election Commissioner of India
Ashutosh Varshney Director, Centre for Contemporary South Asia, Brown University
N Bhaskara Rao Director, Center for Media Studies
Justice Chelameswar Former Judge, Supreme Court of India
Carolyn Elliott University of Vermont professor emerita and India scholar
Irfan Nooruddin Professor, School of Foreign Service, Georgetown Unversity
Jagannanthan R Editorial Director Swarajya Magazine
Jayaprakash Narayan Founder, Foundation for Democratic Reforms
Jennifer Bussell Assistant Professor, University of California, Berkeley
Kavitha Rao Former MP, TRS
Milan Vaishnav Director, South Asia Program , CEIP
Natasha Jog Election Integrity Lead, India, South Asia - Facebook
Neelanjan Sircar Senior Research Fellow, Centre for Policy Research
K. Padmanabhaiah Former Home Secretary, Government of India
Prashant Kishor Political Strategist and Politician
Priyanka Chaturvedi Deputy Leader, Shiv Sena
Rajeev Gowda Politician, Indian National Congress
Ram Madhav National General Secretary, BJP
Shareen Joshi Assistant Professor, Georgetown University
Sitaram Yechury Secretary General, CPI(M)
Yamini Aiyar President, Centre for Policy Research
and many more...

RNI. Regd No. 69976/98 Postal Reg. No. HD-913/2018-2020 Published on 10th January, 2020 Posting Date 15 &16th of every month

“హింసలేకుండా, ద్వేషం లేకుండా, అందరికీ అవకాశాలు కల్పిస్తూ, అందరినీ ఇముడ్చుకుంటూ జాతి నిర్మాణం చేయాలంటే, మనం పిరికిపందల్లా పారిపోకుండా సమస్యలను ధైర్యంగా ఎదుర్కోవాలి. అదే వివేకానంద చెప్పింది. బలమే జీవితం, బలహీనతే మరణం. పిరికిపందలతో మనం జాతి నిర్మాణం చేయలేము, సమస్యను ఎదుర్కోలేము. బలహీనులతో, అర్భకులతో దేశాన్ని బతికించలేము. బలం కావాలి, మానసిక బలం కావాలి, శారీరక బలం కావాలి, చాతుర్యం కావాలి. గాల్లో దీపం పెట్టి దేవుడా, దేవుడా అని పూజ చేస్తే దేవుడు వచ్చి రక్షించడు. వివేకానందుడు మళ్లీమళ్లీ తన జీవితమంతా చెప్పిందదే. దేవుడి గురించి పెద్దగా మాట్లాడడాయన. జీవితంలో ఆయన మనిషిని గూర్చే మాట్లాడారు. ఈ జాతిని గూర్చి మాట్లాడారు.”

- డాక్టర్ జయప్రకాష్ నారాయణ్,
ఫౌండేషన్ ఫర్ డెమోక్రాటిక్ రిఫార్మ్స్ (ఎఫ్‌డీఆర్),
లోక్‌సత్తా వ్యవస్థాపకులు, యూత్ ఫర్ బెటర్ ఇండియా (వైబీఐ) మెంటార్

(జనవరి 12న వివేకానంద జన్మదినోత్సవం, జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా)






# BOOK POST

## PRINT MATTER

*If undelivered please return to:*

*LOKSATTA UDYAMA SAMSTHA,*
*Tulips Apartments, 6-3-655,*
*Flat.No. 407,*
*Behind civil supplies office,*
*Somajiguda,*
*Hyderabad - 500 082*

Edited, Printed and Published by Dr. Jayaprakash Narayan, National Coordinator, Loksatta for and behalf of Foundation for Democratic Reforms, Tulips Apartments, 6-3-655, Flat.No. 407, Behind civil supplies office, Somajiguda, Hyderabad - 500 082. Printed at Kala Jyothi Process Pvt Ltd, 1-1-60/5, RTC “X” Roads, Hyderabad 500 020